సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 81

బుధవారం 12-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'




గెలిచి నిలిచిన పాక్

కెనడాపై 7 వికెట్లతో విజయం. రాణించిన ఆమిర్, రిజ్వాన్ - 14లో



తదుపరి ఆర్మీ చీఫ్ ఉపేంద్ర

ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం.. 30న బాధ్యతల స్వీకరణ - 6లో



నీట్ గౌరవం దెబ్బతింటుంది

పేపర్ లీకేజీ, నిర్వహణ లోపాల పేరిట నీట్ పరీక్షను మళ్లీ నిర్వహిస్తే దానికున్న గౌరవం దెబ్బతింటుందని సుప్రీంకోర్టు పేర్కొంది.

- వివరాలు 6లో



గిరిజన బిడ్డకు సీఎం కిరీటం

ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా గిరిజన బిడ్డ మోహన్ చరణ్ మాఝీ (52) బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

- వివరాలు 6లో



ప్రియాంక పోటీచేస్తే మోదీ ఓడేవారు

వారణాసి నుంచి మోదీపై ప్రియాంకా గాంధీ పోటీ చేసి ఉంటే 2-3 లక్షల ఓట్ల తేడాతో నెగ్గేవారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



ఈవీఎంలలో గోల్‌మాల్?!

లోక్‌సభ ఎన్నికల్లో చాలా స్థానాల్లో పోలైన, లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్యలో తేడా నమోదైనట్లు 'ద వైర్' వార్తాసంస్థ పేర్కొంది.

- వివరాలు 6లో

కేసీఆర్‌కు నోటీసులు

విద్యుత్ రంగ నిర్ణయాల్లో పాత్రపై జారీ చేశామన్న జస్టిస్ నరసింహారెడ్డి



మాజీ సీఎం సహా 25 మందికి గత ఏప్రిల్‌లోనే నోటీసులు ఇచ్చాం

- కేసీఆర్ మినహా అందరూ రాతపూర్వకంగా బదులిచ్చారు
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూలై 31 వరకు ఆయన గడువు కోరారు
- జూన్ 15లోగా ఇవ్వాలని చెప్పాం..కానీ ఇప్పటివరకు వివరణ అందలేదు
- నిర్ణయాలన్నీ గత సర్కార్‌వేనని ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ చెప్పారు
- ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది
- భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీతో ఏటా రూ.300 కోట్ల అదనపు భారం
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్



సాక్షి, హైదరాబాద్: కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి బదులుగా నామినేషన్ల ప్రాతిపదికన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోవడం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిర్మించాలని నిర్ణయం తీసుకోవడంలో పాత్రపై మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు గత ఏప్రిల్‌లో నోటీసులు జారీ చేసినట్లు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. కేసీఆర్ సహా మొత్తం 25 మంది అధికారులు, అనధికారులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందంతో పాటు విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే రాష్ట్ర ఇంధన శాఖ మాజీ ముఖ్య కార్యదర్శులైన సురేష్ చందా, ఎస్కే జోషీ, అరవింద్‌కుమార్‌లతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు, బీహెచ్ఈఎల్ మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలను విచారించారు. ఈ నేపథ్యంలో జస్టిస్ నరసింహారెడ్డి మంగళవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

జగదీశ్‌రెడ్డికి నోటీసులు ఇవ్వలేదు

'విద్యుత్ నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్ల పరిశీలనలో మీ పాత్రను గుర్తించామని, దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ అందరికీ నోటీసులు ఇచ్చాం. కేసీఆర్ మినహా నోటీసులు అందుకున్న మిగతా వారంతా గడువులోగా తమ పాత్రపై రాతపూర్వకంగా వివరణ అందజేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తీరిక లేకుండా ఉన్నానని, జూలై 31 వరకు గడువు పొడిగించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేయగా, జూన్ 15 వరకు కమిషన్ గడువు పొడిగించింది. అయితే ఇప్పటికీ కేసీఆర్ నుంచి వివరణ అందలేదు. కొందరి వివరణలు సంతృప్తికరంగా లేకపోవడంతో అదనపు సమాచారం కోరుతూ మళ్లీ నోటీసులు జారీ చేశాం. నిర్ణయాల్లో

మిగతా 2వ పేజీలో ▶

యాదాద్రి ఇప్పట్లో పూర్తయ్యేలా లేదు

యాదాద్రి, భద్రాద్రి కేంద్రాలను రెండేళ్లలో నిర్మిస్తామని చెప్పి గడువులోగా పూర్తి చేయలేకపోయారు. యాదాద్రి కేంద్రాన్ని ఇటీవల సందర్శించగా, సమీప భవిష్యత్తులో పూర్తయ్యే పరిస్థితి కనిపించలేదు. కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా టెండర్లు నిర్వహించకుండా బీహెచ్ఈఎల్‌కు నామినేషన్ల విధానంలో పనులు అప్పగించారు. బీహెచ్ఈఎల్ మాజీ, ప్రస్తుత సీఎండీలను పిలిపించి విచారించగా, అవకతవకలు జరిగినట్టు అనుమానాలు ఉన్న అంశాల (గ్రే ఏరియాస్)పై పరిశీలన జరుపుతామని బదులిచ్చారు. తాను స్వల్పకాలం పాటే ఇంధన శాఖలో పనిచేశానని, అప్పట్లో ఎలాంటి నిర్ణయాలు జరగలేదని, కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయని సురేష్ చందా చెప్పారు..' అని జస్టిస్ నరసింహారెడ్డి వెల్లడించారు.

పాత పద్ధతిలోనే రైతుభరోసా!



తొలుత ఎకరానికి రూ.5 వేలు.. ప్రభుత్వ యోచన

- వచ్చే నెల ఎకరానికి మరో రూ.2,500 ఇవ్వాలని భావిస్తున్న సర్కారు
- గత యాసంగి సీజన్‌లో ఇచ్చిన రైతులకే ఈసారి కూడా..
- రైతుభరోసా మార్గదర్శకాలు ఖరారు కాకపోవడమే కారణం
- ఇప్పటికే ప్రారంభమైన వానాకాలం సీజన్

సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్ వరకు పాత పద్ధతిలోనే రైతుభరోసా (రైతుబంధు) అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటివరకు ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు కాకపోవడం, వానాకాలం సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో సర్కారు ఈ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. వ్యవసాయ శాఖ కూడా ఇదే ప్రతిపాదనను ప్రభుత్వం ముందుంచింది. గత యాసంగి సీజన్‌లో ఇచ్చిన రైతులకే ఈసారి కూడా రైతుభరోసా సొమ్ము ఇస్తారు. వాస్తవంగా ప్రతి ఏడాది జూన్‌లోనే రైతుబంధు సొమ్ము ఇస్తారు. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే ఇవ్వాలన్నది రైతుబంధు నిబంధన.

సీజన్‌కు ఎకరానికి రూ.7,500 ఇస్తామన్న కాంగ్రెస్

రైతుబంధు పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొదట్లో ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.4 వేల చొప్పున ప్రతి రైతుకు అందజేశారు. అలా ఏడాదికి ఎకరానికి రూ.8 వేల

మిగతా 8వ పేజీలో ▶

24 నుంచి పార్లమెంట్

జూలై 3 వరకు కొనసాగనున్న ప్రత్యేక సమావేశాలు

- తొలి రెండు రోజులు ప్రమాణ స్వీకారం చేయనున్న నూతన ఎంపీలు
- లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా కొడికున్నిల్ సురేశ్!
- సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్ ఎన్నిక

6 లో



ఉగ్ర దుర్భేద్యంగా భారత్‌ను నిర్మిస్తా

- దేశం, ప్రజల భద్రతే నాకు ముఖ్యం
- కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వేళ అమిత్ షా వ్యాఖ్య

- వివరాలు 6లో





రేపు కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, సంజయ్ బాధ్యతలు

చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాతే బాధ్యతలు చేపట్టనున్న ఏపీ కేంద్ర మంత్రులు

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

ఎడ్‌సెట్‌లో అబ్బాయిలదే హవా



రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ ఎడ్‌సెట్-2024 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ పరీక్ష రాసిన వారిలో ఎక్కువ మంది అమ్మాయిలే ఉన్నారు. అయితే తొలి పది ర్యాంకుల్లో అబ్బాయిలకే ఎనిమిది లభించాయి.

- వివరాలు 8లో

ఆర్టీసీ టికెట్ ధరల్లో స్వల్ప పెరుగుదల



ఆర్టీసీ టికెట్ చార్జీల్లో టోల్ గేట్ రుసుములు (యూజర్ చార్జీలు) పెరిగాయి. టోల్‌ప్లాజాలు ఉన్న మార్గాల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సుల టికెట్ ధరలు రూ.3 చొప్పున పెరిగాయి.

- వివరాలు 7లో

విదేశాల్లో ప్రభాకర్‌రావు, శ్రావణ్

- ట్యాపింగ్ కేసులో కోర్టులో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు
- భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

5 లో

ఊరూరా విధ్వంసాలు, వేధింపులు

ఏపీలో కొనసాగుతున్న టీడీపీ నేతల దౌర్జన్యకాండ...

- చంద్రబాబు, లోకేశ్ అండతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను చంపుతామని బెదిరింపు
- ఊరొదిలి వెళ్లాలని పోలీసుల ఉచిత సలహా
- తెనాలిలో, సత్తెనపల్లి మండలంలో ఇద్దరు నేతలపై హత్యాయత్నం
- నేడు రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్న వైఎస్సార్‌సీపీ
- ఇప్పటికే ఢిల్లీ చేరుకుని అపాయింట్‌మెంట్ కోరిన ఎంపీల బృందం
- జాతీయ మీడియాకు ఏపీలో పరిస్థితిని వివరించనున్న ఎంపీలు
- రాష్ట్రంలో బీభత్సకాండపై సుప్రీంకోర్టు తలుపు తట్టిన వైఎస్సార్‌సీపీ.. హైకోర్టుకు వెళ్లాలని సుప్రీం సూచన.. వెంటనే పిటిషన్ దాఖలు.. 13న విచారణ

12 లో

ప్రజాపాలన అందిస్తాం

- రాజధాని అమరావతే.. ఆర్థిక రాజధానిగా విశాఖ
- ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు
- ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు.. ప్రతిపాదించిన పవన్, బలపరిచిన పురందేశ్వరి
- ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానించిన గవర్నర్

12 లో

నేడు ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణం

మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసే అవకాశం

- గన్నవరం ఐటీ పార్కు వద్ద ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, పలువురు ఎన్డీయే నేతలు
- ప్రత్యేక అతిథులుగా రజనీకాంత్, చిరంజీవి

12 లో

ఇదండీ సంగతి





కొల్లగొట్టిన సొమ్ము

ఏం చేశారు?

- గొర్రెల స్కాంలో ఇంకెందరు?
- నిందితులు కల్యాణ్, రామ్‌చందర్‌లపై ఏసీబీ ప్రశ్నలు
- నేడు మరోమారు కస్టడీలోకి తీసుకోనున్న ఏసీబీ

- వివరాలు 5లో

క్లుప్తంగా...

రెరా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి: రేవంత్



సీఎంను కలిసిన రెరా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు ప్రదీప్, చిత్రా రాంచంద్రన్

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రెగ్యులరైజేషన్ అథారిటీ (రెరా) చట్టాన్ని రాష్ట్రంలో కఠినంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చిత్రా రాంచంద్రన్ మంగళవారం సచివాలయంలో సీఎంను కలిశారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన వీరు రెరా చట్టంలోని లోటుపాట్ల గురించి ఈ సందర్భంగా సీఎంతో చర్చించారు. రియల్ ఎస్టేట్ రంగంలో కొనుగోళ్లు, అమ్మకాలు పారదర్శకంగా ఉండేలా, కొనుగోలు దారులు మోసపోకుండా చట్టాన్ని అమలు చేయాలన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్న మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌తో కలిసి సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కూడా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిశారు. మల్లన్నతో పాటు చామల కిరణ్‌ను తుమ్మల శాలువా కప్పి సన్మానించారు.

ఏ సమస్య ఉన్నా నేరుగా నా దగ్గరకు రండి

విద్యార్థి, నిరుద్యోగులకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యార్థి, నిరుద్యోగులకు ఎలాంటి సమస్య ఉన్నా తన దగ్గరకు నేరుగా రావాలని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కోరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం విద్యార్థులను, నిరుద్యోగులను కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి, నిరుద్యోగులెవరూ ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దని, గత ప్రభుత్వంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుతూ తాము ముందుకెళ్తున్నామని చెప్పారు. అయినప్పటికీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు కొన్ని యూట్యూబ్ చానల్స్ పెట్టి ప్రభుత్వంపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని వెంకట్ ఆరోపించారు. తప్పుడు ప్రచారానికి తోడు తప్పుడు పత్రాలు సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పెట్టి నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏదైనా తప్పు చేస్తే విమర్శించే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, కానీ అధికారం దక్కలేదనే అక్కసుతో తప్పుడు ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. గురుకుల, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్షలు రాసిన అభ్యర్థులెవరూ ఆందోళన చెందవద్దని వెంకట్ భరోసా ఇచ్చారు.

వెట్టిని జయించి.. పది పూర్తి చేసి

‘బడీడు పిల్లల్ని పనిలో పెట్టుకోవడం నేరం’.. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రధాన సారం ఇదే. కానీ ఇప్పటికీ పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ఘటనలు నిత్యం వెలుగు చూస్తూనే ఉన్నాయి. పిల్లలతో పని చేయిస్తున్న ఘటనలను బాధ్యతగల పౌరులో, సామాజిక కార్యకర్తలో ఇచ్చే ఫిర్యాదులపై అధికారులు స్పందించి రెస్క్యూ ఆపరేషన్ చేసి వారిని పునరావాస కేంద్రాలకు పంపించడం చూస్తూనే ఉంటాం. సరిగ్గా కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా టేకల్ తాలూకాలోని ఓబట్టు గ్రామంలో ఆరేళ్ల క్రితం చేసిన రెస్క్యూ ఆపరేషన్ ఎంతో మంది పిల్లలను పుస్తకాల బాట పట్టించింది. ఓ క్వారీలో పది కుటుంబాలను వెట్టిచాకిరీ చేయిస్తున్న దారుణంపై స్పందించిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం వారికి విముక్తి కలిగించి సొంత రాష్ట్రానికి పంపింది. అలా వచ్చిన కుటుంబాలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోతీనగర్‌లో జీవనం సాగిస్తున్నాయి. ఆ ఆపరేషన్ తర్వాత ఆయా కుటుంబాల్లోని పిల్లలను వివిధ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్పించారు. ఆ క్రమంలో చదువును సాగించిన వారిలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు పదోతరగతి పాసై పైచదువుల కోసం ఉత్సాహంతో ముందుకెళ్తున్నారు. వారి కుటుంబంలో పదోతరగతి చదివిన తొలితరం కూడా అదే. బుధవారం అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కథనం.



అక్కాచెల్లెళ్ల విజయగాథ • ఆ కుటుంబంలో టెన్త్ చదివిన తొలి తరం పిల్లలు వీరే

“నేడు అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం”

సాక్షి, హైదరాబాద్: ఉపాధి కోసం కర్ణాటక రాష్ట్రం టేకల్ తాలూకా ఓబట్టు గ్రామంలోని ఓ క్వారీలో పనిలో చేరింది అనూష, నందిని కుటుంబం. తల్లిదండ్రులు మంజుల, శ్రీనివాస్ నిరక్షరాస్యులు. వారికి తెలిసిందల్లా కూలి పనిచేయడం. క్వారీ యజమాని చెప్పిన మాయమాటలకు నమ్మి తెల్లకాగితాలపై వేలిముద్రలు పెట్టి అక్కడ బాండెడ్ లేబర్‌గా మారిపోయారు. రోజుకు 14 గంటల పాటు పని చేస్తూ చిత్రవధను అనుభవించారు. తల్లిదండ్రులకు సహాయంగా పిల్లలు సైతం చేతులు కలిపేవారు. అక్కడ జరుగుతున్న తంతును గుర్తించిన ఓ సామాజిక కార్యకర్త జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో 2018లో యంత్రాంగం చేసిన రెస్క్యూ ఆపరేషన్ ద్వారా విముక్తి పొందారు. ఆ తర్వాత శ్రీనివాస్ కుటుంబం పొట్ట చేతపట్టుకుని మహబూబ్‌నగర్ టౌన్‌కు వచ్చి గుడిసె వేసుకుని కూలి పనితోనే జీవనం సాగిస్తూ వచ్చింది. ఈ సమయంలోనే పిల్లలకు మెరుగైన జీవితం ఇవ్వాలనే ఆలోచనతో బడికి పంపాలని శ్రీనివాస్ నిర్ణయించుకున్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇతరుల సాయంతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అనూష, నందినిలను చేర్పించారు. ఇప్పుడు ఇద్దరు పిల్లలు పదోతరగతి పాసయ్యారు. పై చదువులు చదువుకుంటాననే ఆసక్తి వెలిబుచ్చుతూ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

వాళ్లు చదువుకోకున్నా మమ్మల్ని మాత్రం చదివిస్తున్నారు: నందిని

మాకు ఇల్లు లేదు. క్వారీ ప్రాంతంలో పుట్టి, అక్కడే పెళ్లి చేసుకుని ప్రసవించింది మా అమ్మ. ఒక క్వారీ నుండి మరో క్వారీకి మారుతూ జీవించారు. ఎందుకంటే వారికి తెలిసిన ఏకైక జీవితం అదే. వారికి ఆధార్ కార్డు గురించి తెలియదు. ఓటు వేయడం కూడా తెలియదు. అయినప్పటికీ బాండెడ్ లేబర్ నుంచి విముక్తి పొందిన తర్వాత మమ్మల్ని చదివించాలనే ఆలోచన వచ్చింది. పది పూర్తి చేసినందుకు మాకు ఎంతో సంతోషంగా ఉంది.

నర్సు ఉద్యోగం చేస్తా: అనూష

కోవిడ్-19 సమయంలో మా ఇబ్బందులు చెప్పుకునేందుకు మాటలు లేవు. హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లిపోయాక ఏమీ అర్థం కాకపోయేది. ఇల్లు లేకపోవడంతో పుస్తకాల బ్యాగులు ఎక్కడ దాచుకోవాలో అర్థం కాలేదు. చాలా ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు పదోతరగతి పాసవడం ఆనందంగా ఉంది. మా చదువు ఇంతటితో ఆగదు. నర్సు కోర్సు పూర్తి చేయాలని మేమిద్దరం లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.

ఆదాయం పెంచే మార్గాలను చూడండి

గనుల తవ్వకాలపై వార్షిక కేలండర్ రూపొందించండి
- అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: గనుల తవ్వకాలతో పాటు ఇసుకకు సంబంధించిన వార్షిక కేలండర్ రూపొందించి, వెంటనే టెండర్లు పిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో గనుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా గనుల శాఖలో ఆదాయాల తీరును ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సమీక్షించారు. గనుల శాఖ ద్వారా గణనీయంగా ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని సూచించారు. మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల ప్రాజెక్టుల మరమ్మతుకు భూగర్భం నుంచి త్వరితగతిన ఇసుక తరలించాల్సిన అవసరం ఉందని సాగునీటి అధికారులు కోరినట్టుగా తనకు సమాచారం ఉందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల పరిధిలో మరమ్మతులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో నది తీరాల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం ఉన్న రీచ్‌లు, టెండర్లు, ఆదాయానికి సంబంధించిన సమగ్ర నివేదిక సిద్ధం చేసుకోవాలని, ఈ అంశంలో సాగునీటి శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పలు గ్రానైట్ క్వారీలకు అపరాధ రుసుము విధించి వేసి మూసివేశారని, వాటిని పూర్తిస్థాయిలో సమీక్షించాలని ఆదేశించారు. పట్టా భూముల పేరిట గోదావరి నదీ తీరం వెంట ఇష్టారీతిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, వీటిపై నిఘా పెట్టాలని సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క అధికారులను కోరారు. ఇసుక రీచ్‌లను ఆయా ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు కేటాయించడం, వ్యాపారం నిర్వహించేందుకు వారికి శిక్షణ, బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడం .. తద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం వంటి అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. ఇసుక ర్యాంపు నుంచి వినియోగదారునికి చేరేవరకు మధ్యలో దళారీ వ్యవస్థ లేకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చడం, ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక ఉండాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా మాఫియా కార్యకలాపాలుగానీ, రాష్ట్ర ఖజానాకు నష్టం జరిగే పని గానీ జరగకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి సీతక్క

నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి

సాక్షి, హైదరాబాద్: నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హితబోధ చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో 2023 బ్యాచ్ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు డిప్యూటీ సీఎం భట్టిని కలిశారు. ఐఏఎస్ అధికారి శశాంక్ గోయెల్ ట్రైనీ ఐఏఎస్‌లను భట్టికి పరిచయం చేశారు. శిక్షణలో ఉన్న అధికారులకు కేటాయించిన జిల్లాలు, గత ఎన్నికల్లో వారు నిర్వహించిన విధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ...ప్రజలకు చేసేందుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకోవాలన్నారు. శిక్షణ సమయంలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను ప్రజాసమస్యల్ని పరిష్కరించడంలో అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, కోర్సు డైరెక్టర్ ఉషారాణి, నోడల్ అధికారి శ్రీనివాస్ పెద్ద బోయిన ఉన్నారు.

ఆ సీట్లలో గెలిస్తే కేంద్రమంత్రులే!

తాజా లోక్‌సభ ఎన్నికల్లో నిజమైన బీజేపీ సెంటిమెంట్

- తెలంగాణలోని సికింద్రాబాద్, కరీంనగర్, ఏపీలో నరసాపురంలో గెలిచిన ఎంపీలకు మంత్రి పదవులు
- ఈసారి మోదీ కేబినెట్‌లో కిషన్‌రెడ్డికి మళ్లీ చోటు
- ఏళ్ల నుంచి పార్టీనే నమ్ముకున్న బండి సంజయ్, శ్రీనివాస వర్మకు అవకాశం
- గతంలోనూ ఈ స్థానాల్లో గెలిచి మంత్రులైన దత్తాత్రేయ, విద్యాసాగరరావు, కృష్ణంరాజు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నాయకుల్లో కొన్నేళ్లుగా బలపడిన సెంటిమెంట్ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లోనూ నిజమైంది. గత ముప్పై ఏళ్లుగా ఉమ్మడి ఏపీలో, ఇప్పుడు తెలంగాణలోనూ ఈ సెంటిమెంట్ బలపడుతూ వస్తోంది. ఉమ్మడి ఏపీలోని సికింద్రాబాద్, కరీంనగర్ నుంచి గెలిచిన బండారు దత్తాత్రేయ, సీహెచ్.విద్యాసాగరరావు, నరసాపురం నుంచి గెలిచిన రెబెల్‌స్టార్ యూవీ కృష్ణంరాజు గతంలో వాజ్‌పేయి కేబినెట్‌లో సహాయమంత్రులుగా పనిచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన ఎన్నికల్లోనూ సికింద్రాబాద్ నుంచి గెలిచిన దత్తాత్రేయ కేంద్ర సహాయమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత గవర్నర్‌గా నియమితులయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి గెలిచిన జి.కిషన్‌రెడ్డి తొలుత మోదీ కేబినెట్‌లో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి పదవిని నిర్వహించారు. ఆ తర్వాత ఆయన పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిశాఖ మంత్రిగా కేబినెట్ హోదా పొందారు. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచే గెలిచి తిరిగి మోదీ కేబినెట్‌లో ఈ దఫా బొగ్గు, గనులశాఖ మంత్రి అయ్యారు. ఇక గతంలో కరీంనగర్ నుంచి గెలిచిన విద్యాసాగరరావు వాజ్‌పేయి కేబినెట్‌లో కేంద్ర హోం శాఖ సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కరీంనగర్ నుంచి రెండోసారి గెలుపొందిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సైతం తాజాగా మోదీ మంత్రివర్గంలో అదే పదవిని పొందారు. ఉమ్మడి ఏపీలోని నరసాపురం నుంచి గెలిచిన సినీ హీరో కృష్ణంరాజుకు కేంద్ర సహాయమంత్రి పదవి దక్కగా, 2024 ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై గెలిచిన శ్రీనివాసవర్మకు మోదీ కేబినెట్‌లో గ్రామీణ సహాయమంత్రి శాఖ లభించింది.

ఎప్పుడూ అవే స్థానాలకు పదవులా?

గతంలో మాదిరిగానే సికింద్రాబాద్, కరీంనగర్ ఎంపీలకే మళ్లీ పదవులు కట్టబెట్టడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈసారైనా తెలంగాణలోని వెనకబడిన జిల్లాలైన మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాలకు మోదీ కేబినెట్‌లో చాన్స్ లభిస్తుందేమోననే ఆశాభావం వ్యక్తమైంది. కానీ మళ్లీ సికింద్రాబాద్, కరీంనగర్ ఎంపీలకే చోటు లభించడంతో కొందరు నిరుత్సాహపడటం కొసమెరుపు.

కరీంనగర్‌లో పొన్నం ట్యాక్స్

‘ఫ్లైయాష్’ రవాణాలో భారీ కుంభకోణం
- మంత్రి పొన్నం ఖాతాలోకి రోజూ రూ.50 లక్షలు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రామగుండం ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం నుంచి ఫ్లైయాష్ (బూడిద) తరలింపులో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. కరీంనగర్‌లో రేవంత్, పొన్నం ట్యాక్స్ అమలవుతున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు కేపీ. వివేకానంద, డాక్టర్ సంజయ్‌తో కలిసి తెలంగాణభవన్‌లో కౌశిక్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. 32 టన్నుల బూడిద తరలించాల్సిన లారీలో 72 టన్నులు తరలిస్తున్నారని, వే బిల్లుల్లో ఎన్ని టన్నులు తరలిస్తున్నారనే విషయం పేర్కొనడం లేదని చెప్పారు. బూడిద అక్రమరవాణా ద్వారా మంత్రి పొన్నం రోజూ రూ.50 లక్షలు సంపాదిస్తుండగా, ఆయన అన్న కుమారుడు అనూప్ ఈ వసూళ్లు చేస్తున్నారన్నారు. ఓవర్‌లోడ్‌తో వెళుతున్న 13 లారీలను ఇటీవల తాను స్వయంగా పట్టుకొని అధికారులకు అప్పగించినా, రెండు లారీలు సీజ్ చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలను తాను పట్టుకోవడంతో రూటు మార్చి హుస్నాబాద్ మీదుగా దందా కొనసాగిస్తున్నారని కౌశిక్‌రెడ్డి చెప్పారు. ఇకపై ఏ మార్గంలో ఫ్లైయాష్ తరలించినా బీఆర్‌ఎస్ కార్యకర్తలు పట్టుకుంటారని హెచ్చరించారు. ఓవర్‌లోడ్‌తో వెళుతున్న ఫ్లైయాష్ లారీల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల ఇంజనీరింగ్ విద్యార్థి అఖిల్ మరణించాడన్నారు.

ఎన్టీపీసీ వివరాలు దాచిపెడుతోంది

ఫ్లైయాష్ అక్రమ రవాణా జరుగుతున్నా, ఎన్టీపీసీ అధికారులు వివరాలు దాచిపెడుతూ చోద్యం చూస్తున్నారని కౌశిక్‌రెడ్డి అన్నారు. అధికారుల తీరుపై ఢిల్లీలో ఆ సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఓవర్‌లోడ్ దందాపై బీఆర్‌ఎస్ కేడర్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతుందన్నారు. తప్పులు చేస్తున్న అధికారుల వివరాలు రెడ్‌బుక్‌లో నమోదు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తప్పవని హెచ్చరించారు. హరీశ్‌రావుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అనవసర విమర్శలు చేస్తున్నారని, ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తే హరీశ్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేస్తారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు.

రోజుకు 50 లక్షలైతే.. పదేళ్లలో మీరెంత సంపాదించారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: ఫ్లైయాష్ రవాణాలో మంత్రి పొన్నం ప్రభాకర్ రోజుకు రూ.50 లక్షల సంపాదిస్తున్నారని లేనిపోని ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్.. పదేళ్ల బీఆర్‌ఎస్ అధికారంలో మీరెంత సంపాదించారో చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి సచివాలయ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ 2022 నుంచి కేంద్రం ఆధ్వర్యంలో టెండర్ ద్వారా ఎన్టీపీసీ బూడిదను అమ్ముతున్నారని, దీనిలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం ఉండదన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల రాజకీయ దయాదాక్షిణ్యాల కోసం మంత్రి పొన్నంపై చేసిన ఆరోపణలకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ఇచ్చిన ఏ హామీ అమలు చేయలేదని, ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ ఆగస్టు 15లోపు చేసి తీరుతామని, హరీశ్ తన రాజీనామా కోసం మాట మార్చి ఇప్పుడు ఆరు గ్యారంటీలపై మాట్లాడుతున్నారని సత్యం విమర్శించారు. మీ దగ్గర ఎమ్మెల్యేలు 39 అని చెబుతున్నా.. అది సున్నా కాబోతోందని తెలిపారు.

రేపు కేంద్రమంత్రులుగా కిషన్‌రెడ్డి, సంజయ్ బాధ్యతలు

చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాతే ఏపీ కేంద్రమంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రుల బాధ్యతల స్వీకారానికి ముహూర్తాలు ఖరారయ్యాయి. ఈనెల 13న ఉదయం 11 గంటలకు జి.కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి గా శాస్త్రి భవన్‌లోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ నార్త్ బ్లాక్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్రమంత్రులు సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం తర్వాత బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం లేదా శుక్రవారం, శ్రీనివాస వర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆహారాన్ని కల్తీ చేస్తే కఠినచర్యలు

హోటల్ యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి: మంత్రి దామోదర



అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: ఆహారాన్ని కల్తీ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో అనేక హోటళ్లలో నాసిరకం, కల్తీ, చెడిపోయిన ఆహారం బయటపడటంతో దానిపై మంత్రి ఆరా తీశారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయ గుర్తింపు ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి వ్యాపారవేత్త ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నామని, హోటల్ యాజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి 6 నెలలకు వర్క్‌షాపు నిర్వహణ, అవగాహన సదస్సు నిర్వహిస్తామని, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించారు. సమావేశంలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్ వీ కర్ణన్, డైరెక్టర్ ఫుడ్ సేఫ్టీ డాక్టర్ శివలీల, తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి, ఇండియన్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

అప్పటి విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పాత్ర ఉన్నట్టుగా ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో ఆయనకు నోటీసులు జారీ చేయలేదు..’ అని జస్టిస్ నరసింహారెడ్డి తెలిపారు.

ఎవరు నిర్ణయం తీసుకున్నారో పరిశీలిస్తున్నాం

‘ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణం అంశాల్లో నిర్ణయం ఎవరు తీసుకున్నారు? అనే అంశంపై విచారణ నిర్వహిస్తున్నాం. నిర్ణయాల్లో పాత్రలేని అధికారులు ఒక్కొక్కరిని తప్పించడం (ఎలిమినేషన్) ద్వారా అసలు నిర్ణయం తీసుకున్న వారెవరో గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాం. మూడు అంశాల్లోనూ నాటి ప్రభుత్వం నేరుగా నిర్ణయాలు తీసుకుందని జెన్‌కో, ఇతర విద్యుత్ సంస్థల పాత్ర లేదని ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు చెప్పారు. ఇక్కడ ప్రభుత్వం అంటే.. నిర్ణయం తీసుకుంది ఎవరు? అనే అంశం పరిశీలిస్తున్నాం..’ అని చెప్పారు.

ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీకి అధికారాలు పెద్ద తప్పిదం

‘ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంతో రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చినట్టుగా మా లెక్కల్లో తేలింది. ఒప్పందంపై కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ)కి బదులుగా ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీకి సర్వ అధికారాలు కట్టబెట్టడం పెద్ద తప్పిదం. 12 ఏళ్లకు ఒప్పందం జరిగితే, ఛత్తీస్‌గఢ్ కేవలం మూడు నాలుగేళ్ల మాత్రమే విద్యుత్ సరఫరా చేసి మానుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేయడానికి 2014లో ఆ రాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకోగా, నాటి రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌కే జోషీ దీనిపై సంతకం చేశారు. అయితే ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ప్రమేయం లేకుండానే 2016లో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) జరిగింది. జీఎస్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్ సీఎండీలు దీనిపై సంతకం పెట్టారు. అయితే అప్పటికి ఛత్తీస్‌గఢ్‌లో థర్మల్ విద్యుత్ కేంద్రం (మార్వా) నిర్మాణమే ప్రారంభం కాలేదని మా పరిశీలనలో తేలింది..’ అని జస్టిస్ నరసింహారెడ్డి తెలిపారు.

చర్యలు తీసుకోని ఈఆర్సీ

‘ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో తనకు ఎలాంటి సంబంధం లేదని అరవింద్‌కుమార్ వివరణ ఇచ్చారు. నామినేషన్ విధానంలో ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని, దీనికి బదులుగా విద్యుత్ కొనుగోళ్ల కోసం బహిరంగ టెండర్లను నిర్వహిస్తే బాగుంటుందని పేర్కొంటూ అరవింద్‌కుమార్ 2016 నవంబర్ చివరలో రాష్ట్ర ఈఆర్సీకి సుదీర్ఘ లేఖ రాయగా, ఈఆర్సీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తేలింది. ఈ లేఖ రాసిన వెంటనే తాను ఇంధన శాఖ నుంచి బదిలీకి గురైనట్టు అరవింద్‌కుమార్ తెలిపారు. 2000 మెగావాట్ల విద్యుత్‌ను దక్షిణాది రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసేందుకు అనుమతిస్తూ ఎస్‌కే జోషి తొలుత జీవో 22 జారీ చేశారు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్లకు వీలు కల్పించేలా ఈ జీవోను సవరిస్తూ దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్ కొనుగోలు చేసేందుకు అనుమతించారు. 1000 మెగావాట్ల ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కోసం 2000 మెగావాట్ల విద్యుత్ కారిడార్‌ను బుక్ చేసుకున్నారు. అందులో 1000 మెగావాట్ల లైన్లను కూడా ఎన్నడూ పూర్తిగా వాడుకోలేదు..’ అని వివరించారు.

ఈఆర్సీ మాజీ చైర్మన్‌ను విచారించేందుకు వీలుండదు

త్వరలో మరో మాజీ ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రాను విచారిస్తామని, టీజేఏసీ చైర్మన్ కె.రఘు, టీజేఎస్ అధినేత కోదండరాం, విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్ రావును కూడా పిలిపించి వారి వద్ద ఉన్న సమాచారాన్ని తెలుసుకుంటామని జస్టిస్ నరసింహారెడ్డి చెప్పారు. ఈఆర్సీ మాజీ చైర్మన్‌ను విచారించేందుకు వీలుండదని ఆయన ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

సూపర్ క్రిటికల్‌కి బదులుగా సబ్ క్రిటికల్ టెక్నాలజీతో ‘భద్రాద్రి’

‘ఉత్తర భారత దేశంలో నిర్మించతలపెట్టిన థర్మల్ విద్యుత్ కేంద్రం అవసరాల కోసం బీహెచ్‌ఈఎల్ తయారు చేసిన జనరేటర్లు, బాయిలర్లు నిరుపయోగంగా ఉండడంతో వాటిని తీసుకొచ్చి 1080 మెగావాట్ల సబ్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించినట్టు మా పరిశీలనలో తేలింది. సూపర్ క్రిటికల్‌కి బదులుగా సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి విద్యుత్ కేంద్రం నిర్మించడంతో బొగ్గు వాడకం పెరిగి ఏటా రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు వ్యయం పెరిగింది. బొగ్గు వాడకం పెరగడంతో పర్యావరణ కాలుష్యం కూడా పెరిగింది. 25 ఏళ్ల పాటు అధిక వ్యయం, కాలుష్యాన్ని భరించాల్సి ఉంటుంది. తెలంగాణ వచ్చాక కొత్తగూడెంలో 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రికార్డు కాలంలో నిర్మించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్‌కేంద్రాన్ని సైతం సూపర్ క్రిటికల్ టెక్నాలజీతోనే నిర్మిస్తున్నారు. కానీ భద్రాద్రి కేంద్రాన్ని సబ్ క్రిటి కల్ టెక్నాలజీతో నిర్మించారు. సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి నిర్మించాలని నేరుగా ప్రభుత్వం నుంచే నిర్ణయం వెలువడిందని, ఇందులో తమ పాత్ర లేదని ప్రభాకర్ రావు చెప్పారు.

సీట్లు తగ్గడానికి బాధ్యులెవరు?

- రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలపై వారంలో కాంగ్రెస్ సమీక్ష
- లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్ష చేయనున్న ఏఐసీసీ



సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందిన స్థానాలపై వారం రోజుల్లోగా ఏఐసీసీ నాయకత్వం పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించనుంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధించినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కేవలం 8 స్థానాలకే పరిమితం కావడంపై ఒకింత అసహనంగా ఉన్న హైకమాండ్ దీనికి బాధ్యులెవరని గుర్తించడంతో పాటు ఓటమికి కారణాలను సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేయనుంది. దీనిపై ఇప్పటికే పూర్తి స్థాయి నివేదికలతో రావాలని రాష్ట్ర నాయకత్వానికి హైకమాండ్ కబురు పంపినట్లు తెలిసింది. నిజానికి రాష్ట్రంలో కనీసంగా 14 సీట్లు గెలవాలని ఏఐసీసీ లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ఎనిమిది స్థానాల్లోనే గెలిచింది. ప్రధాన పోటీదారుగా ఉన్న బీజేపీకి సైతం 8 స్థానాలు దక్కాయి. కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ఈ స్థాయి వైఫల్యాలపై ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) భేటీలో అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుపట్టారు. గెలవాల్సిన రాష్ట్రాల్లోనూ పార్టీ మెరుగైన సీట్లు సాధించలేకపోయిందని తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ఫలితాలను ప్రస్తావించారు. ఈ రాష్ట్రాలపై విడిగా సమీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే కర్ణాటక ఫలితాలను ఖర్గే, రాహుల్‌గాంధీ సమీక్షించారు. కేబినెట్‌లో మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పార్టీకి తక్కువ ఓట్లు రావడానికి గల కారణాలను విశ్లేషించారు. ఇదే మాదిరి సమీక్ష తెలంగాణలోని ఓటమి చెందిన నియోజకవర్గాలకు సంబంధించి ఉంటుందని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి.


నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

మూసీ ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం

కేతేపల్లి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. హైదరాబాద్‌తో పాటు మూసీ నది పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో నీటిమట్టం పెరుగుతోంది. మంగళవారం ఎగువ నుంచి 764 క్యూసెక్కుల నీరు వస్తోంది. మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా..మంగళవారం సాయంత్రానికి 637 అడుగులకు చేరుకుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 2.57 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 640 అడుగులకు చేరినట్లయితే వానాకాలం సీజన్‌లో ఆయకట్టులో పంటల సాగు నీటి విడుదలకు ఢోకా ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

మోత్కూరు పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

మోత్కూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి (బీఆర్ఎస్)పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఓటింగ్ కోసం వైస్‌చైర్మన్ పీలపుడు వెంకటేశ్వర్లుతో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లు మే 21న జిల్లా సహకార శాఖ అధికారికి తీర్మాన పత్రాన్ని అందజేశారు. దీంతో మంగళవారం సంఘం కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. 13 మంది డైరెక్టర్లకు గాను అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన వైస్ చైర్మన్‌తో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లు హాజరయ్యారు. చైర్మన్ ఒక్కరే హాజరయ్యారు. ఆయనకు అనుకూలంగా ఉన్న ముగ్గురు డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. తొమ్మిది మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారి ప్రకటించారు. రెండు రోజుల్లో నూతన చైర్మన్ ఎన్నికను చేపడతామని తెలిపారు.


ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

నిరసనల 'ప్రజావాణి'

న్యాయం చేయాలంటూ వివిధ సంఘాల ఆందోళన

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం ప్రజావాణి కార్యక్రమం నిరసనలు, ఆందోళనల మధ్య సాగింది. లోక్‌సభ ఎన్నికల నియమావళి ముగిసిన తర్వాత పునఃప్రారంభమైన ప్రజావాణికి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు అన్యాయం జరిగిందనీ, న్యాయం చేయాలంటూ వివిధ సంఘాల నేతలు ప్రజాభవన్ ఎదుట బైఠాయించారు. విధుల నుంచి తొలగించిన తమకు న్యాయం చేయాలంటూ పెద్దఎత్తున ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలకు అనుగుణంగా ప్యాకేజీ పెంచాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్స్ కం ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పాత ప్యాకేజీపై వాహనాలు నడపడం చాలా కష్టమని, ప్యాకేజీని రూ.55 వేలకు పెంచాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి సీతక్కకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.రాజేశ్వరరావు, జి. దేవేందర్ వినతిపత్రాన్ని సమర్పించారు. తాను కొనుగోలు చేసిన భూమిని ధరణిలో నమోదు చేయకపోవడంతో కబ్జాకి గురైందంటూ మాజీ సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి ఇమ్మడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 702 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 219 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 54, హోం శాఖకు సంబంధించి 52, హౌసింగ్ శాఖకు సంబంధించి 44, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 46, ఇతర శాఖలకు సంబంధించి 287 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజావాణి ఇంఛార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఆయా శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



మనం చెడును పూర్తిగా వదిలేసి అత్యున్నతమైన మంచి పనులు చేస్తున్నప్పుడు కూడా మనను ఏదో ఒక రకమైన కోరికల్ని పట్టుకు వేళ్లాడుతూనే ఉంటుంది. ఈ స్థితిని దాటాలంటే, కోరికల శక్తిని జయించాలంటే... మంచి, చెడు రెంటినీ అధిగమించక తప్పదు.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

ఫోకస్

సాక్షి
బుధవారం, 12 జూన్ 2024

పిల్లల భవితకు పరీక్షా?

పరీక్షల్లో విద్యార్థులు పాసవడం, ఫెయిలవడం సహజం. కానీ వ్యవస్థే ఫెయిలవడం, తత్కారణంగా విద్యార్థులు గురి తప్పడం ఎప్పుడన్నా చూస్తామా? వైద్య విద్యాలయాల్లో ప్రవేశానికై జరిపే అఖిల భారత పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ– కమ్– ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) విషయంలో అదే జరిగింది. పేపర్ లీకులు, గ్రేస్ మార్కులు, పలువురికి నూరుశాతం మార్కులు, కటాఫ్ మార్కుల్లో గణనీయంగా పెరుగుదల... ఇలా ఈ ఏటి 'నీట్' పరీక్షలో వివాదాలు అనేకం. ఈ అవకతవకలన్నీ విద్యార్థుల్లో ఆవేదన, ఆందోళన, నిరాశ రేపుతున్నాయి. ఈసారి పరీక్ష జరిగిన కంగాళీ వ్యవహారంపై కోచింగ్ సంస్థలు, డాక్టర్లు, ప్రతిపక్ష నేతలు గొంతెత్తేలా చేశాయి. చివరకిలాంటి దేశవ్యాప్త పరీక్షలు నిర్వహించే జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)పై పిల్లలకూ, తల్లితండ్రులకూ నమ్మకమే పోయే పరిస్థితి వచ్చింది. కొన్నిచోట్ల పేపర్ లీకైందన్న వార్తల్ని ఎన్టీఏ కొట్టిపారేసినా, విద్యార్థులు, కోచింగ్ సంస్థల వారు కోర్టుకెక్కారు. ఫలితాలను రద్దు చేయాలన్న వారి పిటిషన్‌పై కేంద్రానికీ, ఎన్టీఏకీ సుప్రీం కోర్ట్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. పరీక్ష పవిత్రతే దెబ్బతిన్నదంటూ జవాబు కోరింది. వెరసి కొన్నేళ్ళుగా రచ్చ రేపుతున్న ఈ మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ విశ్వసనీయతకు ఇప్పుడు అగ్నిపరీక్ష ఎదురైంది.

దేశంలోని 700 పైచిలుకు విద్యాలయాల్లో లక్షా 8 వేల చిల్లర ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఎంబీబీఎస్ చదివేందుకు ఏటా కొన్ని లక్షల మంది 'నీట్'కు హాజరవుతారు. 2017లో 12 లక్షల మంది హాజరుకాగా, ఏడేళ్ళలో ఆ సంఖ్య రెట్టింపైంది. ఈ ఏడాది 'నీట్'కు 24 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. మే 5న పరీక్ష జరగగా, తర్వాత నెలరోజులకే, నిర్ణయించిన తేదీ కన్నా పది రోజుల ముందరే జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. దేశమంతా ఎన్నికల ఫలితాల హడావిడిలో ఉండగా సందట్లో సడేమియాగా ఈ ఫలితాల వెల్లడి అనుమానాలు రేపింది. పైగా, ఏటా ఈ ప్రవేశ పరీక్షలో ఏ ఒక్కరో నూరు శాతం మార్కులు సాధిస్తారు. ఆ మాటకొస్తే, అసలీ పరీక్షలో 650, ఆ పైన మార్కులు సంపాదించడం సైతం కష్టం. కఠోరసాధనతోనే సాధ్యం. అలాంటిది... ఈసారి ఏకంగా 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చాయి. ఫలితంగా... గతంలో 650 మార్కుల స్కోరుకు సైతం విద్యార్థులకు పదివేలల్లో ర్యాంకులొస్తే, ఈసారి ఆ మార్కులకు ముప్ఫై, నలభై వేల మధ్య ర్యాంకులే దక్కడంతో విద్యార్థులు, తల్లితండ్రుల ఆవేదన అంతా ఇంతా కాదు.

ఆన్‌లైన్ పరీక్ష 'క్లాట్'కూ, ఆఫ్‌లైన్‌లో జరిగే 'నీట్'కూ విధానాల్లో తేడాలున్నాయి. కానీ, క్లాట్‌లో లాగా ఇక్కడా 1563 మంది విద్యార్థులకు ఎన్టీఏ గ్రేస్ మార్కులు కలిపింది. అదేమంటే కొన్నిచోట్ల ప్రశ్నపత్రాలు ఆలస్యంగా ఇవ్వడం వల్ల విద్యార్థులకు సమయం వృథా అయిందనీ, వారు చదివిన పాత – కొత్త పాఠ్యపుస్తకాల్లో తేడాలున్నాయనీ, అందుకే అదనపు మార్కులు కలిపామనీ చెప్పింది. కాంపిటీటివ్ పరీక్షల్లో కనీవినీ ఎరుగని గ్రేస్ మార్కులు, ఈ వివరణలు హాస్యాస్పదం. పైగా, సరైన జవాబుకు 4 మార్కులు – తప్పితే ఒక మార్కు మైనస్ గనక, ఏ లెక్కన చూసినా అసంభవమైన 717, 718 లాంటి స్కోర్లు రావడమేమిటో దేవుడికే తెలియాలి. పాట్నాలో పేపర్ లీకైందనీ, రాజస్థాన్, జార్ఖండ్, ఢిల్లీ, గుజరాత్‌లలో ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాశారనీ ఫిర్యాదులున్నాయి. హర్యానాలో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురికి ఫస్ట్ ర్యాంక్ రావడం, పైగా వారి దరఖాస్తులు ఆరోహణ క్రమంలో ఒకరి తర్వాత మరొకరివి కావడం విడ్డూరం. నీట్‌లో 715 మార్కులొచ్చిన విద్యార్థి తీరా ఇంటరే పాసవని విచిత్రం సరేసరి. అందుకే, అసలు నిజాలను ఎన్టీఏ దాచిపెడుతోందని అనుమానాలొస్తున్నాయి. లీకులు, వివాదాలు కొత్త కాకున్నా ఈసారి జరిగింది పక్కా స్కామ్ అంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష రద్దు చేసి, మళ్ళీ జరపాలనే డిమాండ్లూ వస్తున్నాయి.

ఇప్పుడు నీట్‌లో మంచి మార్కులొచ్చి కూడా ఎప్పటిలా మంచి ర్యాంక్, కోరుకున్న కాలేజీలో సీటు రాని విచిత్రపరిస్థితి విద్యార్థులది. నిస్పృహతో కొందరు పిల్లలు ఇప్పటికే ఆత్మహత్యలకు పాల్పడడం విషాదం. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పేదలకూ, సామాజిక న్యాయానికీ ఈ నీట్ నిర్వహణ పూర్తిగా వ్యతిరేకమని తమిళనాడు ఎప్పటి నుంచో వాదిస్తోంది. 2021లో వచ్చిన స్టాలిన్ సర్కార్ జస్టిస్ రాజన్ సారథ్యంలో ఉన్నత స్థాయి కమిటీ వేసింది. కమిటీ సిఫార్సుల మేరకు లోపభూయిష్ఠమైన నీట్ నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలంటూ, అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. దీర్ఘకాలంగా రాష్ట్రపతి ముద్ర కోసం వేచి చూస్తోంది. ఎన్టీఏ మాత్రం తప్పులు ఒప్పుకొని, దిద్దుబాటుకు సిద్ధం కావట్లేదు. తాజా పరీక్షలో జవాబులు గుర్తుపెట్టే ఓఎంఆర్ షీట్ చినిగిపోయిందంటూ ఎన్టీఏ ఒకరి ఫలితం ఆపేసింది. తీరా చూస్తే ఆ విద్యార్థినికి 715 మార్కులు రావడం గమనార్హం.

ఇలాంటి విచిత్ర విన్యాసాలు చూశాకనైనా... మన పరీక్షా వ్యవస్థలో, ఉపయోగించే సాంకేతికతలో పారదర్శకత తీసుకురాక తప్పదు. అవసరమైతే వైద్య విద్యాలయాల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను వాయిదా వేసి, కూలంకషంగా దర్యాప్తు చేయాలి. అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలను పరిశీలిస్తున్న ఉన్నతస్థాయి ప్యానెల్ మరో వారంలో తన నివేదిక ఇవ్వనుంది. అది చేసే సిఫార్సుల మాట అటుంచితే, ఇంత జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు ఈ వివాదంపై ఇప్పటి దాకా నోరు విప్పకపోవడం విషాదం. చదువుల నుంచి ఉద్యోగాల దాకా మన దేశంలో సమస్త పరీక్షలకూ లీకుల జాడ్యం, అవకతవకల మకిలి అంటుకుంది. గత అయిదేళ్ళలో 15 రాష్ట్రాల్లో మొత్తం 41 పేపర్ లీకుల వల్ల 1.4 కోట్ల మంది ఉద్యోగార్థులకు కష్టం, నష్టం కలిగాయి. ఇది మన వ్యవస్థకే సిగ్గుచేటు. బాగా చదువుకోవాలనుకున్న పసివారి భవిష్యత్తుకు సైతం ఈ పీడ తప్పకపోవడమే మరీ బాధాకరం. సమూల ప్రక్షాళనతో ఇలాంటి పరీక్షలను లోపరహితంగా మార్చడమే మార్గం.

మొదటి నూరు రోజులు కీలకం

విశ్లేషణ



ప్రొ॥ అజీత్ రానాడే


ఆర్థిక మాంద్యం నేపథ్యంలో 1933లో అమెరికాలో గద్దెనెక్కిన రూజ్‌వెల్ట్ ప్రభుత్వం తొలి వంద రోజుల్లో కొన్ని మేలైన నిర్ణయాలు తీసుకుంది. అప్పటి నుంచీ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తొలి వంద రోజుల్లో ఏం చేస్తుందనే ఆసక్తి మొదలైంది. కేంద్రంలో కొలువుదీరిన ఎన్డీఏ ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాలు ఉపాధి! దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ కార్యక్రమం ఒకదాన్ని మొదలుపెట్టడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. చిన్న, సన్నకారు రైతులతోపాటు కౌలు రైతులకూ రుణాలు అందుబాటులోకి తేవాలి. వంద కోట్ల కంటే ఆర్థిక సంపద ఎక్కువగా ఉన్న వారిపై ఒక శాతం పన్ను విధించాలి. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అంతరాన్ని తగ్గించేందుకు ఈ చర్య ఉపయోగపడుతుంది.

కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా తొలి వంద రోజుల్లో ఏం జరుగుతుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొత్త ప్రభుత్వపు ప్రాథమ్యాలు అర్థమయ్యేదిప్పుడే మరి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో కొన్నింటినైనా అమలు చేసేందుకు ఇదే మంచి తరుణం కూడా. తద్వారా కొత్త ప్రభుత్వ కార్యకలాపాలు వేగం పుంజుకుంటాయి. ప్రజల్లో విశ్వాసమూ నెలకొంటుంది. అలాగే దేశీ, విదేశీ పెట్టుబడిదారుల నమ్మకం చూరగొనడమూ సాధ్యమవుతుంది. స్పష్టమైన మెజారిటీతో గద్దెనెక్కిన ప్రభుత్వం కూడా కొంత సమయం తరువాత ప్రజా విశ్వాసం కోల్పోవచ్చు. కాబట్టి ఈ తొలి రోజులను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

నిజానికి ఈ తొలి వంద రోజుల భావన ఎప్పుడో 1933లో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి.రూజ్‌వెల్ట్ మొదలుపెట్టారు. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో గద్దెనెక్కిన రూజ్‌వెల్ట్ ప్రభుత్వం తొలి వంద రోజుల్లో కొన్ని మేలైన నిర్ణయాలు తీసుకుంది. రైతులతోపాటు నిరుద్యోగులు, యువత, పరిశ్రమలకు ఉపశమనం కలిగించేలా తక్షణ సాయం ప్రకటించడం, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే ఉద్దీపన కార్యక్రమాలు చేపట్టడం వీటిల్లో ఉన్నాయి. ఇదే సమయంలో బంగారంపై ప్రైవేట్ యాజమాన్యాన్ని తొలగించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలు ఈ సమయంలోనే జరిగాయి. మనుగడ సాగించలేని బ్యాంకుల బరువును వదిలించుకునేందుకు బ్యాంకింగ్ హాలిడేను ప్రకటించారు. వాణిజ్య, పెట్టుబడులకు వేర్వేరుగా బ్యాంకింగ్ వ్యవస్థల ఏర్పాటుకు దారితీసిన గ్లాస్–స్టీగాల్ చట్టం ఈ సమయంలోనే అమల్లోకి వచ్చింది.

భారత్‌లో కొత్తగా కొలువైన ప్రభుత్వానికి రూజ్‌వెల్ట్ తరహాలో ఆర్థిక మాంద్య సమస్య లేదు. పైగా ఆర్థిక రంగం పటిష్ఠంగానే ఉంది. గత ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు చాలామందిని ఆశ్చర్యపరుస్తూ పైకి ఎగబాకింది. అలాగే ద్రవ్యోల్బణం కూడా ఓ మోస్తరు స్థాయిలో మాత్రమే కొనసాగుతోంది. బ్యాంకింగ్ రంగ ఆరోగ్యం కూడా బాగానే కనబడుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు రికార్డు స్థాయిలో రూ.1.4 లక్షల కోట్ల లాభాలు నమోదు చేశాయి. స్టాక్ మార్కెట్ కూడా మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ఈ స్థూల ఆర్థికాంశాలన్నీ బాగా ఉన్న నేపథ్యంలో కొత్త ప్రభుత్వం తొలి వంద రోజుల ప్రాథమ్యాలు ఏముంటే బాగుంటుంది? నాలుగు నిర్దిష్టమైన సూచనలు:

కొత్త ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు ఉపాధి కావచ్చు. అంతర్జాతీయ కార్మిక సంఘం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ నివేదికల ప్రకారం దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది 29 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన వారు. ఇదే సమయంలో దేశం మొత్తమ్మీద నైపుణ్యమున్న, అర్ధ నైపుణ్యమున్న ఉద్యోగుల కొరత చాలా తీవ్రంగా ఉంది. కాబటి నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ కార్యక్రమం ఒకదాన్ని మొదలుపెట్టడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఈ రకమైన కార్యక్రమానికి ప్రస్తుతమున్న వాటి కంటే మెరుగైన చట్టపరమైన మద్దతు అవసరమవుతుంది. ప్రస్తుత కార్మిక చట్టాల ప్రకారం.. అప్రెంటిస్ అయినా, ఇతరులైనా ఆరు నెలలపాటు పనిచేస్తే వారిని శాశ్వత ఉద్యోగులుగా చేయాలి. ఫలితంగా పారిశ్రామిక వేత్తలు అప్రెంటిస్‌లకు కూడా అవకాశాలిచ్చే అవకాశం తక్కువ అవుతోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. అప్రెంటిస్ సర్టిఫికెట్ దేశవ్యాప్తంగా చెల్లుబాటయ్యేలా చేయాలి. కేంద్ర ప్రభుత్వ అధికారిక ముద్ర కూడా ఈ సర్టిఫికెట్‌కు అవసరమవుతుంది. జాతీయ అప్రెంటిస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి పై అంశాలన్నింటినీ చేర్చడం ద్వారా నిరుద్యోగ సమస్య, నైపుణ్యాల లోటు, ఉద్యోగార్థతల సమస్యలను పరిష్కరించవచ్చు. దీంతోపాటు అగ్నివీర్ కార్యక్రమాన్ని ప్రస్తుతమున్న నాలుగేళ్ల నుంచి ఏడు లేదా ఎనిమిదేళ్లకు పెంచడం (షార్ట్ సర్వీస్ కమిషన్ కార్యకాలానికి దగ్గరగా) కూడా నిరుద్యోగ సమస్య సమసిపోయేందుకు ఉపయోగపడుతుంది.



ఇక రెండో సూచన... పంట ఉత్పత్తులకిచ్చే కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ కల్పించడం గురించి. కనీస మద్దతు ధర సాఫల్యానికి మార్కెట్ ధరలన్నీ గణనీయంగా తగ్గాలి. అయితే కనీస మద్దతు ధర వల్ల ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశమూ ఉంటుంది. కానీ మొత్తమ్మీద అటు రైతుకు, ఇటు ప్రభుత్వానికి ఉభయ తారకం. కొత్త ప్రభుత్వం కనీస మద్దతు ధరతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులపై నియంత్రణలకు దూరంగా ఉంటామన్న సూచన కూడా చేయాల్సి ఉంటుంది. నియంత్రణలు రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి.

మూడవ సూచన: చిన్న, సన్నకారు రైతులతోపాటు కౌలు రైతులకూ రుణాలు అందుబాటులోకి తేవాలి. దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల్లో 40 శాతం కౌలు రైతులే పండిస్తున్నారు. భూయజమానులతో వీరికి నామమాత్రపు ఒప్పందం మాత్రమే ఉంటుంది. ఈ కారణంగా రుణ సౌకర్యం లభించడం కష్టమవుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ సమస్యను అధిగమించేందుకు కొన్ని వినూత్న పద్ధతుల ఆవిష్కరణ జరిగింది. ఇలాంటి ప్రయత్నాల మదింపు జరిపి జాతీయ స్థాయి విధానాన్ని రూపొందించి అమలు చేయాల్సిన అవసరముంది. సాధారణంగా పంట రుణాలన్నవి నాలుగు నుంచి ఆరు నెలల కాలానికి అవసరమవుతుంటాయి. ఇంత చిన్న కాలావధి అనేది నిరర్థక ఆస్తుల నిర్వచనం కిందకు రాదు. దీనికి తగిన నమూనా రూపొందించాలి. అలాగే చిన్న, సన్నకారు రైతులు, ఔత్సాహిక చిన్నస్థాయి పారిశ్రామిక వేత్తలకూ రుణ సౌకర్యం పెద్దగా ఉండటం లేదు. అకౌంట్ అగ్రిగేటర్స్ వంటివి అందుబాటులో ఉన్న ఈ కాలంలో కేవలం కొలాటరల్ ఆధారంగా కాకుండా... క్యాష్ ఫ్లో ఆధారంగా రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలి. పైగా... చాలామంది చిన్నస్థాయి పారిశ్రామిక వేత్తలకు ఆర్థికాంశాలపై అవగాహన తక్కువే. ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు గట్టి ప్రయత్నమే జరగాలి. అంతేకాకుండా... చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు వర్కింగ్ క్యాపిటల్ లభ్యత పెరిగేందుకు 2006 నాటి చిన్న, మధ్యతరహా పరిశ్రమల చట్టంలోని 45 రోజుల నిబంధనను కఠినంగా అమలు చేసే ప్రయత్నం జరగాలి.

నాలుగో సూచన... ఫైనాన్షియల్ వెల్త్ (స్టాక్స్, బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటివి– అన్నీ 'పాన్'తో అనుసంధానించి ఉంటాయి) విలువ రూ.వంద కోట్ల కంటే ఎక్కువగా ఉన్న వారిపై కొద్దిగా ఒక శాతం పన్ను విధించడం. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అంతరాన్ని తగ్గించేందుకు ఈ చర్య ఉపయోగపడుతుంది. ఈ పన్ను ద్వారా సేకరించిన మొత్తాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యాభివృద్ధికి కేటాయించవచ్చు. ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వాలకు కాకుండా... నేరుగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు చేరాలి. ఫైనాన్స్ కమిషన్ ఇప్పటికే ఇలా నేరుగా ఆర్థిక వనరులను అందిస్తున్న విషయం తెలిసిందే.

వ్యాసకర్త పుణెలోని 'గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్' వైస్ ఛాన్స్‌లర్ ('ద మింట్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సమకాలీనం



గిరీష్ కర్నాడ్ మహత్తర నాటకం 'తుగ్లక్'ను గుర్తు చేసుకుంటున్నాను. సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలనలోని సంక్లిష్టతలను అత్యంత చారిత్రక లోతులతో, సమకాలీనపు ప్రాసంగికతతో అది చూపుతుంది. సూక్ష్మాంశాలతో కర్నాడ్ పాత్రలను చిత్రించిన విధం ఆ నాటకాన్ని భారతీయ రంగస్థలంపై ఒక మైలురాయిగా నిలిపింది. (జూన్ 10న కర్నాడ్ వర్ధంతి)

– ఇర్ఫాన్, ఆర్కైవిస్ట్

అదుపు తెలీదు!



పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు, ప్రత్యేకించి కమ్రాన్ అక్మల్, సయీద్ అజ్మల్, షోయబ్ అఖ్తర్, తన్వీర్, షాహిద్, వఖార్ లాంటివాళ్లు తమ అభిప్రాయాలను వెల్లడించకూడదు. అది టీవీల్లోగానీ, తమ యూట్యూబ్ వీడియోల్లోగానీ! ఎందుకంటే వాళ్లకు ఎక్కడ ఆపాలో, ఏది చెప్పకూడదో తెలియదు. (అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌ను ఉద్దేశించి సిక్కుల మీద అక్మల్ చేసిన వ్యాఖ్య వైరల్ కావడం, అనంతరం క్షమాపణ చెప్పడం జరిగింది.)

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

సరైన విశ్లేషణ



బీజేపీకి సంపూర్ణ మెజారిటీని గెలుచుకోవడంలో మోదీ ఎందుకు విఫలమయ్యారో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ సరిగ్గా విశ్లేషించారు. అహంకారం కూడదని ఆయన హెచ్చరించారు. ఎన్నికలను ఒక యుద్ధంగా, ప్రత్యర్థులను శత్రువులుగా చూడకూడదన్నారు. బాగా చెప్పారు మోహన్ భాగవత్!

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఇంత బహిరంగంగానా?



ఆఖరికి లెఫ్ట్ వర్గాల్లో సైతం కశ్మీర్ గురించి మాట్లాడడమే మహాపాపం అన్నట్టు చేశారు. కానీ రైట్‌వింగ్ మాత్రం బహిరంగంగానే నరమేధానికి పిలుపునిస్తోంది. దశాబ్దాలుగా ఉన్నట్టుగానే కశ్మీర్ ఉన్నంతవరకూ ఇండియా నుంచి ఇస్లామోఫోబియా అనేది పోదు. (కశ్మీర్‌లో ఇజ్రాయెల్ తరహా పరిష్కారం అమలు చేయాలన్న ఆనంద్ రంగనాథన్ వ్యాఖ్యల నేపథ్యంలో).

– సారా ఎథర్, ఆర్కిటెక్ట్

నరమేధం కాదు!



కశ్మీర్ సమస్యకు ఇజ్రాయెల్ తరహా పరిష్కారం అంటే– బాధితుల పునరావాసం, ఆవాసాలు నిర్మించడం, తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం, సరిహద్దులను కాపాడుకోవడం. ఇది నరమేధానికి పిలుపునివ్వడం కాదు. ఇది మరో నరమేధాన్ని ఆపటం. నేను ఇజ్రాయెల్‌కు మద్దతిస్తాను. కశ్మీరీ హిందువులకు మద్దతిస్తాను. నా ప్రతి మాటకూ కట్టుబడి ఉంటాను.

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' గౌరవ సంపాదకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

మోదీ హయాంలో బలమైన ప్రతిపక్షం

అభిప్రాయం



ఎమ్.డి. మునీర్

ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో మొదటిసారిగా ఒక అధికార ప్రతిపక్ష నాయకుని హోదా పొందిన విపక్ష నాయకుడు పార్లమెంట్‌లో కనిపించబోతున్నారు. 2024 ఎన్నికల ఫలితాలు మోదీకి ఇవ్వబోతున్న కొత్త అనుభవం ఇది. గత పది ఏండ్ల పాలనలో అధికారికంగా అసలు విపక్షమే లేకుండా ఏకపక్షంగా సభను నడిపించారు. ఇప్పుడు ప్రధానిగా నరేంద్ర మోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్డీఏ కూటమిలోని చంద్రబాబు, నితీష్ కుమార్ తదితరుల సపోర్ట్‌తో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అదే తరుణంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో 'ఇండియా' కూటమి రూపంలో ప్రతిపక్షం... పదేండ్ల తర్వాత అధికార పక్ష వ్యవహారశైలిని సమర్థవంతంగా నియంత్రించే స్థాయికి చేరడం గమనార్హం.

కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రవేశించనున్నారు. మోదీకి ఈ విషయం మింగుడు పడనిదే. రాహుల్ విపక్ష నేతగా రావడం లౌకిక, ప్రజాస్వామ్య భారతదేశానికి ఒక మంచి పరిణామంగా పేర్కొనక తప్పదు. రాహుల్ వయసు ఉన్నన్ని సీట్లు కూడా కాంగ్రెస్‌కూ, 'ఇండియా' కూటమికీ రావని ఎద్దేవా చేసిన మోదీకి ప్రస్తుత ఎన్నికల ఫలితాలు కనువిప్పు కలిగించాయి. కాంగ్రెస్ సొంతంగా 99 సీట్లు, దాని నాయకత్వంలోని ఇండియా కూటమి మొత్తం 234 సీట్లు గెలవడం లౌకికవాదానికి తిరిగి ఊపిరులూదినట్లయ్యింది. ఇద్దరు ఇండిపెండెంట్లూ 'ఇండియా'కు మద్దతు ప్రకటించడంతో ఈ కూటమి బలం 236కు చేరడం గమనార్హం.

2024 ఎన్నికల ఫలితంగా మొట్టమొదటిసారిగా మోదీ ముందు అధికార హోదా కలిగిన ప్రతిపక్ష నాయకుడు కూర్చోబోతున్నారు. ఆయన రాహుల్ గాంధీయే అని రాజకీయ విశ్లేషకుల మాట. సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయించిన అనంతరం నిర్వహించే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాహుల్‌ను పార్టీ సభానాయకునిగా ఎన్నుకోవడం కేవలం లాంఛనప్రాయం అనే భావిస్తున్నారు. కాబట్టి మోదీ, ఆయన పార్టీవారు గేలిచేసిన రాహుల్ గాంధీయే ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా మోదీకి లోక్ సభలో సవాల్ విసరబోతున్నారు. గత పదేళ్లుగా లోక్ సభ సీట్లలో పదిశాతం సీట్లు కూడా గెలవలేదనే నెపంతో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా స్పీకర్ ఇవ్వలేదు. నిజానికి విపక్షంలో అత్యధిక సీట్లు వచ్చిన పార్టీకి పది శాతం సీట్లతో సంబంధం లేకుండా ప్రతిపక్ష హోదా ఇవ్వాలి. ఇప్పుడు కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వడం స్పీకర్‌కు అనివార్యం.



'ఇండియా' కూటమి సమావేశం

బీజేపీకి సొంతంగా 240 సీట్లు మాత్రమే వచ్చాయి. అందువల్ల ఇప్పుడు తన భాగస్వామ్య పక్షాలపై ప్రభుత్వ ఏర్పాటుకు తప్పనిసరిగా ఆధారపడవలసి వచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే అవకాశమే లేదు. ప్రతిపక్ష హోదా కూడా లేని ప్రతిపక్షాలను ఉత్సవ విగ్రహాలను చేసి ఆడిన ఆటలు ఇక సాగకపోవచ్చు.

మోదీ ఈ ఎన్నికల్లో గెలవడానికి అత్యంత ప్రమాదకరమైన ఉపన్యాసాలు ఇచ్చారు. 'టైమ్స్' లాంటి విదేశీ పత్రికలు మోదీని 'డివైడర్ ఇన్ చీఫ్' అని అభివర్ణించాయి. మోదీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ ఉపన్యాసం ఒక నేరం అనీ, ప్రతిదానికీ, చట్ట ప్రకారం శిక్ష పడే పరిస్థితి ఉందనీ ప్రముఖ న్యాయ కోవిదుడు ఆశోక్ అరోరా అంటారు. హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రేపే ఉపన్యాసాలు (తాళిబొట్లు గుంజుకుపోతారనీ, బర్రెలను తీసుకెళతారనీ), వ్యాఖ్యలూ చేసిన వ్యక్తికి ప్రధాని అయ్యే అర్హత లేదని ఆయన అంటారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతికి లేఖ రాసినట్లు, ఒక వీడియో విడుదల అయ్యింది. అది ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతిపక్ష కూటమి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రజల ఆశలను, ఆకాంక్షలను వారు వమ్ము చేయబోరని ఆశిద్దాం! ఆకలి, అసమానతలు, నిరుద్యోగం లేని; కుల, మతాలకు అతీతమైన భారతదేశ నిర్మాణం కోసం వీరంతా కృషి చేస్తారని, చేయాలని ఆశిద్దాం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
। 99518 65223

ఇకనైనా ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలి!

అభిప్రాయం



చాడ వెంకటరెడ్డి

ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ, 'ఇండియా' కూటముల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ప్రజాస్వామ్య మనుగడకే ఈ ఎన్నికలు సవాలుగా నిలిచాయి. దాదాపు 140 కోట్ల జనాభా కలిగి దేశంలో భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్న నేపథ్యంలో ప్రాంతీయ సెంటిమెంట్లు, మతాలు, కులాలు తెరపైకొచ్చాయి. ప్రధానంగా డబ్బు, మద్యం పంపిణీ చేసి, పోటాపోటీగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేయడంతో ఎన్నికల ప్రచారం అట్టుడికి పోయింది. తన నాయకత్వంలోని ఎన్డీఏ ద్వారా 400లకు పైగా ఎంపీ స్థానాలు సాధించి ముచ్చటగా మూడవసారి ప్రధాని అవుదామనుకున్న మోదీ లక్ష్యం సంపూర్ణంగా నెరవేరలేదు. అయితే లక్ష్య సాధన కోసం ఆయన, ఆయన పార్టీ వ్యవహరించిన తీరు నిస్సందేహంగా ఖండించదగినదే.

రామమందిరం నిర్మించామని చెప్పుకున్న బీజేపీ అయోధ్య నగరం ఉన్న ఫైజాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో ఓడిపోయింది. కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, గుత్తేదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆస్తులు అనేక రెట్లు పెరిగాయి. సామాన్య ప్రజల హక్కులు, కార్మికులు, అసంఘటిత కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను సైతం రద్దు చేసే కార్మిక వ్యతిరేకి అయ్యారు మోదీ. ఆశించినట్లు కాకుండా 400 స్థానాలకు బదులుగా ఎన్డీఏ కూటమికి 293 స్థానాలు మాత్రమే వచ్చాయి. ప్రజలు హెచ్చరిక లాంటి గుణపాఠం చెప్పారు. ఇండియా కూటమికి 234 స్థానాలు వచ్చాయి. ముఖ్యంగా అంతకు ముందున్న 52 నుండి 99 స్థానాలకు కాంగ్రెస్ ఎగబాకడం వల్ల కొంతమేరకు ప్రధాన ప్రతిపక్ష హోదాను కాంగ్రెస్ పొందగలిగింది. కాని, లక్ష్యం నెరవేరలేదు.

ఎన్డీఏ విషయానికి వస్తే... కూటమి భాగస్వామ్యపక్షాలపై ఆధారపడి మాత్రమే మోదీ పాలన చేయవలసి ఉంటుంది. అంటే మోదీ మార్కుకు బదులుగా ఎన్డీఏ ముద్రపడనుంది. మోదీ జాగ్రత్తగా, గతం కంటే భిన్నంగా ఏకపక్షంగా కాకుండా ఆచితూచి అడుగులు వేయవలసి ఉంటుంది. పదేళ్ల పాలించిన ఏకపక్ష, కార్పొరేట్ విధానాలను విడనాడవలసి ఉంటుంది. భాగస్వామ్య పక్షాలకు కత్తిమీద సాములాగే ఉంటుంది. ప్రజలకిచ్చిన హామీలు, ప్రాంతీయ ఆలోచనల అమలులో ఆటుపోట్లు ఎదుర్కొవలసి ఉంటుంది.



ఎన్డీఏ కూటమి నేతలు

ప్రజాస్వామ్యంలో అధికార పక్షం నిరంతరం ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవాలి. ప్రతిపక్షం ప్రధానంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోయినప్పుడు నిలదీస్తూ నిరసన గళం వినిపించవలసి ఉంటుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ప్రజల పక్షంగా ఉద్యమించాల్సి ఉంటుంది. ఈ ఎన్నికలు మోదీ ప్రభుత్వ భవిష్యత్‌కు సవాలుగానే నిలిచాయి. రాజ్యాంగం నిర్దేశించిన ప్రజల హక్కుల అమలుకై ఇండియా కూటమి ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సి వుంటుంది. ప్రతి క్షణం క్రియాశీలంగానే ఉండాల్సి వుంటుంది.

ఎన్నికల్లో ధనికులూ, నేరస్థులూ, లేక నేర ఆరోపణలు ఎదుర్కొంటున్నవారూ ఎక్కువగా విజయం సాధించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజాసేవ చేద్దామనుకున్న సాధారణ వ్యక్తులు ఎన్నికల్లో ఏమాత్రం నిలబడలేని పరిస్థితులు ఉన్నాయి. డబ్బు ఖర్చుపెట్టి గెలిచిన వారు తిరిగి తమ డబ్బులను సంపాదించుకోవడంలోనే నిమగ్నమవుతారు. ప్రజలను పట్టించుకోరు. పాలకులు ఇచ్చిన హామీలు కూడా అమలు చేయకుండా ప్రజలపైన అణచివేతకు పాల్పడుతున్నప్పుడు ప్రజాప్రతినిధులను రీకాల్ చేసే అధికారం ప్రజలకు ఉండాలి. వికేంద్రీకరణ ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించబడాలి.

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుంటున్నప్పుడు రాజ్యాంగ ఆదేశిక, ప్రాథమిక సూత్రాలనైనా అమలు చేయకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు. గత పదేళ్ళ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రభుత్వ ఒత్తిడి పెరిగింది. దీంతో ప్రజాస్వామ్యం ఇబ్బందుల్లో పడింది. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమనే సంకేతాన్నిస్తూ ఓటర్లు ఇచ్చిన తీర్పును మూడవసారి అధికారంలో వచ్చిన ప్రధాని మోదీ గుర్తెరగాలి.

వ్యాసకర్త సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.7.11 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మఖ రా.2.23 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.1.19 నుండి 3.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.33 నుండి 12.25 వరకు, **అమృతఘడియలు:** రా.11.56 నుండి 1.39 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

విదేశాల్లో ప్రభాకర్‌రావు, శ్రావణ్

ట్యాపింగ్ కేసులో నాంపల్లి కోర్టులో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు

- భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్లపై తీర్పు నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) కార్యాలయం కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పంజగుట్ట పోలీసులు మంగళవారం అభియోగపత్రాలు దాఖలు చేశారు. ఇప్పటికే అరెస్టయిన పోలీసు అధికారులు దుగ్యాల ప్రణీత్‌రావు, నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్న, మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావులతోపాటు పరారీలో ఉన్న ఎస్‌ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, శ్రావణ్ రావులను నిందితులుగా పేర్కొంటూ అభియోగాలు మోపారు. పరారీలో ఉన్న ఇద్దరూ విదేశాల్లో తలదాచుకున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ ఏడాది మార్చి 10న పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో కుట్ర, నమ్మకద్రోహం, నేరపూరిత చర్యలు, ప్రజా ఆస్తుల విధ్వంసం తదితర సెక్షన్ల కింద నమోదైన ఈ కేసు ఆపై ట్యాపింగ్ టర్న్ తీసుకుంది. దీంతో టెలిగ్రాఫ్ యాక్ట్, సైబర్ టెర్రరిజం చట్టాలను జోడించారు. నిందితుడిగా ఉన్న ప్రణీత్‌ను మార్చి 12న, భుజంగరావును తిరుపతన్నలను 23న, రాధాకిషన్‌రావును 28న అరెస్టు చేశారు. చట్ట ప్రకారం ఓ నిందితుడిని అరెస్టు చేసిన తర్వాత గరిష్ఠంగా 90 రోజుల్లో అతడిపై అభియోగ పత్రం దాఖలు చేయకుంటే న్యాయస్థానం అతడికి మ్యాండేటరీ బెయిల్ మంజూరు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు మంగళవారం ఈ కేసులో సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

ట్యాపింగ్... వసూళ్లు

ట్యాపింగ్ కేసు దర్యాప్తులో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబీకులు, సంబంధీకులు, పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన అసమ్మతి నేతలపైనా అక్రమ నిఘా ఉంచినట్లు వివరించారు. అలాగే, బీజేపీ నేతలు ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, బండి సంజయ్‌ల ఫోన్లు ట్యాప్ చేశారని అభియోగపత్రాల్లో పేర్కొన్నారు. వివిధ నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన యజమానులు, వ్యాపారవేత్తల ఫోన్లపైనా అక్రమ నిఘా ఉంచారని, అలా తెలుసుకున్న విషయాలతో వసూళ్లకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. బీఆర్‌ఎస్ అగ్రనాయకుల ఆదేశాల మేరకు రాధాకిషన్‌రావు భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడినట్లు తేల్చారు. మొత్తమ్మీద నిందితులు 1000 నుంచి 1200 ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆధారాలు లభించాయని, బాధితుల్లో హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్ కూడా ఉన్నట్లు అధికారులు న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. మరోపక్క డీఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై తీర్పును కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టులు జరిగాయని నిందితుల తరపు న్యాయవాది, బెయిల్ ఇస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారని ప్రభుత్వ న్యాయవాది వాదించారు.

కొల్లగొట్టిన సొమ్ము ఏం చేశారు?

- గొర్రెల కుంభకోణంలో ఇంకెవరి పాత్ర ఉంది?
- నిందితులు కల్యాణ్, రామ్‌చందర్‌లకు ఏసీబీ అధికారుల ప్రశ్నలు
- నేడు మరోమారు కస్టడీలోకిలోకి తీసుకోనున్న ఏసీబీ

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో ప్రాథమిక ఆధారాల మేరకు రూ.700 కోట్ల మేరకు నిధులు దారి మళ్లించినట్టు ఏసీబీ గుర్తించింది. ఇలా కొల్లగొట్టిన కోట్లాది రూపాయల సొమ్మును ఏం చేశారు..? ఈ కుంభకోణంలో ఇంకా ఎవరెవరు ఉన్నారు..? మీరే ఈ కుంభకోణానికి తెరతీశారా..? లేదా మీపై ఇంకెవరైనా ఒత్తిడి పెట్టారా...? అంటూ ఏసీబీ అధికారులు రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దగ్గర ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్‌కుమార్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీలో భాగంగా అధికారులు ఇద్దరిని మంగళవారం రెండోరోజూ ప్రశ్నించారు. మొదటి రోజు ఇద్దరి నుంచి వేర్వేరుగా సేకరించిన అంశాలపైనా రెండో రోజు మార్చిమార్చి ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. ప్రైవేటు వ్యక్తులను గొర్రెల కొనుగోళ్లలోకి ఎలా తెచ్చారు.. ఇందుకు సంబంధించి ఆయా జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం వెనుక ఎవరి ఒత్తిడైనా ఉందా..? అని ప్ర శ్నించినట్టు తెలిసింది. ఈ ఇద్దరూ కలిసే ఈ మొత్తం కుంభకోణానికి తెరతీశారా..? ఇంకా ఎవరైనా ఆదేశాలిచ్చారా.. అన్న కోణంలోనూ ప్రశ్నించినట్టు తెలిసింది. బినామీల పేర్లతో చెక్కులు జారీ చేయించిన తర్వాత కొల్లగొట్టిన సొమ్మును అనుకూలుర బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించారన్న దానిపైనా అధికారులు సమాచారం సేకరించినట్టు తెలిసింది. బినామీ బ్యాంకు ఖాతాలు, పరారీలో ఉన్న నిందితుల గురించి కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. అధికారులు అడిగిన చాలా ప్రశ్నలకు రాంచందర్, కల్యాణ్‌కుమార్ సమాధానాలు దాట వేసినట్టు సమాచారం. విచారణలో వారి నుంచి ఆశించిన సమాచారం రాలేదని, బుధవారం కస్టడీ చివరిరోజు కావడంతో కీలక సమాచారం రాబట్టేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

రాంచందర్ సస్పెన్షన్

అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. మే 31న ఏసీబీ రాంచందర్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో రాంచందర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదర్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారుల పాలన పోవాలి.. ప్రజాపాలన రావాలి

- తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో అధికారుల పాలన పోయి, ప్రజాపాలన రావాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్ కార్యవర్గ సమావేశం మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో మున్సిపల్ చైర్మన్లు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మున్సిపల్ చట్టాన్ని సవరించి 2019లో కొత్త చట్టాన్ని తీసుకు రావడంతో పురపాలక సంఘాల పాలక మండళ్లు నిర్వీర్యం అయ్యాయని, అధికారాలన్నీ అధికారులకు అప్పగించి పాలకవర్గాలను పూర్తిస్థాయిలో నిరుపయోగంగా మార్చి వేశారని విమర్శించారు. రాష్ట్రంలో పురపాలక చట్టాన్ని తిరిగి సవరించి, అధికారాలను మున్సిపల్ కౌన్సిల్‌కు, సీడీఎంఏకు అప్పగించాలని కోరారు. పురపాలక సంఘాల చైర్మన్‌లకు నేరుగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పురపాలక సంఘాలను గాడిలో పెట్టి, వ్యవస్థను మరింత బలంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు బి.ఎస్.కేశవ్, కె.ఈశ్వర్, నేతి రాజమౌళి, అల్లంపల్లి నరసింహ, సుధ, హేమేంద్ర, కప్పరి స్రవంతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన మహిళా మంత్రులు: రక్షా ఖడ్సే • అన్నపూర్ణాదేవి • అనుప్రియా పటేల్ • నిమూబెన్ • సావిత్రీ ఠాకూర్ • శోభా కరంద్లాజె (ఎడమ నుంచి కుడికి)

ఈవీఎంలలో గోల్‌మాల్?!

పోలైన, లెక్కించిన ఈవీఎం ఓట్లలో తేడాలు

- దేశవ్యాప్తంగా దాదాపు అన్ని లోక్‌సభ స్థానాల్లోనూ అంతే
- 140కి పైగా లోక్‌సభ స్థానాల్లో ఎక్కువ ఓట్లు లెక్కించారు
- కారణాలపై పెదవి విప్పని కేంద్ర ఎన్నికల సంఘం
- ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై ముసురుకుంటున్న సందేహాలు
- ఈసీ డేటాను ఉటంకిస్తూ 'ద వైర్' వార్తా సంస్థ కథనం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఫలితాలు వెల్లడైనా ఎన్నికల ప్రక్రియపై నెలకొన్న వివాదాలకు మాత్రం తెర పడటం లేదు. పైగా మొత్తం ఎన్నికల ప్రక్రియ సమగ్రతపైనే నానాటికీ మరిన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి. 2024 ఎన్నికల్లో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో పోలైన, లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్యలో తేడా నమోదైనట్టు 'ద వైర్' వార్తా సంస్థ పేర్కొంది! కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక గణాంకాలనే ఉటంకిస్తూ ఈ మేరకు కథనం ప్రచురించింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాల డేటాను పరిశీలిస్తే డామన్–డయ్యు, లక్షద్వీప్, అట్టింగల్ వంటి కొన్నింటిని మినహాయిస్తే అత్యధిక స్థానాల్లో నమోదైన మొత్తం ఈవీఎం ఓట్ల సంఖ్య అంతిమంగా లెక్కించిన ఈవీఎం ఓట్లతో సరిపోలడం లేదని వెల్లడించింది. ఏకంగా 140 పై చిలుకు స్థానాల్లో పోలైన ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన వాటి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు పేర్కొనడం విశేషం! ఇలా 2 నుంచి 3,811 ఓట్ల దాకా అదనంగా లెక్కించినట్టు వెల్లడించింది. ''పలు లోక్‌సభ స్థానాల్లోనేమో లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య మొత్తం ఈవీఎం ఓట్ల కంటే తక్కువగా ఉంది. ఒక లోక్‌సభ స్థానంలో ఏకంగా 16,791 ఓట్లు తక్కువగా లెక్కించారు! ఇలా తగ్గడానికి దారితీసిన కారణాలపై ఈసీ ఇచ్చిన ఇచ్చిన వివరణ పొంతన లేకుండా ఉంది. ఎక్కువ ఓట్లను లెక్కించడం ఎలా సాధ్యమన్న ప్రశ్నపై మాత్రం ఈసీ పూర్తిగా మౌనం దాల్చింది. ఈ మొత్తం ఉదంతంపై వివరణ కోరుతూ ఈసీకి ఈ మెయిల్ పంపితే ఇప్పటిదాకా స్పందన రాలేదు'' అని తెలిపింది. కథనంలో ద వైర్ ఏం చెప్పిందంటే...

ఫలితాల వెల్లడిలో లోక్‌సభ స్థానాలవారీగా లెక్కించిన ఈవీఎం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ల సంఖ్యను ఈసీ విడిగానే పేర్కొంది. అంతేగాక ఈసారి పోలైన మొత్తం ఈవీఎం ఓట్ల సంఖ్యను కూడా స్పష్టంగా పేర్కొంది. ఆ సంఖ్యలో ఇక మార్పు చేర్పులకు అవకాశం లేదని కూడా స్పష్టం చేసింది. పోస్టల్ బ్యాలెట్లతో వీటికి సంబంధం లేదని కూడా చెప్పింది. అలా పలు లోక్‌సభ స్థానాల్లో ఈసీ వెల్లడించిన మొత్తం ఈవీఎం ఓట్ల సంఖ్య కంటే లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య తక్కువగా ఉండటంపై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా చర్చకు తెరలేచింది. దాంతో అది అసహజమేమీ కాదంటూ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివరణ ఇచ్చారు. ''కొన్నిచోట్ల అలా జరుగుతుంటుంది. ఒక్కోసారి ప్రిసైడింగ్ అధికారి పొరపాటున కంట్రోల్ యూనిట్/వీవీప్యాట్ యూనిట్ నుంచి మాక్ పోలింగ్ స్లిప్పులను తొలగించకుండానే పోలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు. కొన్నిసార్లు ఫామ్ 17–సీలో ఓట్ల సంఖ్యను తప్పుగా నమోదు చేస్తారు. దాంతో అవి కంట్రోల్ యూనిట్‌లోని ఓట్ల సంఖ్యతో సరిపోలవు. ఈ రెండు సందర్భాల్లోనూ సదరు పోలింగ్ స్టేషన్లలో నమోదయ్యే ఓట్లను చివరిదాకా లెక్కించరు. అలాంటి మొత్తం ఓట్ల సంఖ్య విజేతకు లభించిన మెజారిటీ కంటే తక్కువగా ఉంటే ఇక వాటిని పూర్తిగా పక్కన పెట్టేస్తారు. అలాంటప్పుడు పోలైన ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన వాటి సంఖ్య తక్కువగానే ఉంటుంది'' అని పేర్కొన్నారు. నమోదైన ఈవీఎం ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు లెక్కించడంపై మాత్రం ఈసీ నుంచి స్పందన లేదు. ఒక లోక్‌సభ స్థానంలో విజేతకు కేవలం 48 ఓట్ల మెజారిటీ వచ్చింది. అక్కడ పోలైన ఈవీఎం ఓట్ల కంటే రెండు ఈవీఎం ఓట్లను అదనంగా లెక్కించారు! విజేతకు 1,615 ఓట్ల మెజారిటీ వచ్చిన మరో స్థానంలో 852; 1,884 ఓట్ల మెజారిటీ వచ్చిన ఇంకో చోట 950 ఓట్లు అదనంగా లెక్కించారు.

ఇవీ సందేహాలు..

- నమోదైన మొత్తం ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఎలా సాధ్యం?
- లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య పోలైన వాటికంటే తగ్గడానికి మాక్ పోలింగ్ డాటాను తొలగించకపోవడమే కారణమన్న నిర్ధారణకు ప్రాతిపదిక ఏమిటి?
- ఇలా ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన ఓట్ల సంఖ్య ఎక్కువ/తక్కువగా నమోదైన లోక్‌సభ స్థానాల వారీగా ఈసీ స్పష్టమైన వివరణ ఎందుకివ్వడం లేదు?
- ఈ ఎన్నికల్లో మొత్తమ్మీద ఎన్ని ఈవీఎంలను, ఏ కారణాలతో పక్కన పెట్టారో ఈసీ వెల్లడించగలదా?

వివరణ ఇవ్వాల్సిందే
ప్రశాంత్ భూషణ్

ఓట్ల లెక్కింపులో గోల్‌మాల్‌కు సంబంధించి 'ద వైర్' కథనంపై ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ స్పందించారు. ''దేశవ్యాప్తంగా 140కి పైగా లోక్‌సభ స్థానాల్లో పోలైన మొత్తం ఈవీఎం ఓట్ల కంటే ఎక్కువ ఈవీఎం ఓట్లను లెక్కించారు! అసలేం జరుగుతోంది?'' అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. 'ద వైర్' కథనాన్ని ట్యాగ్ చేశారు. ''అహంకారంతో ప్రవర్తిస్తున్న ఈసీఐ ఈ విషయంలో దేశ ప్రజలకు కచ్చితంగా వివరణ ఇవ్వాల్సిందే'' అని డిమాండ్ చేశారు.

తదుపరి ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ: భారత సైన్యం నూతన సారథిగా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి రక్షణ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఉన్నారు. జూన్ 30న మధ్యాహ్నం చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ సి.పాండే అదే రోజు ఉదయం పదవీవిరమణ చేయనున్నారు. ఆయన మే 31నే రిటైరవాల్సి ఉండగా అసాధారణ రీతిలో నెల పాటు పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది.


'మోదీ కా పరివార్' క్యాప్షన్ తీసేయండి

బీజేపీ శ్రేణులకు మోదీ సూచన

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమ ఖాతాల్లో 'మోదీ కా పరివార్' క్యాప్షన్ తొలగించాలని బీజేపీ కార్యకర్తలకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం విజ్ఞప్తి చేశారు. ''దేశవ్యాప్తంగా ప్రజలు నాపై అభిమానానికి గుర్తుగా వారి సోషల్ మీడియా ఖాతాల్లో 'మోదీ కా పరివార్'ను జత చేశారు. వాటిని చూసి ఎంతో శక్తిని, ఉత్సాహాన్ని పొందాను. ఇందుకు ప్రజలకు కృతజ్ఞతలు. లోక్‌సభ ఎన్నికల విజయం ద్వారా ఆ క్యాప్షన్ ఉద్దేశాన్ని సాధించాం. కను మీ సోషల్ అకౌంట్ల నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని అభ్యర్థిస్తున్నా. ఆ క్యాప్షన్ లేకున్నా దేశం కోసం పనిచేస్తున్న కుటుంబంగా మన బంధం కొనసాగుతుంది'' అని పేర్కొన్నారు. మోదీకి కుటుంబమే లేదంటూ ఎన్నికల ప్రచారంలో ఆర్జేడీ నేత లాలు ప్రసాద్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు తామంతా మోదీ కుటుంబమే (మోదీ కా పరివార్) అంటూ సామాజిక మాధ్యమ ఖాతాల్లో క్యాప్షన్ పెట్టుకోవడం తెలిసిందే.

ఉగ్ర దుర్బేధ్యంగా భారత్‌ను నిర్మిస్తా

కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వేళ అమిత్ షా వ్యాఖ్య



జేపీ(రాంవిలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్ తన కుటుంబసభ్యుల సమక్షంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులూ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు.

న్యూఢిల్లీ: భారత దేశాన్ని అజేయ శక్తిగా మలుస్తానని నూతన హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. మంగళవారం ఢిల్లీలో హోం శాఖ కార్యాలయంలో అమిత్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 'దేశం, దేశ ప్రజల భద్రతే నాకు అత్యున్నతం. మోదీ 3.0 ప్రభుత్వం దేశాన్ని భద్రత విషయంలో సమున్నత శిఖరాలకు చేరుస్తుంది. ఉగ్రవాదం, వేర్పాటువాదం, నక్సల్ ప్రభావం బారిన పడకుండా దుర్భేద్యంగా మారుస్తా' అని అన్నారు. మరోసారి కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన మూడు నేర చట్టాలు.. భారతీయ న్యాయ సంహిత–2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత–2023, భారతీయ సాక్ష్యా అధినియం–2023ల సమర్థ అమలును అమిత్‌షా పర్యవేక్షించనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రులు

మంత్రులుగా ప్రమాణంచేసిన నేతలు మంగళవారం ఢిల్లీలో తమతమ శాఖల కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించి కర్తవ్య నిర్వహణ మొదలెట్టారు. కొందరు నేతలు పూజాకార్యక్రమాలు చేసి మంత్రి కుర్చీల్లో కూర్చుంటే కొందరు కమలదళ నినాదాలు చేస్తూ కుర్చీల్లో ఆసీనులయ్యారు. జైశంకర్ భారత విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా ఆరోగ్య శాఖ మంత్రిగా, అశ్వనీ వైష్ణవ్ రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కమ్యూనికేషన్ శాఖ మంత్రిగా జ్యోతిరాదిత్య సింధియా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా కిరెన్ రిజిజు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ మంత్రిగా ప్రహ్లాద్ జోషి, విద్యుత్ శాఖ మంత్రిగా మనోహర్ లాల్ ఖట్టర్, పర్యావరణ మంత్రిగా భూపేంద్ర యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రిగా ఎల్

మహిళా మంత్రులూ..

వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తానని మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతూ అన్నపూర్ణాదేవి చెప్పారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రిగా అనుప్రియా పటేల్, క్రీడలు, యువజన వ్యవహారాల సహాయ మంత్రిగా రక్షా ఖడ్సే, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రిగా శోభా కరంద్లాజె, మహిళా, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా సావిత్రీ ఠాకూర్, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా నిమూబెన్ బంభానియా బాధ్యతలు స్వీకరించారు.



వేదికపై రాహుల్, ప్రియాంక

ప్రియాంక పోటీచేస్తే ప్రధాని ఓడేవారు

వారణాసిలో పోటీపై రాహుల్ గాంధీ వ్యాఖ్య

రాయ్‌బరేలీ: ప్రధాని మోదీ పోటీచేసిన వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ పోటీచేస్తే ఆమె రెండు, మూడు లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గేవారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాయ్‌బరేలీలో తనను, అమేథీలో కిశోరీలాల్ శర్మను గెలిపించినందుకు గుర్తుగా మంగళవారం రాయ్‌బరేలీలో ఏర్పాటుచేసిన 'కృతజ్ఞత కార్యక్రమం'లో అమేథీ, రాయ్‌బరేలీ ఓటర్లనుద్దేశించి రాహుల్ కొద్దిసేపు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, అమేథీ ఎంపీ కిశోరీలాల్ శర్మ పాల్గొన్నారు. ''పార్లమెంట్‌లో ఎన్డీఏ బలాన్ని తగ్గించేందుకే రాయ్‌బరేలీ, అమేథీ సహా దేశవ్యాప్తంగా నియోజకవర్గాల్లో విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీలు ఉమ్మడిగా పోరాడాయి. ''బీజేపీ నాయకుల గెలుపు అహంకారాన్ని మేం పట్టించుకోం. మా ఆలోచనంతా ప్రజా సమస్యల గురించే. అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ, ఇతరత్రా కార్యక్రమాల్లో బడా పారిశ్రామికవేత్తలకు అతి విలువ ఇచ్చి సాధారణ జనాలను మోదీ గాలికొదిలేశారు. వారి సమస్యలను పట్టించుకోలేదు. అందుకే ఏకంగా అయోధ్యలోనూ బీజేపీకి ఓటమి రుచి చూపించి ఓటర్లు బుద్ధి చెప్పారు'' అని అన్నారు.

అవధ్ గొప్ప సందేశమిచ్చింది: ప్రియాంక

అమేథీ, రాయ్‌బరేలీలో బీజేపీని ఓడించి ఇక్కడి అవధ్ ప్రాంతం ఉత్తరప్రదేశ్‌కేకాదు యావత్‌భారతానికి చక్కటి సందేశం ఇచ్చిందని, మనకు వాస్తవికమైన స్వచ్ఛమైన రాజకీయాల అవసరం ఉందని ప్రియాంకా అన్నారు.

24 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

ప్రమాణ స్వీకారం చేయనున్న నూతన ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 24 నుంచి జూలై 3వ తేదీ వరకూ జరుగనున్నాయి. కేంద్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించడానికి స్పీకర్‌ను ఎంపిక చేయడంతోపాటు నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే ప్రత్యేక సమావేశాల్లో తొలి రెండు రోజులు సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారు. ప్రొటెం స్పీకర్‌గా కాంగ్రెస్ సభ్యుడు కొడికొన్నిల్ సురేశ్ వ్యవహరించనున్నట్లు సమాచారం. లోక్‌సభలో ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ సభ్యుడు వ్యవహరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి లోక్‌సభకు ఎన్నికైన వారిలో కొడికున్నిల్ సురేశ్, గత సమావేశాల్లో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన వీరేంద్రకుమార్ ఖటిక్(బీజేపీ) ఎనిమిదేసి పర్యాయాలు ఎంపీలుగా నెగ్గారు. వీరేంద్రకుమార్ కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కారణంగా కొడికున్నిల్ సురేశ్‌కు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్ ఎంపిక జరుగనుంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం పార్టీ, జేడీ(యూల) లోక్‌సభ సభాపతి పదవి కోసం పట్టుపడుతున్నప్పటికీ ఆ స్థానానికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ అందుకు అంగీకరించడం లేదు. స్పీకర్ పోస్టును వదులుకోబోమని చెబుతోంది. గత సమావేశాలకు సభాపతిగా పనిచేసిన ఓం బిర్లాతోపాటు పలువురి పేర్లను బీజేపీ అగ్రనాయకత్వం పరిశీలిస్తోంది. మరోవైపు, బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు పరిశీలనలో ఉందన్న వార్తలు వస్తున్నాయి.

కాల్పుల విరమణ తీర్మానానికి ఐరాస ఆమోదం

ఐక్యరాజ్య సమితి: గాజాలో ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న హమాస్, ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు పలకడమే లక్ష్యంగా అమెరికా తీసుకొచ్చిన కాల్పుల విరమణ తీర్మానాన్ని ఐరాస భద్రతా మండలి ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ఇజ్రాయెల్ సైతం ఆమోదించిందని అమెరికా పేర్కొంది. భద్రతా మండలిలో 15 సభ్యదేశాలకుగాను 14 దేశాలు ఈ తీర్మానికి అనుకూలంగా ఓటేశాయి. రష్యా మాత్రం దూరంగా ఉండిపోయింది. ఇకనైనా ఆలస్యం చేయకుండా ఇజ్రాయెల్, హమాస్‌లు కాల్పుల విరమణను బేషరతుగా అమల్లోకి తేవాలని తీర్మానంలో పేర్కొన్నారు. మరోవైపు, 'సార్వభౌమ పాలస్తీనా దేశం' డిమాండ్ నుంచి వెనక్కి తగ్గబోమని హమాస్ తేల్చిచెప్పింది.



బీజేపీ శాసన సభా పక్షనేతగా ఎన్నికయ్యాక మాట్లాడుతున్న మాఝీ

గిరిజన బిడ్డకు ముఖ్యమంత్రి కిరీటం

ఒడిశా నూతన సీఎంగా మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: ఉత్కంఠకు తెరపడింది. ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా గిరిజన బిడ్డ మోహన్ చరణ్ మాఝీ(52) బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త సీఎంగా మాంఝీని ఎంపిక చేసినట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రులుగా కె.వి.సింగ్‌దేవ్, ప్రవాతి పరీడా బాధ్యతలు చేపడతారని వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలతో పాటు జరిగిన ఒడిశా శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. 147 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీ 78 స్థానాలు గెలుచుకుంది. తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై రకరకాల ఊహాగానాలు వినిపించాయి. పలువురు సీనియర్ల పేర్లు తెరపైకి వచ్చింది అయితే, ఎవరూ ఊహించని విధంగా మోహన్ చరణ్ మాఝీని బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. మాఝీ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. బుధవారం భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారు.

సర్పంచ్ నుంచి సీఎం దాకా..

బీజేపీ గిరిజన నేత మోహన్ చరణ్ మాఝీ మూడు దశాబ్దాల క్రితం గ్రామ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. కెంజార్ జిల్లాలోని రైకాలా గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి వాచ్‌మన్‌గా పనిచేసేవారు. మాఝీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 1997 నుంచి 2000 సంవత్సరం దాకా సర్పంచ్‌గా సేవలందించారు. బీజేపీ ఆదివాసీ మోర్చా కార్యదర్శిగా వ్యవహరించారు. 2000, 2004, 2019, 2024లో కెంజార్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

అలా చేస్తే నీట్–యూజీ గౌరవం దెబ్బతింటుంది

పేపర్ లీకేజీ పేరిట మళ్లీ పరీక్ష పెట్టాలన్న పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: పేపర్ లీకేజీ, పరీక్ష నిర్వహణలో లోపాలు పేరిట మళ్లీ నీట్–యూజీ పరీక్ష నిర్వహిస్తే ఈ పరీక్షకున్న గౌరవం దెబ్బతింటుందని సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వ్యాఖ్యానించింది. పేపర్ లీకేజీ ఆరోపణలు వెల్లువెత్తడంతో మీ స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ ఆదేశించింది. వైద్యవిద్య ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్–యూజీ 2024 పరీక్ష పేపర్ లీక్ అయిందని, పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని విపక్షాలు ఆరోపించడంతోపాటు పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో ఈ పిటిషన్‌ను కోర్టు మంగళవారం విచారించింది.

మళ్లీ అడిగితే పిటిషన్‌ను కొట్టేస్తాం

ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సుల అడ్మిషన్లను నిలిపేయాలంటూ చేసిన పిటిషనర్ల తరఫున న్యాయవాది మ్యాథ్యూస్ జె.నెడుమ్‌పారా చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ''ఎగ్జామ్ పేపర్లు లీక్ అయ్యాయి. ముందే ప్రశ్నపత్రం సంపాదించి పరీక్షలో అత్యధిక మార్కులు తెచ్చుకున్నారు. లక్ష సీట్లు ఉంటే 23 లక్షల మంది పరీక్ష రాశారు. అత్యంత కఠినమైన ఈ పరీక్షలో ఏకంగా 67 మంది విద్యార్థులు 720 మార్కులకుగాను సరిగ్గా 720 మార్కులు సాధించారు. ఢిల్లీలోని భారతీయ విద్యాభవన్ మెహతా విద్యాలయలో ప్రశ్నలకు సమాధానాలు వెతికే ముఠాతో ఇద్దరు ఎంబీబీఎస్ విద్యార్థులుసహా నలుగురిని ఇప్పటికే అరెస్ట్‌చేశారు'' అని లాయర్ వాదించారు. ''కౌన్సిలింగ్‌ను ఆపేది లేదు. అడ్మిషన్ల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది. ఆపాలని మీరు ఇలాగే వాదనలు కొనసాగిస్తే మీ పిటిషన్‌ను కొట్టేస్తాం' అని లాయర్‌ను ధర్మాసనం హెచ్చరించింది. ''మళ్లీ ఎగ్జామ్ నిర్వహించడమంటే ఆ పరీక్ష పవిత్రతను భంగపరచడమే. ఆరోపణలపై మాకు సరైన సమాధానాలు కావాలి' అని కోర్టు వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏలతోపాటు పరీక్షకేంద్రంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలున్న బిహార్ ప్రభుత్వానికీ కోర్టు నోటీసులు పంపించింది. శివాంగి మిశ్రా, మరో 9 మంది ఎంబీబీఎస్ ఆశావహులు పెట్టుకున్న పిటిషన్ పెండింగ్‌లో ఉండటంతో దీనిపై స్పందన తెలపాలని ఎన్‌టీఏను కోర్టు ఆదేశించింది. కోర్టు వేసవికాల సెలవులు ముగిసే జూలై 8వ తేదీన ఈ కేసు తదుపరి విచారణ చేపడతామని కోర్టు వెల్లడించింది.

ఏటా రెండు సార్లు అడ్మిషన్లు

యూజీసీ చీఫ్ జగదీశ్

న్యూఢిల్లీ: విదేశీ వర్సిటీల తరహాలో భారతీయ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు ఇకపై ఏటా రెండు సార్లు అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టే అవకాశం కల్పిస్తామని విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) చీఫ్ జగదీశ్ కుమార్ ప్రకటించారు. 2024–25 విద్యాసంవత్సం నుంచి జూలై–ఆగస్ట్, జనవరి–ఫిబ్రవరి సీజన్లలో ఈ అడ్మిషన్లు ఉంటాయని ఆయన వెల్లడించారు. ''బోర్డ్ పరీక్షల తుది ఫలితాలు ఆలస్యంగా ప్రకటించడం, ఆరోగ్య సమస్యలు, ఇతర వ్యక్తిగత కారణాలతో ఆ ఏడాది అడ్మిషన్‌ను కోల్పోయిన విద్యార్థులకు ఈ కొత్త విధానం ఎంతో ఉపయోగకరం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అడ్మిషన్‌ను పొందే అవకాశం కోల్పోతే తదుపరి అకడమిక్ సంవత్సరందాకా వేచి ఉండాల్సిన పనిలేదు. ఆర్నెళ్ల తర్వాత మొదలయ్యే అడ్మిషన్ ప్రక్రియలో సీటు కోసం ప్రయత్నించవచ్చు. ప్రాంగణ నియామకాలు చేపట్టే సంస్థలు, పరిశ్రమలు సైతం ఏటా రెండుసార్లు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు మొగ్గుచూపొచ్చు. దాంతో గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు రెట్టింపు అయ్యేసదవకాశం ఉంది' అని జగదీశ్ వివరించారు.

ఎన్నికల ఫలితాలు బీజేపీకి 'రియాలిటీ చెక్'

ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ ఆక్షేపణ

న్యూఢిల్లీ: అతి విశ్వాసంతో ఉన్న బీజేపీ నేతలు, కార్యకర్తలకు ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒక 'రియాలిటీ చెక్' అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) పత్రిక 'ఆర్గనైజర్' స్పష్టంచేసింది. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాను చూసి మురిసిపోతూ నీటి బుడగ లోపల ఉండిపోయిన బీజేపీ శ్రేణులు ప్రజల మదిలో ఏముందో తెలుసుకోలేదని, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను గుర్తించలేదని ఆక్షేపించింది. అందుకే ఆశించిన ఫలితాలు రాలేదని పేర్కొంది. ఈ మేరకు ఆర్గనైజర్ తాజా సంచికలో ఒక వ్యాసం ప్రచురించారు. ఈసారి ఎన్నికల్లో స్వయంసేవకులను బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంప్రదించలేదని, వారి సహకారం తీసుకోలేదని తప్పుపట్టారు. బీజేపీకి ఆర్ఎస్ఎస్ అనేది 'క్షేత్రస్థాయి దళం' కాదని వివరించారు.

విమాన ప్రమాదంలో మలావీ ఉపాధ్యక్షుడు సొలోస్ దుర్మరణం

బ్లాంటైర్: ఆఫ్రికా దేశం మలావీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విమాన ప్రమాదంలో దేశ ఉపాధ్యక్షుడు సొలోస్ షిలిమాతోపాటు మరో 9 మంది దుర్మరణం పాలయ్యారు. దేశ ఉత్తర భాగంలోని పర్వత ప్రాంతంలో విమానం శకలాలను గుర్తించినట్లు మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా మంగళవారం వెల్లడించారు. ఈ దుర్ఘటనలో ఎవరూ ప్రాణాలతో మిగల్లేదని అన్నారు. ఉపాధ్యక్షుడు షిలిమా సహా మొత్తం 10 మంది సోమవారం ఉదయం సైనిక విమానంలో మలావీ రాజధాని లిలోంగ్వే నుంచి 370 కిలోమీటర్ల దూరంలోని మజుజు సిటీకి బయలుదేరారు. ముజుజులో ప్రతికూల వాతావరణం వల్ల ల్యాండ్ అయ్యే అవకాశం లేకపోవడంతో వెనక్కి వెళ్లాలని విమానం పైలట్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ సమాచారం ఇచ్చారు. 45 నిమిషాల తర్వాత విమానంతో సంబంధాలు తెగిపోయాయి. రాడార్ నుంచి విమానం అదృశ్యమైంది.

హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్ అరెస్ట్

నటి పవిత్ర గౌడ కూడా..

మైసూరు: బెంగళూరులో జరిగిన ఓ హత్యకు సంబంధించి ప్రముఖ కన్నడ నటుడు దర్శన్ తూగుదీప(47)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి సన్నిహితురాలైన నటి పవిత్ర గౌడనూ అరెస్ట్ చేశారు. కామాక్షిపాళ్యలోని మురుగు కాల్వలో ఈనెల 9న రేణుకాస్వామి అనే వ్యక్తి మృతదేహం బయటపడింది. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు వెల్లడించిన సమాచారం ఆధారంగా మంగళవారం మైసూర్ హోటల్‌లో ఉన్న దర్శన్‌ను, అనంతరం పవిత్రను అరెస్ట్ చేశారు. చిత్రదుర్గ జిల్లా కేంద్రానికి చెందిన స్వామి ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగి. సామాజిక మాధ్యమాల్లో ఇటీవల పవిత్రపై అతడు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడు. ఈ నేపథ్యంలో అతడు హత్యకు గురైనట్లు అనుమానిస్తున్నారు.

తుపాకీ అక్రమ కొనుగోలు కేసు.. హంటర్ బైడెన్‌ను దోషిగా తేల్చిన కోర్టు

విల్మింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్(54)ను తుపాకీ కొనుగోలు కేసులో మొత్తం మూడు ఆరోపణల్లోనూ కోర్టు దోషిగా తేల్చింది. 2018లో తుపాకీ కొనుగోలు చేసిన సమయంలో డ్రగ్స్‌కు బానిస కాదంటూ ఆయుధ డీలర్ వద్ద అబద్ధం చెప్పారని, ఆ తుపాకీని 11 రోజులపాటు అక్రమంగా తన వద్దే ఉంచుకున్నారని న్యాయమూర్తులు నిర్ధారించారు. కేసు విచారించిన డెలావెర్‌లోని ఫెడరల్ కోర్టు జడ్జి మేరీఎల్లెన్ నొరీకా మాత్రం హంటర్‌కు 120 రోజుల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని, అక్టోబర్‌లో తీర్పు వెలువడుతుందని చెప్పారు. సాధారణంగా ఇలాంటి నేరాలకు గరిష్ఠంగా 25 ఏళ్ల వరకు జైలు శిక్షపడే అవకాశాలున్నాయి. హంటర్ బైడెన్‌పై మరో కేసుంది. పన్ను ఎగ్గొట్టిన ఆరోపణలపై కాలిఫోర్నియా కోర్టు సెప్టెంబర్‌లో విచారణ జరపనుంది.

49 మంది మృతి.. 140 మంది గల్లంతు

యెమెన్ తీరంలో మునిగిన వలసదారుల పడవ

కైరో: యెమెన్ తీరంలో వలసదారులతో వస్తున్న పడవ మునిగి 49 మంది చనిపోగా మరో 140 మంది గల్లంతయ్యారు. యెమెన్‌కు 320 కిలోమీటర్ల దూరంలోని సోమాలియా తీరం నుంచి బయలుదేరిన ఈ పడవలో 260 మంది సోమాలియన్లు, ఇథియోపియన్లు ఉన్నారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. కిక్కిరిసిన వీరి పడవ గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో సోమవారం మునిగిపోయింది. వీరిలో 71 మందిని రక్షించగలిగామని, మృతుల్లో 31 మంది మహిళలు, ఆరుగురు చిన్నారులు ఉన్నట్లు ఐరాస వివరించింది. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించింది.

శిక్షణలోని ఐఏఎస్‌లతో సీఎం భేటీ



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం(ఎంసీ ఆర్‌హెచ్చార్డీ)లో శిక్షణ పొందుతున్న 2023 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధి కారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో సమావే శమయ్యారు. ప్రస్తుతం వారు అసిస్టెంట్ కలెక్టర్ హోదాలను కలిగి ఉన్నారు.

ఆర్టీసీ టికెట్ ధరల్లో స్వల్ప పెరుగుదల

రూ.3 చొప్పున పెరిగిన టోల్ యూజర్ చార్జీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ టికెట్ చార్జీల్లో టోల్ గేట్ రుసుములు (యూజర్ చార్జీలు) పెరిగాయి. టోల్ ప్లాజాలు ఉన్న మార్గాల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సుల టికెట్ ధరలు రూ.3 చొప్పున పెరిగాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం టోల్ రుసుములను సవరించిన విషయం తెలిసిందే. జాతీయ రహదారులపై అన్ని టోల్‌గేట్లలో ఈ రుసుములు స్వల్పంగా పెరిగాయి. ఆర్టీసీ బస్సులు కూడా టోల్‌రుసుములు చెల్లించాల్సి ఉంటున్నందున, టికెట్ ధరల్లో ఆ రుసుము కూడా జత చేస్తున్నారు. ఇప్పుడు టోల్ గేట్ చార్జీలు పెరగడంతో ఆర్టీసీ కూడా ఆ భారాన్ని ప్రయాణికులపైనే మోపింది. టికెట్ చార్జీల్లో కలిసి ఉన్న టోల్ రుసుములను రూ.3 చొప్పున పెంచింది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.10గా ఉన్న టోల్‌రుసుమును రూ.13కు, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, గరుడ, వజ్ర బస్సుల్లో ఉన్న రూ.13ను రూ.16కు, గరుడ ప్లస్ బస్సుల్లో రూ.14 నుంచి రూ.17కు, నాన్ ఏసీ స్లీపర్, హైబ్రీడ్ స్లీపర్ బస్సుల్లో రూ.15 నుంచి రూ.18కి, ఏసీ స్లీపర్ బస్సుల్లో రూ.20 నుంచి రూ.23కు పెంచారు.

ఆస్తి కోసం అక్కను చంపాడు

2021లో ఘటన.. తాజా నివేదికతో బయటపడిన నిజం



నిందితుడు వెంకటేశ్వరరావు (మధ్య)ను అదుపులోకి తీసుకుంటున్న సీఐ వెంకటేశ్

పెనుబల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న అక్క ఆస్తిని సొంతం చేసుకోవాలన్న కుట్రతో కూల్ డ్రింక్‌లో విషం కలిపి హత్య చేశాడు ఓ వ్యక్తి. దీనిని సాధారణ మృతిగా నమ్మించినా ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికతో అసలు నిజం బయటపడింది. దీంతో మూడేళ్ల తర్వాత పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి తాజాగా నివేదిక రావడంతో అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చినట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ఎస్.వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్‌కు చెందిన దూదిపాళ్ల కనకమ్మ (70)కు యుక్తవయస్సులో వివాహమైనా భర్త ఆమెను వదిలేసి మరో పెళ్లి చేసుకున్నాడు. కనకమ్మ పేరిట మూడెకరాలు, ఆమె తల్లి పేరిట మూడెకరాల భూమి ఉండగా తల్లి పోషణను ఆమే చూసుకోవడంతో ఆరెకరాల భూమి సంక్రమించింది. ఈ క్రమంలో వృద్ధాప్యం బారిన పడిన కనకమ్మ పేరిట ఉన్న భూమిని కాజేయడానికి ఆమె సోదరుడు కోమటి వెంకటేశ్వరరావు నిర్ణయించుకున్నాడు. 2021 సంవత్సరంలో కూల్‌డ్రింక్‌లో విషం కలిపి అక్కకు తాగించగా చనిపోయింది. అయితే, కనకమ్మ అనారోగ్యంతో మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్తులను నమ్మించినా, మరో సోదరుడు కోమటి నాగేశ్వరరావు వీఎం బంజర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం చేయించి ల్యాబ్‌కు శరీర భాగాలను పంపించగా ఇటీవల నివేదిక అందింది. ఇందులో విషప్రయోగంతోనే కనకమ్మ మృతి చెందినట్లు నివేదిక రావడంతో హత్య కేసుగా మార్చి కోమటి వెంకటేశ్వరరావును సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సత్తుపల్లి కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

ఒక్క రోజే

65 లక్షల మంది ప్రయాణం



24 కోట్ల రూపాయల ఆదాయం

ఆక్యుపెన్సీ రేషియో 109 శాతం • సోమవారం అరుదైన రికార్డు నమోదు చేసిన ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్

ఒకే రోజు బస్సుల్లో 65 లక్షల మందిని గమ్యం చేర్చి ఆర్టీసీ మరో రికార్డు సృష్టించింది. సోమవారం రోజున ఈ ఘనత చోటు చేసుకుంది. సాధారణ రోజులతో పోలిస్తే సోమవారాల్లో ఎక్కువ మంది ప్రయాణిస్తుంటారు. ఈ పదో తేదీ సోమవారం రోజున ఆ రద్దీ మరింత ఎక్కువగా నమోదైంది. ఆర్టీసీ చరిత్రలో ఎప్పుడూ రికార్డు కాని రీతిలో ఏకంగా 109.8 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. బస్సులన్నీ కిక్కిరిసి ప్రయాణించటంతో ఆర్టీసీకి 24 గంటల్లో ఏకంగా రూ.24.06 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో జీరో టికెట్ల వాటా కూడా ఉంది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు కొనుగోలు చేసిన జీరో టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సి ఉంది. వాటితో కలుపుకొని ఈ రికార్డు స్థాయి ఆదాయాన్ని ఒకే రోజు ఆర్టీసీ పొందినట్టయింది.

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిన విషయం తెలిసిందే. సోమవారాల్లో ఆ రద్దీ మరీ ఎక్కువగా ఉంటోంది. దీంతో గత కొన్ని నెలలుగా సోమవారాల్లో ఆర్టీసీ అధిక ఆదాయాన్ని సాధిస్తోంది. జీరో టికెట్ల రూపంలో రికార్డుస్థాయిలో ఆదాయం నమోదవుతున్నా, ఆర్టీసీకి మాత్రం అదే రోజు ఆ ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా, ప్రతినెలా ఆ మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లిస్తేనే దాన్ని ఆదాయంగా పరిగణించాల్సి వస్తుంది. కానీ, పాత బకాయిల

ప్రభుత్వం రీయింబర్స్ చేస్తేనే..

తోపాటు, ఈ ఆదాయం మొత్తంగా ఇప్పటి వరకు ఆర్టీసీకి అందలేదని తెలుస్తోంది. గతేడాది బడ్జెట్‌కు సంబంధించిన బకాయిలతో కలుపుకుంటే ఆర్టీసీకి ప్రభుత్వం రూ.2200 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు అంతమొత్తం విడుదల కాలేదు. ఇక 2015 వేతన సవరణకు సంబంధించి బాండ్ల డబ్బులు కూడా పూర్తిస్థాయిలో అందలేదు. ఆ మొత్తానికి సంబంధించిన నిధులు ఆర్టీసీకి విడుదల చేస్తున్నట్టు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించినా, కేవలం డ్రైవర్లకు మాత్రమే ఆ నిధులందాయి. మిగతావారు ఎదురుచూస్తున్నారు. దీనికి కూడా నిధులు లేకపోవటమే కారణంగా కనిపిస్తోంది. ఇప్పుడు కాగితాలపై రికార్డు స్థాయి ఆదాయం నమోదైనా.. ప్రభుత్వం రీయింబర్స్ చేసినప్పుడే అది నిజం ఆదాయంగా ఆర్టీసీ పరిగణించాల్సి ఉంటుంది.

ఆర్టీసీలో కన్సాలిడేటెడ్ రెమ్యునరేషన్ పెంపు

పదవీ విరమణ అనంతరం పనిచేసేవారు, కారుణ్య నియామక ఉద్యోగులకు లబ్ధి

సాక్షి, హైదరాబాద్: కారుణ్య నియామకాల కింద పనిచేసే ఉద్యోగులు, పదవీ విరమణ అనంతరం సర్వీసులో కొనసాగే వారి వేతనాల(కన్సాలిడేటెడ్ రెమ్యునరేషన్)ను ఆర్టీసీ పెంచింది. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలను సవరించిన విషయం తెలిసిందే. 2017 వేతన సవరణకు సంబంధించి ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించి అమలులోకి తెచ్చింది. దీంతో వారి వేతనాలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో కన్సాలిడేటెడ్ చెల్లింపులనూ సవరిస్తూ ఆర్టీసీ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

బ్రెడ్ విన్నర్ స్కీం పేరుతో ఆర్టీసీలో కారుణ్య నియామకాలు కొనసాగుతాయి. సర్వీసులో ఉండి చనిపోయే ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తారు. వారి అర్హతల ఆధారంగా ఈ కేటాయింపులుంటాయి. అయితే, ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి దిగజారిన నేపథ్యంలో, గత ప్రభుత్వం కారుణ్య నియామకాలను సరిగా చేపట్టలేదు. దీంతో దాదాపు 1800 కుటుంబాలు ఎదురుచూస్తూ వచ్చాయి. ఆయా కుటుంబాల ఒత్తిడి పెరగటంతో దశలవారీగా వారికి ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, పూర్తిస్థాయి ఉద్యోగం కాకుండా, తాత్కాలిక పద్ధతిలో ఇవ్వనుంది. మూడేళ్లపాటు వారి పనితీరు పరిశీలించి తదనుగుణంగా పర్మినెంట్ చేసే విషయంపై నిర్ణయం తీసుకునేలా అమల్లోకి తెచ్చింది. అప్పటివరకు

పెంపు ఇలా...

పదవీ విరమణ పొందిన తర్వాత సర్వీసు కొనసాగింపు విషయంలో:

పోస్టు	ప్రస్తుతం (రూ.లలో)	సవరణ తర్వాత (రూ.లలో)
జూనియర్ స్కేల్ ఆఫీసర్, తత్సమాన పోస్టులు	30,000	50,000
అసిస్టెంట్ మేనేజర్, తత్సమాన పోస్టులు	20,000	33,000
సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్	15,000	27,000
సీనియర్ అసిస్టెంట్స్, జూ.అసిస్టెంట్స్	11,000	21,000
సెక్యూరిటీ సబ్‌ఇన్‌స్పెక్టర్/అసిస్టెంట్ ఎస్ఐ	15,000	23,000
ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్	11,000	19,000
ఆర్టీసీ కానిస్టేబుల్	10,000	19,000
క్లర్క్/ రికార్డు ట్రేసర్	9,000	18,000

బ్రెడ్ విన్నర్ పథకం కింద ఇలా...

పోస్టు	ప్రస్తుతం	సవరణ తర్వాత
గ్రేడ్-2 డ్రైవర్	రూ.19,000	రూ.23,000
గ్రేడ్-2 కండక్టర్	రూ.17,000	రూ.20,600
ఆర్టీసీ కానిస్టేబుల్, శ్రామిక్	రూ.15,000	రూ.18,200

కన్సాలిడేటెడ్ రెమ్యునరేషన్ చెల్లించనుంది. డ్రైవర్ గ్రేడ్-2, కండక్టర్ గ్రేడ్-2, ఆర్టీసీ కానిస్టేబుల్, శ్రామిక్ పోస్టుల్లో నియామకాలు ప్రారంభించింది. ఇప్పుడు ఆయా పోస్టుల్లో పనిచేస్తున్న వారి రెమ్యునరేషన్‌ను పెంచింది. అలాగే, ఆర్టీసీలో వివిధ పోస్టుల్లో పనిచేసి పదవీ విరమణ చేసినవారు తిరిగి వారి సేవలు కొనసాగించే పద్ధతి కూడా అమలులో ఉంది. ఆయా స్థాయిల్లో ఖాళీగా ఉండే పోస్టుల ఆధారంగా వారి సర్వీసులను ఆర్టీసీ కొనసాగిస్తుంది. వారికి కూడా ఆయా పోస్టుల ఆధారంగా కన్సాలిడేటెడ్ రెమ్యునరేషన్ చెల్లిస్తారు. ఇప్పుడు వాటిని కూడా పెంచింది.

రామోజీ కుటుంబానికి సీఎం రేవంత్ పరామర్శ



రామోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/అబ్దుల్లాపూర్‌మెట్: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబ సభ్యులు కిరణ్, శైలజ, విజయేశ్వరిలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం రామోజీ ఫిల్మ్‌సిటీలోని వారి నివాసానికి సీఎం వెళ్లారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించా రు. సీఎం వెంట మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

టీడీపీ ఒత్తిళ్లతో వార్తా చానళ్ల నిలిపివేత

ఏపీలో సాక్షి, మరికొన్ని చానళ్ల శాశ్వత నిరోధానికి యత్నం

- సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధం
- కేబుల్ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలి
- ట్రాయ్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ ఒత్తిళ్లతో మీడియా ప్రసారాలు నిలిపివేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. పలు వార్తా ఛానళ్ల ప్రసారాలు శాశ్వతంగా నిలిపివేయాలని ఆ పార్టీ యత్నిస్తోందని పేర్కొంది. ఎలాంటి చట్టబద్ధమైన అనుమతి, విధానపరమైన సమ్మతిలేకుండా అధికార టీడీపీ ఒత్తిళ్ల కారణంగా సాక్షి, టీవీ-9, ఎన్టీవీ, 10టీవీల ప్రసారాలు శాశ్వతంగా నిలిపివేయాలని ఏపీ కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ తీర్మానం చేసినట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)కు మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్. నిరంజన్‌రెడ్డి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్, ప్రమోషన్-2019 2ఎస్‌సీసీ 104 కేసులో సుప్రీంకోర్టు ఎయిర్‌వేవ్, ఫ్రీక్వెన్సీలు పబ్లిక్ ప్రాపర్టీగా తన తీర్పులో పేర్కొందని, తద్వారా వాటిని వినియోగించుకోవడం ప్రతీ పౌరుడి హక్కు అనే విషయాన్ని ట్రాయ్ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. చట్టానికి లోబడి సహేతుకమైన ఆంక్షలు విధించొచ్చని, అయితే ఎలాంటి కారణాలు లేకుండా ఏజెన్సీలు ఛానెళ్లను ఏకపక్షంగా తొలగించడం ఉల్లంఘన కిందకి వస్తుందని ఆయన స్పష్టంచేశారు.

నోటీసు ఇవ్వకుండా సిగ్నల్ ఆపకూడదు..

ప్రతిపాదిత డిస్‌కనెక్షన్‌కు కారణాలు స్పష్టంగా పేర్కొంటూ ప్రభావిత సర్వీస్ ప్రొవైడర్‌కు కనీసం మూడు వారాల నోటీసు ఇవ్వకుండా ఏ సర్వీస్ ప్రొవైడర్ టెలివిజన్ ఛానళ్ల సిగ్నల్‌ను డిస్‌కనెక్ట్ చేయరాదని 2017 నిబంధనల్లోని 17వ నిబంధన స్పష్టంచేస్తోందని.. కానీ, ప్రస్తుతం ఏపీలో ఈ నిబంధన తుంగలో తొక్కారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. నూతనంగా ఏర్పాటవుతున్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం పలు వార్తా ఛానళ్లపై ఏకపక్ష నిర్ణయం తీసుకుందన్నారు. ప్రస్తుతం ఏపీలో కేబుల్ టీవీ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రంపై ప్రత్యక్షంగా దాడిచేసినట్లేనన్నారు. ఛానెళ్లు మ్యూట్ చేయడమంటే అసమ్మతి గళం సహించబోమనే సందేశం ప్రజల్లోకి పంపుతోందన్నారు. ఈ తరహా చర్యల వల్ల ప్రతికా స్వేచ్ఛపై పడే ప్రభావాలను ట్రాయ్ తక్షణమే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని నిరంజన్‌రెడ్డి కోరారు. ఇక ట్రాయ్ నిబంధనలు అమలుచేయడంతోపాటు ప్రభుత్వ ప్రభావం నుంచి మీడియాను రక్షించడానికి నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఏపీ కేబుల్ టీవీ ఆపరేటర్ల అసోసియేషన్ న్యూస్ ఛానళ్లను అక్రమంగా బ్లాక్ చేయడంపై సమగ్ర విచారణ జరపాలని, ట్రాయ్ 2017 నిబంధనల్లోని 17వ నిబంధన ఉల్లంఘించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పుడు సమాచారమిస్తే కఠిన చర్యలు

- జస్టిస్ చంద్రఘోష్ స్పష్టీకరణ
- కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపై కొనసాగుతున్న న్యాయ విచారణ
- రెండోరోజు 20 మందికి పైగా ఇంజనీర్లు హాజరు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై నిర్వహిస్తున్న న్యాయ విచారణలో ఎవరైనా అధికారులు తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తప్పవని జస్టిస్ పినాకి చంద్రఘోష్ స్పష్టం చేశారు. మంగళవారం రెండోరోజు ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులను విచారించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. బరాజ్‌ల నిర్మాణంతో సంబంధం ఉన్న 20 మందికి పైగా ఇంజనీర్లను మంగళవారం విచారించినట్టు తెలిపారు. విచారణకు హాజరైన అధికారులందరూ కమిషన్‌కు తెలిపిన అంశాలను అఫిడవిట్ రూపంలో 15 రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించామన్నారు. తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. విచారణకు రావడానికి ముందు కొందరు ఇంజనీర్లు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై కమిషన్ ముందు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్టుగా వచ్చిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి విషయాలు తన దృష్టికి వస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తానన్నారు.

విఫలం కాకుంటే ప్రజలకు బాగా ఉపయోగపడేవి

ఇప్పటికే తనకు సరిపడా సమాచారం లభించిందని, పూర్తి స్పష్టత ఏర్పడిన తర్వాత నివేదికను రూపొందిస్తానని జస్టిస్ చంద్రఘోష్ చెప్పారు. తనను కలవడానికి వచ్చే ప్రతి ఒక్కరి నుంచి సమాచారం తీసుకుంటానని అన్నారు. బరాజ్‌లు విఫలం కాకుంటే ప్రజలకు బాగా ఉపయోగపడేవని జస్టిస్ ఘోష్ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఎక్కడో ఏదో తప్పు జరగడంతోనే బరాజ్‌లు విఫలమయ్యాయని భావిస్తున్నట్టు తెలిపారు.

నేడు నిర్మాణ సంస్థలు, ఇంజనీర్ల విచారణ

నీటిపారుదల శాఖలోని సీడీఓ, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్, కన్‌స్ట్రక్షన్, డ్యామ్ సేఫ్టీ విభాగాల్లో గతంలో పనిచేసిన/ప్రస్తుతం పనిచేస్తున్న ఇంజనీర్లను మంగళవారం జస్టిస్ చంద్రఘోష్ విచారించారు. ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) బి.నాగేంద్రరావు, మేడిగడ్డ బరాజ్ నిర్మాణాన్ని పర్యవేక్షించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి ఇతరులను వారి పాత్రపై ప్రశ్నించారు. బుధవారం బరాజ్‌ల నిర్మాణ సంస్థలైన ఎల్ అండ్ టీ, అఫ్కాన్స్, నవయుగ కంపెనీల ప్రతినిధులను విచారించనున్నారు. నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్‌తో పాటు ఆ విభాగంలో పనిచేస్తున్న మరో 11 మంది ఇంజనీర్లను సైతం విచారణకు రావాలని ఆదేశించారు.

సేంద్రియ విధానాన్ని పాటిస్తే ఎగుమతులకు అవకాశం

'రైతునేస్తం' కార్యక్రమంలో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతులు సేంద్రియ వ్యవసాయ విధానాన్ని సక్రమంగా అనుసరించి పంటలు పండిస్తే ఎగుమతులకు అవకాశం ఏర్పడుతుందని, పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖ కార్యకలాపాలపై ప్రతీ మంగళవారం రైతులతో నేరుగా మాట్లాడే 'రైతునేస్తం'కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు 11 వారాల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సాంద్రత, పత్తిసాగు, సేంద్రియ వ్యవసాయంపై 38,794 మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో అవసరమైన మేరకు పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశామని మంత్రి వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా హాజరైన పద్మశ్రీ చింతల వెంకట్ రెడ్డి, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావులను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమం కోసం విలువైన సూచనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిశోధన సంచాలకుడు పి.రఘురామ్ రెడ్డి, పత్తి శాస్త్రవేత్త డాక్టర్ పి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల ఘర్షణ.. తెగిపడిన కరెంట్ వైర్లు
విద్యుద్ఘాతంతో బాలుడి మృతి



మానవపాడు: విద్యుత్ స్తంభాన్ని ఎద్దులు ఢీకొట్టడంతో వైర్లు తెగి పడగా.. ఆడుకుంటూ ఆ వైర్లను తాకిన ఓ బాలుడు విద్యుద్ఘాతంతో మృతి చెందిన విషాద ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ రైతు పొలం పనులను ముగించుకొని తన ఎద్దులతో తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో.. ఎదురుగా వస్తున్న మరో రైతు ఎద్దులను ఢీకొట్టాయి. ఈ క్రమంలో ఆ ఎద్దులు ఒకదానిపై ఒకటి దాడి చేసుకోగా.. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాయి. దీంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇది గమనించని అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మద్దమ్మ దంపతుల కుమారుడు వీనేష్ (8) ఇంటి ముందు ఆడుకుంటూ ఆ విద్యుత్‌వైర్లను తాకడంతో షాక్‌కు గురై ఒక్కసారిగా సిమెంట్ రోడ్డుపై ఎగిరిపడ్డాడు. స్థానికులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా.. వైద్యుల సూచనల మేరకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిల్లల కళ్ల ఎదుటే..

- చిలప్‌చెడ్‌లో పిడుగుపాటుకు గురై తల్లి మృతి
- తొగుటలో పిడుగుపడి మరో రైతు దుర్మరణం



శ్రీశైలం మృతదేహం, ఎల్లమ్మ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్), తొగుట(దుబ్బాక): పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గంగిరెద్దుల గూడెంకు చెందిన బత్తుల ఎల్లమ్మ (40) పిల్లలతో కలిసి జోగిపేటకు వెళ్లి ఇంటికి తిరిగొస్తూ చిలప్‌చెడ్‌లో బస్సు దిగింది. అడ్డదారి మీదుగా చెరువు కట్టపై నడుచుకుంటూ వెళ్తుండగా సోమక్కపేట్ శివారులో పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పిల్లలు అనురాధ, శ్యామల ఆమెకు కాస్త వెనుకాల ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. కాగా, సిద్దిపేట జిల్లా తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లిలో పొలంలో వ్యవసాయపనులు చేస్తుండగా, వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లిన రైతు కడారి శ్రీశైలం (45)పై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు.



కేన్సర్‌పై పోరాడేందుకు పూర్తిగా సహకరిస్తా

సీఎం రేవంత్‌తో డాక్టర్ రఘురామ్

సాక్షి, హైదరాబాద్: రొమ్ము కేన్సర్‌పై పోరాడేందుకు తాను సహకరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ వైద్యుడు పి.రఘురామ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సీఎంను మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా రఘురామ్ తన ప్రతిపాదనను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. బ్రెస్ట్ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, ఆ వ్యాధిపై అవగాహన కల్పించడంలో తెలంగాణలో 17 ఏళ్లుగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. రొమ్ము కేన్సర్‌ను గుర్తించడానికి హెల్త్ కేర్ వర్కర్లకు శిక్షణ ఇస్తామని చెప్పారు. రొమ్ము కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం కోసం జనాభా ఆధారిత స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేయడంలో తెలంగాణను దేశంలోనే రోల్ మోడల్‌గా మార్చడంలో కృషి చేద్దామని రఘురామ్ పిలుపునిచ్చారు. దేశంలో ప్రతి 4 నిమిషాలకు ఒక మహిళ రొమ్ము కేన్సర్‌తో బాధపడుతోందన్నారు. భారతదేశంలో ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ రొమ్ము కేన్సర్‌తో మరణిస్తున్నట్లు పేర్కొన్నారు. రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్న ప్రతి ఇద్దరు మహిళల్లో, ఒకరు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

క్లుప్తంగా...

'ఏఈఈ' అభ్యర్థులకు నియామకపత్రాలు ఇవ్వాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పుడో పూర్తయినా ప్రభుత్వం నేటికీ నియామకపత్రాలు ఇవ్వకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గాంధీ భవన్ వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఏఈఈ అభ్యర్థులకు సంఘీభావం తెలుపుతున్నట్లు మంగళవారం ఆయన 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. ఏఈఈ పోస్టుల భర్తీకి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి వివిధ దశల్లో భర్తీ ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. ఈ ఏడాది మార్చిలో ఏఈఈ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్తిచేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఎంపికైన వారికి నియామక పత్రాలు ఇవ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలని హరీశ్ డిమాండ్ చేశారు.

రేపు టీజీ లాసెట్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ లాసెట్(ఎల్ఎల్‌బీ 3, 5 సంవత్సరాలు), పీజీఎల్‌సెట్-2024 (ఎల్ఎల్ఎం) ఫలితాలు గురువారం వెలువడనున్నాయి. మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 నిమిషాలకు చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఓయూ ఇన్‌చార్జ్ వీసీ దాన కిశోర్, లాసెట్ కన్వీనర్ ప్రొ.విజయలక్ష్మి ఇతర అధికారులు ఫలితాలను విడుదల చేయనున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలను httpr://lawcet.trche.ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చని సూచించారు.

హెచ్‌సీయూలో ఇంటిగ్రేటెడ్ బీటెక్, ఎంటెక్ కోర్సులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో మెటీరియల్స్ ఇంజనీరింగ్‌లో ఇంటిగ్రేటెడ్ బీటెక్, ఎంటెక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ కోర్సుల్లో 60 సీట్లతో మెటీరియల్ ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ (బీటెక్, ఎంటెక్) కోర్సులను అందిస్తున్నారు. ఈ కోర్సుల్లో జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జేఓఎస్ఏఏ) ద్వారా ప్రవేశం పొందడానికి అవకాశం కల్పిస్తారు. పాఠ్య ప్రణాళిక నాలుగేళ్ల బీటెక్ డిగ్రీతోపాటు ఏఐ/ఎంఎల్, కంప్యూటేషనల్ మెటీరియల్స్ ఇంజనీరింగ్‌తో సహా అనేక చిన్న స్ట్రీమ్‌ల కోసం ఎంపికలను అందిస్తుంది. ఈ కోర్సుల్లో అడ్మిషన్లు జేఏఎస్ఏఏ పోర్టల్ ద్వారా ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23134450లో సంప్రదించాలని సూచించారు.

ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌కు 167 మంది శ్రీచైతన్య విద్యార్థులు

మాదాపూర్: అంతర్జాతీయ స్థాయిలో నాసా ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ నిర్వహించిన ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌కు సుమారు 30 దేశాలకు చెందిన విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 167 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులే ఉన్నారని శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం నాసా, ఎన్ఎస్ఎస్, ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ నిర్వహించిన స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో ఒక్క భారత్ నుంచే 28 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో అంతర్జాతీయ స్థాయిలో 639 మంది శ్రీచైతన్య విద్యార్థులు, 62 విన్నింగ్ ప్రాజెక్టులు గెలుచుకున్నారని.. తద్వారా వరుసగా 11వ సారి వరల్డ్ నెంబర్ వన్‌గా, వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచామని పేర్కొన్నారు. ఆర్టిస్టిక్ మెరిట్ కేటగిరిలో 500 డాలర్ల బహుమతి అందుకున్న ప్రపంచంలోని ఏకైక విద్యార్థి శ్రీచైతన్య విద్యార్థేనని ఆమె తెలిపారు.

ఎడ్‌సెట్‌లో అబ్బాయిలదే హవా

- టాప్ టెన్‌లో 8 మంది అబ్బాయిలు
- పరీక్ష రాసిన వారిలో అమ్మాయిలే ఎక్కువ
- ఫలితాలు విడుదల చేసిన నవీన్ మిత్తల్
- రాష్ట్రంలో 20 వేల సీట్లు



ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల చేస్తున్న నవీన్ మిత్తల్, లింబాద్రి, తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో ప్రవేశానికి మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీ ఎడ్‌సెట్-2024) ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ పరీక్ష రాసిన వారిలో ఎక్కువ మంది అమ్మాయిలే ఉన్నారు. అయితే, తొలి పది ర్యాంకుల్లో అబ్బాయిలకే ఎనిమిది దక్కాయి. ఎడ్‌సెట్ ఫలితాలను మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నవీన్ మిత్తల్ హైదరాబాద్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మన్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎడ్‌సెట్ కన్వీనర్ మృణాళిని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత నెల 23వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షకు 33,879 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 29,463 మంది పరీక్ష రాశారు. తాజాగా వెల్లడించిన ఫలితాల్లో 28,549 (96.90%) అర్హత సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 99.04 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ నుంచి 44 మంది పరీక్ష రాస్తే అందరూ పాసయ్యారు.

టీచర్ పోస్టులకు డిమాండ్

ప్రభుత్వ స్కూళ్లలో టీచర్ పోస్టుల భర్తీ చేపడుతున్న కారణంగా ఉపాధ్యాయులకు భవిష్యత్‌లో మంచి డిమాండ్ ఉంటుందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి తెలిపారు. బీఈడీ కోర్సులకు ఈ మధ్య కాలంలో ఆదరణ తగ్గిందని, ఎక్కువ మంది ఈ కోర్సులో చేరడం లేదన్నారు. 24,633 మంది అమ్మాయిలు సెట్ రాస్తే.. 23,780 మంది అర్హత పొందినట్టు, 4,830 మంది అబ్బాయిలు పరీక్ష రాస్తే 4,769 మంది పాసయినట్టు వివరించారు. ఎడ్‌సెట్‌లో నిర్వహణలో అనేక జాగ్రత్తలు తీసుకున్నామని, 19 రోజుల్లోనే ఫలితాలు అందించామని వీసీ నవీన్‌మిత్తల్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 208 బీఈడీ కాలేజీలుంటే, వాటిల్లో 20 వేల సీట్లున్నాయని ఎడ్‌సెట్ కన్వీనర్ మృణాళిని వెల్లడించారు. గత ఏడాది 75 శాతం సీట్లు భర్తీ అయ్యాయని చెప్పారు.

ఎడ్‌సెట్ పరీక్ష రాసిన వారు... అర్హత పొందిన వారు

	పురుషులు	మహిళలు	మొత్తం
దరఖాస్తులు	5,732 (16.91%)	28,147 (83.08%)	33,879 (100%)
పరీక్ష రాసినవారు	4,830 (16.39%)	24,633 (83.60%)	29,463 (97%)
ఉత్తీర్ణులు	4,769 (98.74 %)	23,780 (96.54%)	28,549 (96.90%)

టాప్ టెన్ ర్యాంకులు

పేరు	ప్రాంతం
ఎం. నవీన్‌కుమార్	నాగర్‌కర్నూల్
అశితా నారాయణ్	హైదరాబాద్
సి. శ్రీతేజ	హైదరాబాద్
దూపల్లి సాయి ప్రీతమ్	మల్కాజ్‌గిరి
కె. రాజేందర్ రెడ్డి	మల్కాజ్‌గిరి
కె. మహేశ్వరి	మహబూబ్‌నగర్
ఎండీ ఉమర్ అహ్మద్	హైదరాబాద్
కల్లెం కిశోర్	సంగారెడ్డి
జి ధృవ సంహిత్	విశాఖపట్టణం (ఏపీ)
రామ్‌దేని శ్రీరామ్	మంచిర్యాల

ఆర్డీఓ కావాలని లక్ష్యం: స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ నవీన్ కుమార్



బిజినేపల్లి: ఎడ్‌సెట్ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన మల్లిశెట్టి నవీన్‌కుమార్ 118.37 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. వ్యవసాయ నేపథ్యం గల నవీన్ బీటెక్ పూర్తి చేసి కొన్ని నెలలుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఆర్డీఓ ఉద్యోగం లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నానని, గ్రూప్-1 నోటిఫికేషన్ ఆలస్యంగా విడుదల చేస్తుండటంతో కనీసం ఉపాధ్యాయ ఉద్యోగమైనా సాధించాలని ఎడ్‌సెట్ పరీక్ష రాశానని నవీన్ చెప్పాడు.

సింగరేణి కారుణ్య నియామకాల వయో పరిమితి పెంపు

ఉత్తర్వులు జారీచేసిన సింగరేణి సీఎండీ బలరామ్



గోదావరిఖని: సింగరేణిలోని డిపెండెంట్ల ఆరేళ్ల నిరీక్షణకు తెరపడింది. కారుణ్య నియామకాల్లో వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ మంగళవారం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. దీనిద్వారా సుమారు 300 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. సింగరేణిలో ప్రస్తుతం కారుణ్య నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే, అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి ఇప్పటివరకు 35ఏళ్లే. కరోనా, విజిలెన్స్ విచారణ, మెడికల్ బోర్డులో పొరపాట్లు తదితర కారణాలతో చాలా మంది వారసుల వయసు 35ఏళ్లకు మించిపోయింది. ఇలాంటివారు నిరుద్యోగులుగా కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు అయితే, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇటీవల ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకాల్లో గరిష్ఠ వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కోవిడ్ సమయంలో రెండేళ్లపాటు మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. సింగరేణిలో పనిచేస్తూ మృతి చెందితే వారసుల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చే కారుణ్య నియామక ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. అనారోగ్యంతో ఉద్యోగానికి అనర్హుడని మెడికల్ బోర్డు నిర్ధారించినా వారసుడికి ఉద్యోగావకాశం కలిస్తోంది. వయో పరిమితి పెంపుపై ఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య హర్షం వ్యక్తం చేశారు.

సెటిల్‌మెంట్ లేనివారికే..

కారుణ్య నియామకాల్లో కార్మిక వారసుల గరిష్ఠ వయో పరిమితి 40ఏళ్లకు పెంచాం. ఇది 2018 మార్చి 9వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. ఇందుకోసం ఆయా ఏరియాల్లో దరఖాస్తు చేయాలి. అయితే, గరిష్ఠ వయో పరిమితితో ఉద్యోగం పొందలేని, వన్‌టైం సెటిల్‌మెంట్ జరగని వారికే కొత్త స్కీం వర్తిస్తుంది.

– బలరామ్, సింగరేణి సీఎండీ

పాత పద్ధతిలోనే రైతుభరోసా!

▶ మొదటి పేజీ తరువాయి

చొప్పున రైతులకు అందేవి. ఆ తర్వాత సీజన్‌కు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ. 10 వేలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీజన్‌కు ఎకరానికి రూ.7,500కు పెంచి ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారం రెండు సీజన్లకు కలిపి రూ. 15 వేలు ఇవ్వాలి. అయితే అధికారంలోకి వచ్చాక తొలిసారిగా యాసంగి సీజన్‌లో మాత్రం పెరిగిన సొమ్మును కాకుండా పాత పద్ధతిలోనే ఎకరాకు రూ.5 వేలే ఇచ్చింది. వానాకాలం సీజన్ నుంచి ఎకరాకు రూ.7,500 ఇస్తామని పేర్కొంది. వానాకాలం సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. రైతుభరోసా మార్గదర్శకాలు ఇంకా ఖరారు కాలేదు. పైగా ఈ మార్గదర్శకాలను అసెంబ్లీలో చర్చించి ఖరారు చేస్తామని గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటికిప్పుడు అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అయితే ఈ వానాకాలం సీజన్‌లో రైతులకు నిర్ణీత సమయంలోగా రైతుభరోసా సొమ్మును ఇవ్వాలని భావిస్తున్న ప్రభుత్వం.. పాత పద్ధతిలో సొమ్ము అందజేయనుంది. అంటే ఎకరాకు తొలుత రూ.5 వేలు ఇస్తారు. ఆ తర్వాత రైతుభరోసా మార్గదర్శకాలు ఖరారు చేసి వచ్చే నెల మరో రూ.2,500 ఎకరాకు ఇవ్వాలనేది సర్కారు ఆలోచనగా ఉన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి.

మార్గదర్శకాలపై కసరత్తు

రైతుభరోసా మార్గదర్శకాలపై వ్యవసాయ శాఖ కసరత్తు ప్రారంభించింది. సీలింగ్ ప్రకారం ఇవ్వాలా? ఎలా చేయాలన్న దానిపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. పంట వేసినట్లు నిర్ధారణ అయిన భూముల రైతులకే ఆర్థిక సాయం అందించాలని కూడా భావిస్తున్నారు. అంతేకాదు దీనిని గరిష్ఠంగా ఐదెకరాలకే పరిమితం చేసే అంశమూ చర్చకు వస్తోంది. గత యాసంగి సీజన్‌లో 1.52 కోట్ల ఎకరాలకు చెందిన 68.97 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్లు అందజేశారు. అందులో ఐదెకరాలోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.32 లక్షల మంది కాగా, వారి చేతిలో కోటి ఎకరాల భూమి ఉంది. అంటే మొత్తం రైతుభరోసా అందుకుంటున్న రైతుల్లో ఐదెకరాలోపు రైతులే 90.36 శాతం ఉండటం గమనార్హం. దీంతో ఐదెకరాలకు పరిమితం చేసినా 90 శాతం మందికి రైతుభరోసా ఇచ్చినట్లు అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఐదెకరాలకు పైగా భూమి ఉన్న రైతులు 6.65 లక్షల మంది ఉన్నారు.

ప్రతి కేసులోనూ సీఎంను చేరుస్తారా?

పిటిషనర్లను ప్రశ్నించిన హైకోర్టు.. పిటిషన్ డిస్మిస్

సాక్షి, హైదరాబాద్: ప్రతి కేసులోనూ ముఖ్యమంత్రిని ప్రతివాదిగా పేర్కొనడం సరికాదని, చీఫ్ వార్డెన్, వైస్ చాన్స్‌లర్‌ను ఎందుకు చేర్చలేదని 'ఓయూ సెలవుల'వివాదంపై పిటిషన్ దాఖలు చేసిన వారిని హైకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి పిటిషన్లను సమర్థించలేమంటూ డిస్మిస్ చేసింది. 'ఉస్మానియా యూనివర్సిటీలో నీటి కొరత, విద్యుత్ కోతపై ఏప్రిల్ 27న ఆందోళన కార్యక్రమం నిర్వహించాం. ఈ సందర్భంగా చీఫ్ వార్డెన్ ఓ సర్క్యులర్ విడుదల చేశారు. మే 1 నుంచి 31 వరకు వేసవి సెలవులను ప్రకటించామని, అందుకే వర్సిటీలో విద్యుత్, నీటి కొరత ఏర్పడిందని, విద్యార్థులు సహకరించాలన్నది దాని సారాంశం. అయితే రాష్ట్రంలో ఎక్కడా నీటికి, విద్యుత్‌కు కొరత లేదని, ఆ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని రిజిస్ట్రార్‌ను సీఎం ఆదేశించారు. దీంతో ఆయన నోటీసు జారీ చేశారు. ఈ విషయంపై రేవంత్ రెడ్డి ఎక్స్‌లో స్పందిస్తూ.. గత సంవత్సరం 2023లోనూ ఇలాగే విద్యుత్, నీటి కొరత ఉందంటూ మే 14 నుంచి జూన్ 5 వరకు సెలవులు ఇస్తూ వార్డెన్ సర్క్యులర్ జారీ చేశారని చెబుతూ దాని కాపీని పోస్టు చేశారు. మే 14 నుంచి జూన్ 5 వరకు వేసవి సెలవులు ప్రకటిస్తున్నామని, మెస్‌లు అందుబాటులో ఉండవని మాత్రమే 2023లో జారీచేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అందులో ఎక్కడా విద్యుత్, నీటి కొరత అనే పదాలు లేవు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి తన అధికారిక ఎక్స్ ఖాతాలో రేవంత్ పెట్టిన సర్క్యులర్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉంది. రేవంత్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలి'అని పేర్కొంటూ వర్సిటీ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రతివాదులుగా పలువురితో పాటు సీఎంను చేర్చారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) తేరా రజనీకాంత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సీఎం వాస్తవ సర్క్యులర్‌నే పోస్టు చేశారని, దాన్ని లింక్ చేస్తూ మరో పార్టీ వ్యక్తి తప్పుడు సర్క్యులర్ పోస్టు చేశారన్నారు. దీనిపై చీఫ్ వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ప్రతీ చిన్న విషయానికి ముఖ్యమంత్రిని ప్రతివాదిగా పేర్కొంటూ పిటిషన్లు వేయడాన్ని ప్రోత్సహించకూడదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

నేటి నుంచి మళ్లీ బడి

- 2024-25 విద్యా సంవత్సరం మొదలు
- ఇంకా కొన్ని స్కూళ్లకు అందని పాఠ్యపుస్తకాలు, దుస్తులు
- రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 60 లక్షల మంది విద్యార్థులు
- ఈ నెలాఖరు వరకూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు తిరిగి తెరుచుకుంటాయి. 2024-25 విద్యా సంవత్సరం మొదలవుతోంది. ఈ నేపథ్యంలో అన్ని చోట్ల టీచర్లు, విద్యార్థుల్లో హడావుడి కన్పిస్తోంది. సర్కారీ స్కూళ్లలో ఈసారి ఎక్కువ మందిని చేర్పించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. స్కూళ్ళల్లో వసతులపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. మార్కెట్లో దుస్తులు, పుస్తకాల బేరసారాలు జోరుగా సాగుతున్నాయి. ప్రైవేటు స్కూళ్ల బస్సులు, ఆటోలు ఈ ఏడాది ఫీజులు పెంచాయి. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో చదువుతున్నారు. వీరిలో 28 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్నారు. రాష్ట్రంలో 30 వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలు, 11500 వరకూ ప్రైవేటువి ఉన్నాయి.

ప్రవేశాలు పెరిగేనా?

ఈ సంవత్సరం ప్రభుత్వ స్కూళ్లల్లో ఎక్కువ మందిని చేర్పించేందుకు బడిబాట కార్యక్రమాన్ని అమ్మ ఆదర్శ కమిటీల నేతృత్వంలో వినూత్నంగా చేపడుతున్నారు. వాస్తవానికి గత కొన్నేళ్ళుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరడం క్రమంగా తగ్గుతోంది. 1-5 క్లాసుల వరకూ చేరికలు కొంత ఆశాజనకంగా ఉన్నా, ఆ తర్వాత క్లాసుల్లో ఎన్‌రోల్‌మెంట్ పడిపోతోంది. 5వ తరగతి తర్వాత విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ళల్లో చేరుతున్నారు. ఈ పరిణామాలపై ప్రతీ ఏటా అధికారులు నివేదికలు ఇస్తూనే ఉన్నారు. సరిదిద్దేందుకు ఎలాంటి కార్యాచరణ చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధ్యయనం ప్రకారం 44 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 50 మంది విద్యార్థులు కూడా ఉండటం లేదని తేలింది. 1-5 తరగతుల వరకూ క్లాసుకు 40-60 మంది విద్యార్థులు ఉంటున్నారు. 5వ తరగతి నుంచి విద్యార్థుల చేరికలు క్లాసుకు 46 నుంచి 35కు పడిపోయింది. ప్రభుత్వ స్కూళ్ళు సక్రమంగా నడవకపోవడం, ఉపాధ్యాయుల కొరత వేధించడం, సకాలంలో పుస్తకాలు రాకపోవడం, వచ్చినా పంపిణీ జరగకపోవడం, ఈ కారణంగా బోధన కుంటుపడటం ప్రధాన కారణాలుగా విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. 1-5 తరగతులకు దిగువ మధ్య తరగతి కుటుంబాలు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ మంచి విద్యను అందించాలనే అభిప్రాయంతో ఉంటున్నాయి. దీనికోసం తల్లిదండ్రులు పట్టణాలకు వెళ్తున్నారు.

బదిలీలు, పదోన్నతులపై కసరత్తు

సాంకేతికంగా ప్రభుత్వ స్కూళ్లు ఈ నెల 12 నుంచి తెరుచుకుంటున్నా... బోధనకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఈ నెలాఖరు వరకూ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడతారు. ఉపాధ్యాయులంతా ఈ హడావిడిలో ఉండే వీలుంది. ఇప్పటికీ అన్ని స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందలేదు. వీలైనంత త్వరగా అందించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

భారత్ నంబర్‌వన్ ఆర్థికశక్తిగా ఎదగాలి

ఈ లక్ష్యసాధనలో యువతదే కీలకపాత్ర

టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలి

ములుగు హార్టికల్చర్ వర్సిటీ మూడో స్నాతకోత్సవంలో గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్



స్నాతకోత్సవంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

గజ్వేల్: భారత్ 2047నాటికి ప్రపంచంలోనే నంబర్‌వన్ ఆర్థికశక్తిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని, ఈ లక్ష్యసాధనలో యువత కీలక పాత్ర పోషించాలని గవర్నర్ సీపీ.రాధాకృష్ణన్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ నేడు ప్రపంచమంతా భారత్ ఎదుగుదలను ఆసక్తిగా గమనిస్తున్నదని చెప్పారు. ప్రపంచంలో అయిదో ఆర్థికశక్తిగా ఉన్న మన దేశం ముందుగా మూడోస్థానం, ఆ తర్వాత మొదటి స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. దేశంలో 47 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. ఉద్యాన, అటవీరంగాలకు ప్రాధాన్యం పెరుగుతూ వస్తున్నదని తెలిపారు. విద్యార్థులు ఈ వయసులో శ్రమించేతత్వాన్ని వీడొద్దని సూచించారు. తనకే కష్టాలున్నాయని, ఇతరులు ప్రశాంతంగా ఉన్నారనే భావన నుంచి విద్యార్థులు బయటపడాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలోనూ కష్టాలు ఉంటాయని, వాటిని చిరునవ్వుతో స్వీకరించి ముందుకు సాగితేనే లక్ష్యసాధన సులువు అవుతుందని వెల్లడించారు. తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ గీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి కోసం ఎదురు చూడకుండా, ఉపాధి కల్పించే వ్యక్తులుగా రాణించాలని ఆకాంక్షించారు. బిగ్ డేటా, డ్రోన్, రోబోట్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలన్నారు. దీని ద్వారా పంటల ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నీరజాప్రభాకర్ వర్సిటీ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. స్నాతకోత్సవంలో 156 మందికి హార్టికల్చర్ డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45మందికి హార్టికల్చర్ పీజీ, 30మందికి ఫారెస్ట్ పీజీ, మరో ఆరుగురికి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. వివిధ కోర్సుల్లో అత్యధిక జీపీఏ సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ భగవాన్, డీన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, హార్టికల్చర్ కమిషనర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా గవర్నర్ రాధాకృష్ణన్ తన ప్రసంగం చివరలో 'జై తెలంగాణ, జై జార్ఖండ్, జై పాండిచ్చేరి'అంటూ నినాదాలు చేయడం అందరినీ ఆకట్టుకున్నది.

బడి బస్సులు 'భద్రత' పాటించాలి

డ్రైవర్లు, విద్యాసంస్థల అధినేతలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: విద్యాసంస్థల వాహనాలు కచ్చితంగా రోడ్డు భద్రత నిబంధనలు అనుసరించేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ మేరకు డ్రైవర్లు, విద్యాసంస్థల అధినేతలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థల వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్‌తో ఉండాల్సిందేనని, ఈమేరకు అన్నింటిని తనిఖీ చేయాలని ఆదేశించారు. మంగళవారం ఆయన రవాణాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కలెక్టర్ స్థాయి అధికారులతో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించేలా చూడాలని, విద్యాసంస్థల్లో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన చాలా అవసరమని చెప్పారు. కార్‌డోర్ అద్దాలకు నల్ల స్టిక్కరింగ్ విషయంతో తనిఖీలు అవసరమన్నారు. సీజ్ అయిన వాహనాలను భద్రపరిచే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, రవాణాశాఖ కార్యాలయాల్లో అందే సేవలు అవినీతి రహితంగా ఉండాలని పేర్కొన్నారు. త్రైమాసిక ఆదాయం తక్కువగా నమోదైన జిల్లాలకు సంబంధించి అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, వారికి నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న రవాణాశాఖ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూరుస్తామని, అందుకు వీలుగా స్థలాలను ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో రవాణాశాఖ కార్యదర్శి విజేంద్ర బోయీ, రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, జేటీసీలు తదితరులు పాల్గొన్నారు.

హామీలు, గ్యారంటీలు అమలు చేయాలి

- రుణమాఫీకి డేట్ ఇచ్చినట్టే మిగతా హామీలకు డేట్స్ ఇవ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలు, గ్యారంటీలను వెంటనే అమలు చేసేందుకు సీఎం చర్యలు చేపట్టాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగలేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...'మీరిచ్చిన 420 హామీల్లో మహిళలకు ఉచితబస్సు ప్రయాణం లాంటి కొన్నింటిపై మాత్రమే మీ సర్కారు దృష్టి సారించింది. ఇంకా లెక్కకుమిక్కిలి హామీల అమలుపై మీ ప్రభుత్వంలో కదలికే లేదు. వాగ్దానాల అమలును వెంటనే ప్రారంభించాలి. లేదంటే ఏఏ హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా చెప్పాలి. ప్రస్తుతం లోకసభ ఎన్నికల కోడ్ కూడా ముగిసింది. 64 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లు గెలిస్తే, ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్న బీజేపీ కూడా 8 లోక్‌సభ సీట్లు గెలుచుకుంది. అంటే ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించినట్టే కదా. లోకసభ ఎన్నికలు మీ ప్రభుత్వ వందరోజుల పాలనకు రెఫరెండం అని మీరే ప్రకటించారు. అంటే ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మోసం చేస్తున్న మీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించినట్టే కదా. '14సీట్లు గెలుస్తామని కేవలం 8 సీట్లే గెలిచినందుకు రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలి. డిక్లరేషన్లతో ప్రజలను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి. ఈ నెల 18న గవర్నర్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరాను. పౌర సరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాను. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి పౌర సరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతా'అని మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.

లేఖలోని ముఖ్యాంశాల్లో కొన్ని...

- కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో చాప్టర్-2, ఆరు గ్యారంటీల కార్డులో మొదటిది మహాలక్ష్మి స్కీమ్.. మహిళలకు ప్రతినెలా రూ.2,500. రెండోది.. రైతు భరోసా ప్రతి ఏటా అని హామీ ఇచ్చారు. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్నారు. వీటిని ఎప్పటి నుంచి అమలు చేస్తారు.
- ఆరు గ్యారంటీల కార్డులో ఐదో అంశంగా యువవికాసం పేరుతో విద్యార్థులకు రూ.ఐదు లక్షల విద్యా భరోసాకార్డు. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూలు, ఆరో అంశంగా చేయూత పథకం.. పింఛన్‌దారులకు నెలకు రూ.4,000 అన్నారు. హామీ ఏమైంది?
- నిరుద్యోగ యవతకు 2024 ఫిబ్రవరి ఒకటో తేదీన గ్రూపు-1, 2024 ఏప్రిల్ ఒకటిన గ్రూపు-2 నియామకాలన్నారు అవి ఏమయ్యాయి? నిరుద్యోగ భృతి రూ.4,000 ఇస్తామన్నారు. దానికి సంబంధించిన కసరత్తేది?

పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాం

- స్టిచింగ్ పూర్తయ్యేలా మంత్రి సీతక్క చొరవ
- విజయవంతమైన ప్రభుత్వ ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించే మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాం అందజేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా స్టిచింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టినట్టు పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాలకు స్టిచింగ్ పనులను సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించిన నాటి నుంచి అధికారులు, మహిళా సంఘాలను సమన్వయపరుస్తూ గడువులోగా పాఠశాలలకు యూనిఫాంలు చేరేలా చూశామన్నారు. దీంతో పాఠశాలలు తెరిచే మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాం అందజేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చినట్లు తెలియజేశారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి దేశంలో తొలిసారిగా యూనిఫాం స్టిచింగ్ పనులను మహిళా సంఘాలకు అప్పగించినందుకు సంఘాల తరుపున మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసేలా వ్యవహరించిన వారిని మంత్రి అభినందించారు. 'పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు యూనిఫాంలు అయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరై విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తారు. గతంలో స్టిచింగ్ పనులను పరిమిత సంఖ్యలో టైలర్లకు అప్పగించడం వల్ల, యూనిఫాంలు ఆలస్యమయ్యేవి. ఈ సమస్యను గుర్తించిన తమ ప్రభుత్వం తొలిసారిగా మహిళా సంఘాలకు స్టిచింగ్ పనులను అప్పగించింది. దీంతోపాటు రూ.50 ఉన్న కుట్టు కూలీని రూ.75 పెంచింది. దీంతో మహిళా సంఘాలు ఈ పనులను సవాలుగా తీసుకుని, సకాలంలో పూర్తి చేయగలిగాయి'అని సీతక్క తెలిపారు.

సాక్షి కరీంనగర్

బుధవారం । 12 । జూన్ । 2024



క్వింటాల్ పత్తి రూ. 7,350

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో మంగళ వారం క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.7,350 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగూలోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.



నృసింహుని సన్నిధిలో రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు భారీగా తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
36.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

8 టీఎంసీలకు చేరగానే రోజూ నీటి సరఫరా



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు, కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: ఎల్‌ఎండీలో 8 టీఎంసీల నీరు చేరగానే నగరంలో రోజూ తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవారం మానేరుడ్యాం సమీపంలోని నగరపాలకసంస్థ ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించారు. ఫిల్టర్‌బెడ్‌లో 34 ఎంఎల్‌డీ, 14 ఎంఎల్‌డీ, మిషన్ భగీరథ 36 ఎంఎల్‌డీల నీటి శుద్ధీకరణ, వాటర్ సంప్‌లు, పంపింగ్ మోటార్లు, ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో ఎల్‌ఎండీ నీటిమట్టం 5 టీఎంసీలకు పడిపోవడంతో ప్రస్తుతం రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నామని వివరించారు. నగరప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్నామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. రెండేళ్లలో దశలవారీగా నగర ప్రజలకు 24/7 తాగునీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్‌లో పైలెట్ ప్రాజెక్టు పనులు పూర్తవుతున్నాయని వివరించారు. అలాగే రూ.147 కోట్లతో శివారు, విలీన ప్రాంతాలకు నీటి సరఫరా చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, డీఈ లచ్చిరెడ్డి, ఫిల్టర్‌బెడ్ ఇన్‌చార్జి అజయ్, ఏఈ గట్టు స్వామి, ఆర్‌పీ అధికారి సందీప్ పాల్గొన్నారు.

'కమీషన్లు ఇవ్వనందుకే మంత్రిపై ఆరోపణలు'

కరీంనగర్ కార్పొరేషన్: లారీ యజమానులు కమీషన్లు ఇవ్వనందుకే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బూడిద రవాణాపై ఆరోపణలు చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటనలో విమర్శించారు. ఎన్టీపీసీ నుంచి తరలిస్తున్న బూడిద ఓవర్‌లోడ్ అంశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు రుచిమరిగిన కౌశిక్‌రెడ్డి, లారీ యజమానుల నుంచి కోట్ల రూపాయల కమీషన్లు ఆశించారని ఆరోపించారు. అవి ఇవ్వనందుకే పొన్నంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న ఎన్టీపీసీ బూడిద తరలింపులో వేబిల్లు ఉండదని, లారీల ఓవర్‌లోడ్‌పై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. శవరాజకీయాలతో గెలిచి, పొన్నంపై ఆరోపణలతో కేసీఆర్ మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. పొన్నంపై చేసిన ఆరోపణలు నిరూపించాలని, లేకుంటే కోర్టుకు ఈడుస్తామని హెచ్చరించారు.

బడికి పోదాం పద

• ముగిసిన వేసవి సెలవులు • నేడు పాఠశాలల పునఃప్రారంభం • పిల్లలూ.. బడికి సిద్ధం కండి • తల్లిదండ్రులపై గురుతర బాధ్యత

కరీంనగర్: మనలోని విజ్ఞానం విద్యతో వికసిస్తుంది. ఇది మానసిక పరిపక్వతకు అంతర్లీనంగా దారిచూపుతుంది. బహుశా ఈ కారణం వల్లేనేమో ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యారంగానికి ఉన్న ప్రాధాన్యం మరోదానికి లేదు. జీవితంలో కుటుంబ పరంగా లేదా సమాజ పరంగా ఎన్ని ఇబ్బందులున్నా.. ఎన్ని రకాల ఆటుపోట్లు ఎదురవుతున్నా తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిత కాంక్షిస్తున్నారు. పేదరికాన్ని సైతం ఎదురొడ్డి చదువులకే పెద్దపీట వేస్తున్నారు. ఇదొక శుభ పరిణామం. వేసవి సెలవులు ముగిశాయి. బుధవారం బడి గంట మోగనుంది. పిల్లల్ని బడిబాట పట్టించేందుకు తల్లిదండ్రులు ఇప్పటికే మానసికంగా సంసిద్ధులయ్యారు. విద్యార్థులకు అవసరమైనవన్నీ ఉన్నాయా? లేదా?, వారిని బడికి సిద్ధం చేయడంలో తల్లిదండ్రులపై ఉన్న గురుతర బాధ్యతపై కథనం.



యూనిఫాం సరిచేసుకోండి



ఒకప్పుడు యూనిఫాం అంటే ప్రైవేట్ పాఠశాలలకే అన్న భావన ఉండేది. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ పిల్లలు యూనిఫాం ధరిస్తున్నారు. గుండీలు లేకపోతే బజారు నుంచి తెప్పించి, మీరే కుట్టుకోండి. వీలు కాదనుకుంటే సమీప దర్జీ వద్దకు వెళ్లండి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిర్బంధం ఉంటుంది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని, ముందస్తుగా తల్లిదండ్రులు వీటిని సిద్ధం చేస్తే మేలు.

పిల్లలకు సామగ్రి, ఫీజులు



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం ఇతర వస్తువులు సమకూర్చాలి. కొందరు ఉన్నవాటితోనే సర్దుకుంటారు. మరికొంత మంది కొత్తవి కావాలంటారు. మ రోవైపు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు అడిగినంత ఫీజు ఇవ్వడానికి అప్పు తప్పేలా లేవు. అయితే, తల్లిదండ్రులు ముందుచూపుతో వేసిన చిట్టీలను ఇప్పుడు వాడుకుంటున్నారు. ఇంకొందరు స్నేహితులు, బంధువుల వద్ద అప్పు తీసుకుంటున్నారు.

బ్యాగుల దుమ్ము దులపండి



విద్యార్థులు వేసవి సెలవుల సంబరాల్లో నిమగ్నమయ్యారు. పుస్తకాలు, బ్యాగులను మూలన పడేశారు. సెలవుల్లో వాటిని చాలామంది తెరవలేదు. బంధుమిత్రుల ఇళ్లు, విహార యాత్రలు, శుభకార్యాలకు వెళ్లడం ద్వారా సెలవులను ఆస్వాదించారు. పిల్లలూ, తల్లిదండ్రులూ.. ఇక బ్యాగులను బయటకు తీసి, వాటి దుమ్ము దులపండి. పనికి రాని పుస్తకాలను పక్కన పెట్టండి. కొత్తవి తెచ్చి ఉంటే వాటిల్లో సర్దండి.

షూస్, సాక్స్‌లు బయటకు తీయండి

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో షూస్, సాక్స్‌లు ధరించే విధానం ఉండేది కాదు. ఇప్పుడు చాలాచోట్ల ఉంది. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో షూస్, సాక్స్ స్థితిని బట్టి కొత్తవి కొనుక్కోవాలా లేక పాత వాటితోనే సర్దుకోవచ్చా అనే విషయం తెలుస్తుంది. కొత్త పుస్తకాల కోసం ఎదురు చూడకుండా అందుబాటులో ఉన్న పాత పుస్తకాలతోనే చదువులు కొనసాగించండి.

పాఠశాలల నిబంధనలు తెలుసుకోండి

పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు, రబ్బర్లు.. చూడటానికి ఇవి చిన్నవే అన్నట్లు కనిపిస్తాయి. ఇందులో ఏ ఒక్కటి లేకున్నా తరగతి గదిలో పిల్లలు ఇబ్బంది పడక తప్పదు. వీటిని తప్పకుండా బ్యాగులో ఉంచాలి. ఉన్నత తరగతికి వెళ్తున్నారు కదా అని సరిపెట్టుకోకుండా పాత పుస్తకాల్లోని అంశాలను పిల్లల చేత ఒకసారి పునశ్చరణ చేయించండి. బడి తెరిచిన రోజునే కొత్త పుస్తకాలు లభ్యమవుతాయో లేదో తెలియదు. పూర్వ తరగతికి సంబంధించిన పుస్తకాలు మన దగ్గరే ఉంటాయి. ఒకసారి దగ్గరుండి చదవించండి.

మేనమామతో రిక్షాలో వెళ్లిన



వేసవి సెలవుల తర్వాత బడి స్టార్ట్ అవుతుందంటే అస్సలు పోవాలని ఉండేది కాదు. అప్పుడు మేము కరీంనగర్ మంకమ్మతోటలోని ఫైర్ స్టేషన్ దగ్గర ఉండేవాళ్లం. మేనమామతో కలిసి రిక్షాలో వాణినికేతన్ స్కూల్‌కు వెళ్లిన. మా అమ్మ నాకు చారాణా, అఠాణా ఇచ్చేది. పాపుడాలను కొని చేతి వేళ్లకు పెట్టుకొని ఎంజాయ్ చేసేవాళ్లం.నాడు చదువుకున్న చదువే నేడు నన్ను ఇంతటి స్థాయికి తీసుకొచ్చింది. నాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు.

– యాదగిరి సునీల్‌రావు, మేయర్ కరీంనగర్

ఎదురుచూసేవాళ్లం..



ఫస్ట్ డే స్కూల్ అంటే సంబురంగా వెళ్లేవాళ్లం. వేసవి సెలవుల్లో సుమారు 45 రోజులు ఇంటి వద్ద ఉండడంతో ఫ్రెండ్స్‌ను మిస్ అయ్యేది. వారిని ఎప్పుడెప్పుడు కలుస్తామా అంటు ఆ ఫస్ట్ డే కోసం ఎదురుచూసేది. మాది నిజామాబాద్‌లోని కోటగల్లి మైసమ్మవీధి. ఎల్‌కేజీ, యూకేజీ ప్రైవేటు స్కూల్, ఫస్ట్ టూ టెన్త్ గవర్నమెంట్ స్కూల్. నాన్నతో కలిసి స్కూల్‌కు వెళ్లిన. స్కూల్ లైఫ్ చాలా బాగుంటుంది. అప్పుడే మన ఫ్యూచర్ డిసైడ్ అవుతుంది. విద్యార్థులందరూ బాగా చదవాలి.

– చల్ల స్వరూపారాణి, డిప్యూటీ మేయర్, కరీంనగర్

ప్రభుత్వ బడిలోనే చదివా..



నాన్న అబ్దుల్ ఘని. ఉమ్మడి కరీంనగర్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేశారు. ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, నా కొడుకుని ప్రైవేట్ బడికి పంపడమేంటని నన్ను కరీంనగర్‌లోని ప్రభుత్వ స్కూల్‌లో చదివించారు. ఇంటర్, డిగ్రీ కరీంనగర్ ఆర్ట్స్, ఎస్సారార్ కాలేజీలో పూర్తిచేశా. సర్కారు బడిలో చదివే ఈస్థాయికి ఎదిగా. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభించదనేది కొందరు తల్లిదండ్రుల్లో ఉన్న అపోహ. విద్యార్థులను నిరభ్యంతరంగా సర్కారు బడికి పంపించాలి. –మహ్మద్ మేరాజ్, జిల్లా మైనార్టీ అధికారి, పెద్దపల్లి

కమల వికాసం!

• ఎంపీ ఈటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి?
• ఇప్పటికే బండికి కేంద్ర సహాయ మంత్రి పదవి
• ధర్మపురి అర్వింద్‌కు సైతం పెరగనున్న ప్రాధాన్యం
• ముగ్గురూ అసెంబ్లీలో ఓడి గెలిచిన ఎంపీలే!
• బీజేపీలో చేరేందుకు పలువురు నేతల ఆసక్తి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లా బీజేపీ నేతలకు వరుస ఆఫర్లు దక్కుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ముగ్గురు నేతలు ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచాక పార్టీలో మరింత ప్రాధాన్యం పెరిగింది. ఇప్పుడు వీరందరికీ అదనపు బాధ్యతలు దక్కనున్నాయి. ఇప్పటికే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర అధ్యక్ష పద వి కూడా ఖాళీ కానుండటంతో ఆ పోస్టు తిరిగి ఉ మ్మడి జిల్లా వాసులను వరిస్తుందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా ఈ రేసులో మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముందున్నారు. అలాగే ఇదే పోస్టు కోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా పోటీ పడుతున్నారు.

పార్టీ బలోపేతానికి ఈటలకు పదవి..?

బీఆర్‌ఎస్ నుంచి అనూహ్య పరిస్థితుల్లో బయటికి వచ్చిన ఈటలను బీజేపీ చేర్చుకుంది. 2021లో బీజేపీలో చేరిన ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఉప ఎన్నిక అప్పట్లో సంచలనం. తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించిన అత్యంత ఖరీదైన ఉప ఎన్నికగా రికార్డులకెక్కింది. ఆ దరిమిలా ఈటల రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తూనే ఉన్నారు. గతేడాది బండి అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న సమయంలోనూ ఈటల ఆ పదవి తనకు వస్తుందని ఆశించారు. కానీ, అధిష్టానం ఆ బాధ్యతలు కిషన్‌రెడ్డికి అప్పగించింది. వాస్తవానికి కేంద్ర కేబినెట్‌లోనే మంత్రి పదవి ఆశించిన ఈటలకు పొత్తుల కారణంగా సమీకరణాలు కుదరలేదు. దీంతో కాస్త నిరుత్సాహానికి గురైన ఆయన ప్రస్తుతం అధ్యక్ష పదవి కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అధిష్టానం కూడా ఈయన నాయకత్వంపై సానుకూలంగానే ఉందని సమాచారం. ఈటలకు పదవి ఇవ్వడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చిన నాయకులనే కాకుండా బయటి నుంచి వచ్చినవారికి కూడా సముచిత ప్రాధాన్యం కల్పిస్తారన్న సంకేతాలు ఇచ్చే యోచనలో కమలనాథులు ఉన్నారని తెలిసింది. తద్వారా పార్టీలో కొత్త నేతలను ఆకర్షించాలన్న వ్యూహం రచిస్తున్నారని సమాచారం.

అర్వింద్‌కు కూడా పార్టీ పదవి..?

ఇటీవల కోరుట్ల శాసనసభ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన ధర్మపురి అర్వింద్ తర్వాత నిజామాబాద్ ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే. ఎంతో సీనియర్ అయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఓడించి తన సత్తా ఏంటో చాటుకున్నారు. అర్వింద్ కూడా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి లేదా జాతీయ స్థాయిలో ప్రభావవంతమైన పదవిని ఆశిస్తున్నారని తెలిసింది. వీరితోపాటు ఉమ్మడి జిల్లాలోని సీనియర్ నాయకులకు కూడా సరైన స్థానం కల్పించే యోచనలో పార్టీ ఉందని సమాచారం.

బీజేపీలోకి పలువురు కీలక నేతలు..!

ఎంపీ సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలు పార్టీలకు చెందిన కీలక నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ.. బీజేపీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన నేతలే కాకుండా పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, సిరిసిల్లకు చెందినవారు సైతం పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈనెల 15 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్నందున అవి ముగిసిన వెంటనే సంజయ్ కరీంనగర్ రానున్నారు. ఆ తర్వాత చేరికలు ఉండే అవకాశం ఉంది.






మహాశక్తి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్యస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారణ్యస్వామి మాట్లాడుతూ, సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి మన వంతు కృషి చేసి మంచి చేయగలిగితే అదే పుణ్యమవుతుందని వివరించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సతీమణి అపర్ణ ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఇక మత్స్య సంఘం ఎన్నికలు



• 14న నామినేషన్ల స్వీకరణ
• అదేరోజు పరిశీలన, ఉపసంహరణ
• 19న పోలింగ్.. అదే రోజు ఫలితం
• రహస్య బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు

కరీంనగర్ అర్బన్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఏళ్ల తరబడి ఎన్నికలకు నిరీక్షించగా ఎట్టకేలకు షెడ్యూల్ ఖరారైంది. రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు వన్నె తేవాలన్న క్రమంలో ఎన్నికలకు ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పటికే సొసైటీల వారీగా సభ్యత్వాలు, ఎన్నికలు నిర్వహించారు. జిల్లాస్థాయి ఎన్నికలు 170 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలతో ముడిపడి ఉండగా తదనుగుణంగా సహకార శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 14న ఎల్‌ఎండీలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వేదికగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణకు ప్రణాళికను రూపొందించింది. ఎన్నికల అధికారిగా డిప్యూటీ రిజిస్ట్రార్ సీహెచ్ మనోజ్ వ్యవహరిస్తుండగా మంగళవారం నోటిఫికేషన్ వెలువరించారు. 19న పోలింగ్ జరగనుండగా అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.

ఆశావహుల పోటాపోటీ

జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో జిల్లాలోని కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని చెరువులపై ఆధారపడే మత్స్యకార ఓటర్లు ఉండగా, ఇటీవలే వారివారి పరిధిలోని చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. 170 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు గానూ 152 మంది జిల్లా ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 11 మంది డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా 30మంది వరకు పోటీలో నిలిచే అవకాశముంది.

14న నామినేషన్ల స్వీకరణ.. 19న పోలింగ్

ఈ నెల 14న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల ప్రక్రియ సాగనుండగా, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన అదే రోజు మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు, ఉపసంహరణ 3.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, తర్వాత బరిలో నిలిచే తుది జాబితా ప్రకటించనున్నారు. అభ్యర్థులకు ఎన్నికల చిహ్నాలను అదే రోజు సాయంత్రం 5గంటల తర్వాత ప్రకటిస్తారు. 19న రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం ఓట్లను లెక్కించి 11మంది డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు.

స్కూల్ బస్సులు భద్రమేనా?

• ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో ఫిట్‌నెస్ లేని వాహనాలు
• పరీక్షలపై 'ప్రైవేట్' యాజమాన్యాల నిర్లక్ష్యం
• త్వరగా చేయించాలంటున్న రవాణా శాఖ అధికారులు
• నేడు పాఠశాలల పునఃప్రారంభం

తిమ్మాపూర్(మానకొండూర్): చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది. గతంలో ప్రైవేట్ స్కూళ్ల బస్సుల డ్రైవర్లు, పాఠశాలల యాజమాన్యాలు చేసిన పొరపాట్లతో ప్రమాదాలు జరిగాయి. విద్యార్థులు మరణించిన సంఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల బస్సుల నిర్వహణ విషయంలో రవాణా శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తోంది. ఏటా పాఠశాలల పునఃప్రారంభం నాటికి బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హత, లైసెన్స్, అనుభవాన్ని పరీక్షిస్తోంది. ఆ తర్వాతే బస్సులు రోడ్డెక్కేందుకు అనుమతి ఇస్తోంది. వేసవి సెలవుల అనంతరం నేడు పాఠశాలలు తెరుచుకోనున్నాయి.

యాజమాన్యాల నిర్లక్ష్యం..

నిబంధనల ప్రకారం పాఠశాలల పునఃప్రారంభం నాటికి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి, సిద్ధంగా ఉంచాల్సిన యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. నిబంధనల్లో విఫలమైనా, ఏదైనా లోపం ఉన్నా ఆర్థికంగా భారం పడుతుందని దూరంగా ఉంటున్నారు. సెలవుల్లో కాకుండా విద్యాసంవత్సరం మధ్యలో తనిఖీలు చేస్తే ఇలా తప్పించుకునే అవకాశం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. త్వరగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని అధికారులు సూచిస్తున్నారు.

రవాణా సదుపాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి


వివిధ కారణాలు, పిల్లల సౌకర్యం నిమిత్తం తల్లిదండ్రులు బడి బస్సులను ఆశ్రయిస్తారు. విద్యార్థులను సురక్షితంగా తీసుకెళ్లి, తీసుకురావడం యాజమాన్యాల బాధ్యత. పిల్లల చదువుకు ఉత్తమ బడి ఏదో విశ్లేషించుకునే తల్లితండ్రులు రవాణా సదుపాయానికీ అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. బడి బస్సులు భద్రమేనా? అనుమతి ఉందా? సీట్ల సామర్థ్యం, ఇంజిన్, టైర్లు, ఇతర అంశాలను సరిచూసుకోవాలి. లేదంటే సొంతంగా రవాణా సాధనం ఎంచుకోవాలి.

తనిఖీలు చేస్తాం..



విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లే ప్రతీ బస్సు నిబంధనలకు లోబడి ఉండాలి. విరుద్ధంగా ఉంటే ఆ వాహనాలను జప్తు చేస్తాం. బడులు పునఃప్రారంభమైన రోజు నుంచే తనిఖీలు చేస్తాం. పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి.

– పురుషోత్తం, డీటీసీ, కరీంనగర్



పాటించాల్సిన నియమాలు..

• బస్సుపై విద్యాసంస్థ పేరు. చిరునామా, ఫోన్ నంబర్ ఎడమవైపు, వెనక భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయాలి.
• సీటింగ్ సామర్థ్యానికి అనుగుణంగా పిల్లలను కూర్చోబెట్టాలి.
• విద్యార్థులు ఎక్కడానికి, దిగడానికి ఒక సహాయకుడిని నియమించాలి.
• డ్రైవర్ వయస్సు 60 ఏళ్ల మించరాదు. ఐదేళ్ల అనుభవం ఉండాలి.
• డ్రైవర్‌కు రక్తపోటు, మధుమేహం, కంటిచూపు వంటి పరీక్షలు మూడు నెలకోసారి చేయించాలి.
• ఫిర్యాదులకు ప్రతీ బస్సులో పుస్తకం ఉంచాలి. వాటిని యాజమాన్యం పరిష్కరించాలి.
• అత్యవసర ద్వారం ఉంచాలి.
• ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉండాలి.
• రిజిస్ట్రేషన్, కాలుష్య, బీమా పత్రాలను బస్సులో ఉంచాలి.
• విద్యార్థులు బస్సు ఎక్కడం, దిగడం కనిపించేలా అన్ని కోణాల్లో అద్దాలు ఉండాలి.
• తలుపునకు సురక్షిత లాకింగ్ ఉండాలి.

క్లుప్తంగా

చీకోడులో యువకుడి ఆత్మహత్యాయత్నం



కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు అతన్ని కాపాడారు. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని చీకోడు గ్రామానికి చెందిన నిమ్మల మహేశ్ కొన్ని రోజులుగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మనస్తాపానికి గురై, మంగళవారం ఇంట్లోనే ఉరి పెట్టుకున్నాడు. గమనించిన అతని భార్య పుష్పలత 100కు సమాచారం అందించింది. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, రాజు వెంటనే వచ్చి, ఉరితాడుకు వేలాడుతున్న మహేశ్‌ను కాపాడారు. అనంతరం అతనితోపాటు కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహేశ్‌ను రక్షించిన కానిస్టేబుళ్లను ఎస్సై అభినందించారు.

కారును ఢీకొన్న లారీ

- తృటిలో తప్పిన పెనుప్రమాదం



జ్యోతినగర్(రామగుండం): కారును ఓ లారీ ఢీకొట్టగా తృటిలో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి రవీంద్రనాథ్ మంగళవారం తన కుటుంబసభ్యులతో కలిసి కారులో కరీంనగర్ వైపు నుంచి గోదావరిఖనికి వస్తున్నాడు. ఇదే మార్గంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన పోతుల లక్ష్మణ్‌రావు లారీలో బెల్లంపల్లి వెళ్తున్నాడు. ఎన్టీపీసీ రామగుండం బీ–పవర్ హౌస్ డౌన్ రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో అందరూ క్షేమంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని బ్లూకోల్ట్స్ పోలీసులు మల్లికార్జున్, అంజి పరిశీలించారు.

భూమి విషయంలో ఫిర్యాదులు

- ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం: భూ విక్రయం, రిజిస్ట్రేషన్ విషయంలో పరస్పర ఫిర్యాదులతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల సీఐ రఘుపతి మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మాదాసు నరేశ్ సిరిసిల్లకు చెందిన రాజ్‌కుమార్ వద్ద భూమి కొనుగోలు చేశాడు. కానీ, అతను రిజిస్ట్రేషన్ చేయలేదు. తాను చెల్లించిన రూ.9.25 లక్షలు ఇవ్వాలని నరేశ్ అడగడంతో 6 నెలల్లో ఇస్తానని బాండ్ రాసిచ్చాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. డబ్బుల విషయమై తనపై దాడి చేశాడని రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పెద్దపల్లి డీటీ సస్పెన్షన్

- విధి నిర్వహణలో అలసత్వమే కారణం

సాక్షి, పెద్దపల్లి: విధుల్లో అలసత్వం వహించిన పెద్దపల్లి డీటీ కె.అజయ్‌ను సస్పెండ్ చేస్తూ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వానాకాలం 2023–24 సంవత్సరానికి గానూ సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)కు సంబంధించి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, మేనేజర్‌తోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు. అయితే, పెద్దపల్లిలో మండలంలో సివిల్ సప్లయ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డీటీ అజయ్‌కి సమాచారం ఇచ్చినా హాజరు కాలేదు. ఆయనకు కేటాయించిన రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్‌ను సేకరించడంలోనూ అలసత్వం వహించడంతో సివిల్ సప్లయ్ సర్వీస్ రూల్స్ ఆధారంగా సస్పెండ్ చేశారు.

పిల్లల జీవితం.. తీర్చిదిద్దుదాం

- వ్యక్తిత్వ నిర్మాణంలో గురువు, తల్లిదండ్రుల పాత్ర కీలకం

కరీంనగర్: జీవన ప్రగతికి చదువు కీలకం.. కానీ, అదొక్కటే జీవితం కాదు.. ప్రాపంచిక జ్ఞానం, మానవ ప్రేమ, మంచిచెడుల విచక్షణ, బంధాలు, అనుబంధాలు.. ఇలా ఎన్నో అంశాలతో ముడిపడి ఉన్నదే వ్యక్తి జీవితం. అలాంటి జీవితం బడి గోడల మధ్యే నిర్మాణం కాదు. ఇందుకు ఒక్క గురువు పాత్రే సరిపోదు.. తల్లి, తండ్రి, కుటుంబం ఇలా అందరూ కీలకమే.

గురువు




విద్యార్థికి జీవితాన్ని నేర్పించేది గురువే. పోటీ ప్రపంచంలో గట్టెక్కేవాడు విజేత. ఆ దిశగా విద్యార్థిని తీర్చిదిద్దడంలో గురువుదే బాధ్యత. మూస పద్ధతిలో కాకుండా సబ్జెక్టులతో పాటు సమాజం గురించి వినూత్న రీతిలో బోధించాలి. ప్రతి విద్యార్థిపైనా దృష్టి పెట్టాలి. సమకాలీన ప్రపంచంలో వస్తున్న మార్పుల్ని వారు ఔపోసన పట్టాలి. వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి. అప్పుడే విద్యార్థుల ఉజ్వల భవితకు దిక్సూచి కాగలరు.

అమ్మ



వ్యక్తిత్వ నిర్మాణంలో అమ్మ పాత్ర కీలకం. ఉదయమే నిద్రలేపడం, పిల్లలకు ఇష్టమైన మెనూ సిద్ధం చేయడం, పుస్తకాలు సర్ది పాఠశాలకు పంపడం వరకు తల్లి పాత్ర క్షణం తీరికలేనిది. ఇది రొటీన్‌గా మారకుండా చిన్నారుల్ని చదువులో మమేకం చేసేందుకు వీలున్న అంశాలపై తల్లులు అవగాహన పెంచుకోవాలి. విద్యా సంబంధమైన టీవీ కార్యక్రమాలు చూడడం, పుస్తకాలు చదవడం ద్వారా వీటిని బాగా వంటబట్టించుకోవచ్చు.

నాన్న



ఉదయాన్నే లేచి పిల్లల్ని పాఠశాల వద్ద దింపి రావడమే తమ బాధ్యత అనుకునే తండ్రులు ఎంతో మంది ఉన్నారు. అవసరమైతే పుస్తకాలు, పెన్నులు కొనివ్వడాన్ని అదనపు బాధ్యతగా భావిస్తారు. సాయంత్రం పిల్లలు ఇంటికి రాగానే తండ్రి వారితో చక్కగా సంభాషించాలి. పిల్లల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. తల్లి కుటుంబ అంశాలపై అవగాహన పెంచితే, తండ్రి పోటీ ప్రపంచంలో నెగ్గుకొచ్చే తీరును నేర్పించాలి.

విద్యార్థి



ఎవరెన్ని చెప్పినా.. తమ జీవిత రథచక్రాన్ని లాగాల్సింది విద్యార్థులే. ఒక స్థాయి వచ్చాక జీవితంపై స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. తనలోనూ ఒక అబ్దుల్ కలాం, ఒక సచిన్ టెండూల్కర్ ఉన్నారని నిత్యం స్ఫూర్తి పొందుతూ ఉండాలి. ఎంతటి ప్రముఖులైనా ఒక్క రోజులో ఆస్థాయికి రాలేదని గుర్తించాలి. మంచి గుణాలు కలిగితే అవకాశాలు వెన్నంటివస్తాయి. జీవితంలో పైకి ఎదగాలంటే మంచి విద్య అవసరమని గుర్తించాలి.

అంజన్న టెండర్లలో కాంట్రాక్టర్ల రింగ్



వేలంలో పాల్గొన్న టెండర్‌దారులు

- ఈవో, అధికారుల ముందే డబ్బుల పంపిణీ
- ఆలయ సిబ్బంది తీరుపై భక్తుల అనుమానం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో ఇటీవల నిర్వహించిన పెద్ద జయంతి ఉత్సవాల్లో భక్తులు సమర్పించిన వివిధ రకాల ముడుపులకు మంగళవారం నిర్వహించిన టెండర్లు వివాదాస్పదంగా మారాయి. భక్తుల ఇరుముడులు, దీక్ష మాలలు, ఇరుముడి బియ్యం సేకరణకు అధికారులు టెండర్ పిలిచారు. అయితే కాంట్రాక్టర్లు రింగై అధికారుల సమక్షంలోనే డబ్బులు పంచుకున్నారు. ఈ తతంగాన్ని మీడియా వీడియో తీస్తుండడాన్ని గమనించిన అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. ముందుగా రూ.2.50లక్షలు పలికిన దీక్ష మాలల టెండర్‌ను రూ.3.66 లక్షల వరకు తీసుకెళ్లారు. బియ్యం కిలోకి రూ.23, ఇత్తడి గంటలు కిలోకి రూ.440, ఎండుకుడుకలు కిలోకి రూ.70, కొబ్బరికాయలు రూ.60వేలకు కాంట్రాక్టర్లు టెండర్ దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అయితే టెండర్లు నిబంధనల ప్రకారం నిర్వహించలేదని భక్తులు అంటున్నారు. ఈవో, సంబంధిత అధికారుల కళ్లముందే కాంట్రాక్టర్లు రింగై డబ్బులు పంచుకునా.. ప్రేక్షకపాత్ర పోషించారన్న విమర్శలు వస్తున్నాయి. టెండర్‌దారుల నుంచి అధికారులకు



డబ్బులు పంచుతున్న టెండర్‌దారులు

ముందుగానే ముడుపులు ముట్టాయా..? అందుకే ఇలా నామమాత్రంగా నిర్వహించారా..? అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఈవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఇద్దరు టెండర్‌దారులు లావాదేవీల్లో భాగంగానే డబ్బులు ఇచ్చుకున్నామని తెలిపారని, అయినప్పటికీ వారిని టెండర్ నుంచి తొలగించి కొత్తగా టెండర్ పిలిచి పూర్తి చేశామని పేర్కొన్నారు. అనేక అనుమానాలు ఉన్న ఈ వ్యవహారంలో కలెక్టర్, దేవాదాయ శాఖ కమిషనర్ స్పందించి టెండర్లు రద్దు చేసి, అధికారులపై చర్యలు చేపట్టాలని అంజన్న భక్తులు అంటున్నారు. టెండర్ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు శ్రీనివాస్‌శర్మ, సునీల్, అధికారులు ఉమామహేశ్వర్, సంపత్ టెండర్‌దారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీకి యత్నం

- వేలిముద్రలు సేకరించిన పోలీసులు
- రూ.70 వేలు, 4 తులాల బంగారం పోయాయంటున్న బాధితులు

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడలో గుర్తు తెలియని వ్యక్తులు మూడిళ్లలో చోరీకి యత్నించారని పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. అంజయ్య, కోరం లక్ష్మీరాజం, పుప్పాల గంగరాజంల కుటుంబసభ్యులు సోమవారం రాత్రి తమ ఇళ్లకు తాళాలు వేసి, డాబాపైన నిద్రించారు. దొంగలు వాటిని పగులగొట్టి, చోరీకి యత్నించారు. అయితే, రూ.70 వేలు, 3 తులాల బంగారం చోరీ అయ్యాయని అంజయ్య, తులంపావు బంగారం ఎత్తుకెళ్లారని లక్ష్మీరాజం తెలిపారు. పోలీసులు మాత్రం దొంగలు చోరీకి ప్రయత్నించారే తప్ప ఎలాంటి విలువైన వస్తువులు పోలేదని పేర్కొన్నారు. క్లూస్ టీం సభ్యులు మంగళవారం వేలిముద్రలు సేకరించారు.

కొడిమ్యాలలోని ఇంట్లో చోరీ

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రం రామకిష్టాపూర్ రోడ్డులోని నాగుల మహేశ్ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. రూ.50 వేలు, 2 తులాల బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. వ్యక్తిగత కారణాలతో తాము వేరే ఇంట్లో ఉంటున్నట్లు పేర్కొన్నాడు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం సభ్యులు వచ్చి, వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

కొండాపూర్ గ్రామంలో..

మేడిపల్లి(జగిత్యాల): మండలంలోని కొండాపూర్‌కు చెందిన జంగిలి గణేశ్ ఇంట్లో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. చెప్యాల గ్రామంలోని బంధువుల ఇంట్లో కార్యక్రమానికి వెళ్లి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉందని బాధితుడు తెలిపాడు. 7 గ్రాముల బంగారం, రూ.14,500 చోరీకి గురయ్యాయని పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

ఆరెపల్లి గ్రామంలో..

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలోని ఆరెపల్లికి చెందిన మంజెడీ రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కథనం ప్రకారం.. రాజయ్య కుటుంబసభ్యులు సోమవారం రాత్రి తమ ఇంటి ఎదుట నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి, టీవీ, సెల్‌ఫోన్, రూ.15 వేలు ఎత్తుకెళ్లారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన నడిగోట్ల శ్రీనివాస్ ఇంటి ఎదుట ఉన్న సంపు మోటార్‌ను, నడిగోట్ల లింగయ్య తన ఇంటి ఎదుట నిద్రించగా అతని సెల్‌ఫోన్ చోరీ చేశారు. బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ సీఐ వారి ఇళ్లకు వెళ్లి, పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

అంగన్‌వాడీలకు 'భగీరథ' బాధ్యతలు సరికాదు

కరీంనగర్: అంగన్‌వాడీలకు గ్రామపంచాయతీల్లోని మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ల సర్వే బాధ్యతలు అప్పగించడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య ప్రకటనలో అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో ఆచరణకు సాధ్యం కాని సర్వేలను వారికి అప్పగించి పనిభారం మోపడం వల్ల ఉపయోగం ఉండదన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన జిల్లాలో అంగన్వాడీలకు కలెక్టర్ సర్వే బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రాలకు పిల్లలు వచ్చేలా ప్రోత్సహించి ఐసీడీఎస్ పనులు మాత్రమే అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ వారు జిల్లాలోని గ్రూప్–2, 3 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అప్లికేషన్ ఫాం, సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు జత చేసి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయం సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 98491 52516 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి, పక్కన నాయకులు

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో బాసిర సంపత్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలుచేయాలన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో పెట్టుబడి రుణాల కోసం ఈనెల 12, 13వ తేదీల్లో బ్యాంకుల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోగా రైతు రుణమాఫీ చేయాలని, కల్తీ ఎరువులు, పురుగు మందులను అరికట్టాలని కోరారు. కొంతమంది వ్యాపారులు పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముతున్నారని వెంటనే వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సరిపడా నాణ్యమైన అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎం.వాసుదేవరెడ్డి, శీలం అశోక్, గుండేటి వాసుదేవ్, వరాల రవికుమార్, పిట్టల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డికి నిప్పంటించి.. మంటల్లో కాలిపోయి

- రాయికల్‌లో రైతు మృతి



భూమయ్య మృతదేహం

రాయికల్(జగిత్యాల): పొలంలోని గడ్డికి నిప్పంటించిన ఓ రైతు అవే మంటల్లో కాలిపోయి, మృతిచెందాడని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణానికి చెందిన తోపారపు నడ్పి భూమయ్య(70)కు స్థానిక శ్మశానవాటిక సమీపంలో రెండెకరాల పొలం ఉంది. సోమవారం అందులోని గడ్డికి నిప్పంటించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగి, భూమయ్యకు అంటుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి చూడగా కాలిపోయిన మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గంగపుత్ర సంఘం నాయకులు కల్లెడ ధర్మపురి, తోపారపు రవి కోరారు.

1.70 కేజీల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మంథని: సుమారు 1.70 కేజీల గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఏసీపీ రమేశ్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి మంథని పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు గంజాయి కేసు వివరాలు వెల్లడించారు. మంథని బస్సు డిపో ఏరియాలో ఎస్సై వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు దుబాసి రమేశ్, లుకా పెట్రోలింగ్ చేస్తున్నారు. ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించగా తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద 1.70కేజీల గంజాయి లభ్యమైంది. నిందితులు ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లికి చెందిన చకినారపు సంతోష్, పెద్దపల్లి జిల్లా మంథని సత్యసాయినగర్‌కు చెందిన పుల్లె ప్రశాంత్‌గా గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. నిందితులు, గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై, కానిస్టేబుళ్లను ఏసీపీ రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం, నిందితుడిని చూపుతున్న అధికారులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ.. పక్కా సమాచారంతో దేవునిపల్లిలోని బేడబుడిగ జంగాల కాలనీలో మంగళవారం తనిఖీలు చేపట్టామన్నారు. వానరాశి నంబయ్య అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని సుల్తానాబాద్ పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించామని, నంబయ్యపై కేసు నమోదు చేశామన్నారు. డీటీ సీఎస్‌లు శంకర్‌గౌడ్, రవీందర్‌రాథోడ్, ఎఫ్‌ఐలు మల్లికార్జునరావు, శ్రీనివాస్, ఎస్సై శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

మంథని ఎంపీవో సరెండర్

మంథని: ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్‌పై వేటు పడింది. తమను వేధింపులకు గురిచేస్తున్నారని మంథని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో నరేందర్ విచారణ జరిపి, నివేదిక సమర్పించారు. ఈ మేరకు కలెక్టర్ ఎంపీవోను మంగళవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో మరో అధికారిని త్వరలోనే నియమిస్తామని డీపీవో ఆశాలత తెలిపారు.

చిరుత సంచారంపై ఆరా

ఓదెల(పెద్దపల్లి): మండలంలో చిరుతపులి సంచారంపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వాయుకుమార్, బీట్ ఆఫీసర్ తిరుపతి మంగళవారం ఆరా తీశారు. ఇటీవల ఓదెల మండలంలోని గోపరపల్లె, పొత్కపల్లి, కొలనూర్ గుట్టల్లో చిరుత సంచరించిందని తెలియడంతో కాలి వేలిముద్రలను పరిశీలించారు. అవి హైనా లేదా లేపార్డ్‌క్యాట్‌వి కావచ్చొని అనుమానం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల వాసులెవరూ రాత్రిపూట బయటకు వెళ్లొద్దని సూచించారు.

అన్న పిల్లల పుట్టువెంట్రుకలకొచ్చి.. మృత్యుఒడికి

- వేములవాడలో గుండెపోటుతో యువకుడి మృతి
- మెడికల్ షాప్ ఎదుటే కుప్పకూలిన వైనం
- మృతుడిది జనగామ జిల్లా



వినయ్ (ఫైల్)

వేములవాడ: అన్న పిల్లల పుట్టువెంట్రుకలు తీసేందుకు కుటుంబసభ్యులతో కలిసి వేములవాడ వచ్చిన ఓ యువకుడు గుండెపోటుతో మృత్యుఒడికి చేరాడు. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని 13వ వార్డు ధర్మకంచకు చెందిన బొట్ల వినయ్(23) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ నేరేడుమెట్లలో ఉంటున్నాడు. తన అన్న శివకుమార్ కూతురు, కుమారుడి పుట్టువెంట్రుకలు తీసేందుకు తల్లిదండ్రులు ఇస్తారి, లక్ష్మి, ఇతర కుటుంబసభ్యులతో కలిసి ప్రైవేట్ వాహనంలో సోమవారం వేములవాడ చేరుకున్నాడు. అద్దె గది తీసుకొని, అందరూ కలిసి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

స్వామివారిని దర్శించుకున్నారు. పిల్లల పుట్టువెంట్రుకలు తీశారు. మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బయలుదేరి వెళ్లారు. అదే సమయంలో ఛాతిలో నొప్పి వస్తోందని వినయ్ తన తల్లికి చెప్పడంతో ఆమె జండూబామ్ రాసింది. అయినా నొప్పి తగ్గకపోవడంతో మందులు తెచ్చుకుంటానని మెడికల్ షాప్‌కు వెళ్లాడు. సరిగ్గా దుకాణం ఎదుటే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు అతన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. అక్కడున్న రాజన్న భక్తులు కంటతడి పెట్టారు.

తల్లిగారింటికి వెళ్తూ.. అనంతలోకాలకు

- ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో మహిళ మృతి



మణెమ్మ మృతదేహం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ మహిళ అందులోనే గుండెపోటుతో మృతిచెందింది. కాల్వశ్రీరాంపూర్ పోలీసుల కథనం ప్రకారం.. ముత్తారం మండలంలోని లక్కారం పంచాయతీ పరిధి ఖాజీపల్లెకు జంగ మణెమ్మ(57) మంగళవారం తన కోడలు లతతో కలిసి కాల్వశ్రీరాంపూర్‌లోని తల్లిగారింటికి బయలుదేరింది. స్వగ్రామంలోనే గోదావరిఖని డిపోకు చెందిన కాల్వశ్రీరాంపూర్ వయా జమ్మికుంట ఆర్టీసీ బస్సు ఎక్కింది. మార్గమధ్యలో మణెమ్మకు గుండెపోటు రావడంతో కండక్టర్, డ్రైవర్ ఆమెను కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త రాజిరెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మణెమ్మ మృతితో స్వగ్రామం ఖాజీ పల్లె, తల్లిగారిల్లు కాల్వశ్రీరాంపూర్‌లో విషాదం నెలకొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు



క్యూలైన్లలో..



స్వామివారిని దర్శించుకుంటూ..

అంజన్న దర్శనానికి 3 గంటలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ముగుస్తుండటంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోనేరులో స్నానం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. 20 వేల మందికి పైగా వచ్చారని, స్వామివారి దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. అన్ని రకాల దర్శనాలకు టికెట్లు ఇచ్చే కౌంటర్ ఒక్కటే ఉండటంతో భారీ క్యూలైన్ ఏర్పడింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. వాహన పూజకు భారీ వాహనాలు కొండపైకి రావడంతో ఇబ్బంది పడ్డారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ, అధికారులు సునీల్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

క్రీడలతో శారీరక పటుత్వం



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడలతో దేహదారుఢ్యం, శారీరక పటుత్వం లభిస్తాయని ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీసెట్) కన్వీనర్ రాజేశ్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీలో మంగళవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. గతంతో పోలిస్తే పీసెట్ అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో మంచి ప్రతిభ చాటుతున్నారని అన్నారు. రెండో రోజున 470 మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో పాల్గొన్నారని తెలిపారు. హాజరైన అభ్యర్థులకు 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్‌లతో పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, క్రికెట్ తదితర క్రీడాంశాలలో నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, పీడీలు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

కౌంటర్లు ఆరుకు పెంపు

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజాపాలన సవరణ దరఖాస్తుల స్వీకరణకు నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌంటర్లను పెంచారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సోమవారం నుంచి తిరిగి ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి తలెత్తిన సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తులు తీసుకొంటుండడం తెలిసిందే. మొదటి రోజు కేవలం రెండు కౌంటర్లు ఉండడం, చాలా రోజుల తర్వాత కావడంతో దరఖాస్తు దారులు అధిక సంఖ్యలో రావడంతో రద్దీతో ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం కౌంటర్ల సంఖ్యను రెండు నుంచి ఆరుకు పెంచారు. దీంతో పాటు కార్పొరేటర్ల కోరిక మేరకు డివిజన్‌లలోనూ ఈ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకొంటున్నారు.

'బండి'కి కేంద్రమంత్రి పదవి హర్షణీయం

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి దక్కడం హర్షణీయమని మున్నూరు కాపు సంఘం సభ్యులు అన్నారు. మంగళవారం మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు పర్యాయాలు భారీ మెజారిటీతో ఎంపీగా గెలిచిన బండి సంజయ్‌పై నమ్మకంతో మంత్రి పదవి కట్టబెట్టిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. సంజయ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శులు నలువాల రవీందర్, చల్ల హరిశంకర్, ఉపాధ్యక్షులు కర్ర రాజశేఖర్, పసుల మహిపాల్, హాస్టల్ ఇన్‌చార్జి ముప్పిడి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులు పొడిగించాలి

కరీంనగర్: పాఠశాలలు బుధవారం ప్రారంభం కావడంతో ఎండల వేడిమి దృష్ట్యా ఈనెల 17వ తేదీ వరకు పొడిగించాలని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఎండల కారణంగా చిన్నపిల్లలు వేడిని తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు.

డీఈవో వెబ్‌సైట్‌లో ప్రమోషన్, సీనియార్టీ లిస్టు

కరీంనగర్: ఉపాధ్యాయుల ప్రమోషన్, సీనియార్టీ లిస్టు, ఖాళీల వివరాలను డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే బుధవారం 12 గంటల్లోగా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అలాగే స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల కింద జిల్లాకు 15 పోస్టులు మంజూరయ్యాయని, ఎస్‌జీటీలకు ఎవరికైతే స్పెషల్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఉందో కొత్తగా మంజూరైన స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుకు డిగ్రీతో పాటు స్పెషల్ బీఈడీ ధ్రువపత్రాలతో బుధవారం 10 గంటలకు డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

- కరీంనగర్‌లో టీటీసీ శిక్షణ
- వివిధ అంశాల్లో మెలకువలు
- 25 మంది నిపుణులతో తర్ఫీదు



తాము తయారు చేసిన వస్తువులు చూపుతున్న అభ్యర్థులు



అభ్యర్థులు గీసిన వివిధ రకాల డ్రాయింగ్స్



తయారు చేసిన వివిధ రకాల వస్తువులు

కరీంనగర్‌కల్చరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సులో భాగంగా డ్రాయింగ్, మ్యూజిక్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి కోర్సుల్లో నిపుణులైన శిక్షకుల ప్రత్యేక పర్యవేక్షణలో శిక్షణ తీసుకొని వారి జీవనోపాధికి మార్గం చూసుకుంటున్నారు పలువురు అభ్యర్థులు. డ్రాయింగ్‌లో స్టోన్, వాల్, వుడ్ పెయింటింగ్‌లో మెలకువలు నేర్చుకుంటూ.. టైలరింగ్‌లో మంచి నైపుణ్యాలు సాధిస్తూ.. ఎంబ్రాయిడరీలో పనికి రాని వస్తువులతో పలు అందమైన ఆకృతులను తయారు చేస్తున్నారు. కరీంనగర్‌లోని ధన్గర్ వాడీ ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో టీటీసీ (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్) కోర్సు నేర్చుకుంటున్నారు. మే 1న ప్రారంభమైన శిక్షణ ఈనెల 13 వరకు కొనసాగుతుంది. శిక్షణ అనంతరం వీరికి జూలై లేదా ఆగస్టులో రాత పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, గురుకులంలో వృత్తి విద్యా కోర్సులో టీటీసీ పూర్తి చేసిన వారు కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగులకు అర్హులు. ఈ కోర్సులో శిక్షణ పొందుతున్న వారిలో 85శాతం మంది మహిళలు ఉన్నారు. 14 జిల్లాల నుంచి 590 మంది శిక్షణ పొందుతుండగా.. అందులో టైలరింగ్‌లో 313 మంది, డ్రాయింగ్‌లో 267 మంది, మ్యూజిక్‌లో 10 మంది తర్ఫీదు పొందుతున్నారు. శిక్షణ పొందుతున్న పలువురిని 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

పిల్లలకు ఎలా నేర్పించాలో తెలిసింది



ఇక్కడకి రాక ముందు డ్రాయింగ్‌లో బేసిక్స్ మాత్రమే తెలిసింది. టీచర్ల పర్యవేక్షణలో మంచి మెలకువలు నేర్చుకున్న. పెయింటింగ్స్ ఎలా వేయాలో తెలిసింది. పిల్లలకు ఎలా నేర్పించాలో చెప్పారు. వుడ్, స్టోన్, ప్రకృతి, స్పెషల్ వర్క్ వాటిలో నైపుణ్యం సాధించా. ఎంత ఓపిక ఉంటే అంత బాగా నేర్చుకోవచ్చనే విషయం తెలిసింది. – జి.మేఘన, గోదావరిఖని

టైలరింగ్‌లో మెలకువలు నేర్చుకున్న



టైలరింగ్, ఎంబ్రాడయిరీలలో అన్ని రకాల మెలకువలు నేర్చుకున్న. పిల్లలకు ఎలా చెప్పాలో వివరంగా నేర్పించారు. మాస్టర్ చాలా ఓపికతో ప్రతీ విషయాన్ని అర్థమయ్యేలా బోధించారు. శిక్షణ శిబిరం మాకు ఎంతో ఉపయోగపడింది. మా జీవనోపాధికి మార్గం ఏర్పడింది. – లావణ్య, మంచిర్యాల

అవగాహన వచ్చింది



టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ తీసుకున్న. ఎంబ్రాయిడరీలో మంచి అవగాహన వచ్చింది. ఇక్కడ నేర్పించిన విధానం బాగుంది. మాకు ఒక జీవనోపాధి మార్గం దొరికింది. చాలా సంతోషంగా ఉంది. – వేముల శ్రీలత, వేములవాడ

కర్ణాటక సంగీతంలో శిక్షణ



నేను ప్రోగ్రామింగ్ ఆర్టిస్ట్. ఇక్కడ కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకున్న. పాటలు పాడుతా. మ్యూజిక్ ఒక హాబీ. సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్నా. ఒకవేళ అది కుదరకుంటే మ్యూజిక్ టీచర్ వృత్తి చేపట్టాలని కోరిక. అందుకే ఇక్కడ శిక్షణ తీసుకున్నా. – రాఘవ, హైదరాబాద్

క్రమశిక్షణతో తర్ఫీదు



734 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 590 మంది శిక్షణకు హాజరయ్యారు. శిక్షణతో తమ జీవితాలను తామే బాగుచేసుకునే చక్కటి అవకాశం వారికి లభించింది. క్రమశిక్షణతో శిక్షణ ఇస్తున్నాం. అందరూ డెమోలు పూర్తి చేశారు. – జి. ప్రమోద, కోర్సు డైరెక్టర్



వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో మంగళవారం వర్షాలు కురవాలని కోరుతూ కప్పతల్లి ఆటాడారు. పిల్లలు రోకలి కర్రకు తెల్లటి వస్త్రంలో కప్పను కట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ కప్పతల్లి పాటలు పాడారు. మహిళలు, ఇంటి యజమానులు కప్ప, పిల్లలపై నీళ్లను పోసి వర్షాలు కురవాలని కోరారు. – కరీంనగర్‌రూరల్

పాఠశాలలు రెడీ

- నేటి నుంచి పునఃప్రారంభం
- ధన్గర్‌వాడీ పాఠశాలలో ఎమ్మెల్యేతో యూనిఫామ్స్ పంపిణీ



గాంధీనగర్ పాఠశాలలో తరగతి గదిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

కరీంనగర్‌రూరల్: వేసవి సెలవుల అనంతరం బుధవారం ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సెలవుల్లో పాఠశాలల్లో పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకపోగా టాయిలెట్లు దుర్వాసన వస్తున్నాయి. అటెండర్లు లేకపోవడంతో ప్రభుత్వ పారిశుధ్య నిర్వహణ మున్సిపల్, పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. అయితే నామమాత్రంగా శుభ్రం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వేసవి సెలవుల అనంతరం బుధవారం నుంచి పాఠశాలలను పునఃప్రారంభిస్తుండటంతో అధికారులు మంగళవారం కరీంనగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను మున్సిపల్, పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు.

నేడు ఎమ్మెల్యేతో యూనిఫామ్స్ పంపిణీ

పాఠశాలలను పునఃప్రారంభించే రోజే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు యూనిఫామ్స్ తయారీ బాధ్యతను స్వశక్తి మహిళలకు అప్పగించారు. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం143 ప్రభుత్వ పాఠశాలల్లో 11,653 మంది విద్యార్థులున్నారు. మొత్తం 23,306 యూనిఫామ్స్ అవసరం కాగా మొదటి విడతలో విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ మాత్రమే అందించనున్నారు. దీని కోసం మహిళలు తయారు చేసిన 11,653 యూనిఫామ్స్‌ను మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. బుధవారం కరీంనగర్‌లోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేస్తారు.

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

అన్ని పాఠశాలలను బుధవారం పునఃప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. మంగళవారం పాఠశాలలన్నింటినీ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాం. విద్యార్థులందరికీ స్కూల్ యూనిఫామ్స్‌తో పాటు పుస్తకాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం.
–ఎం.మధుసూదనాచారి, ఎంఈవో, కరీంనగర్

అనుమతులు లేని హోటళ్లపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్: ఆహార పదార్థాలను కల్తీ చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న, అనుమతి లేని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ హోటళ్లలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. పలు రెస్టారెంట్లు, బేకరీలు, హోటళ్లలో కల్తీ నూనెలు వాడుతున్నారని, కాలం చెల్లిన వస్తువులను వినియోగిస్తున్నారని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలపై తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శి రఘుపతి, నాయకులు అరవింద్, సురేశ్, శ్రావణ్, నవీన్, సింహాద్రి, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

'సీఎం ఆదేశాలు బేఖాతర్'



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

విద్యానగర్(కరీంనగర్): ధరణి సమస్యలను పది రోజుల్లో పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆదేశాలను అధికారులు బేఖాతర్ చేశారని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను సీఎం ఆదేశించినప్పటికీ ఇప్పటికీ లక్షకు పైగా ఫైల్స్ పెండింగ్‌లోనే ఉన్నయన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అధికారులు పాటించకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు.

విద్యా వలంటీర్ల నియామకాలను ప్రకటించాలి



మాట్లాడుతున్న సర్వర్ షా బయబాని

సప్తగిరికాలనీ(కరీంనగర్): కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యా వలంటీర్ల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని తెలంగాణ ఉర్దూ ట్రెండ్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం హుస్సేన్‌పురలోని డెక్కన్ హైస్కూల్‌లో తెలంగాణ ఉర్దూ ట్రెండ్ టీచర్స్ అసోసియేషన్ సలహాదారు సర్వర్ షా బయబాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మదర్సాల్లో కరోనా ఎఫెక్ట్‌తో ఉపాధ్యాయుల కొరత ఉందని, నేటికీ పరిష్కారం కాలేదన్నారు. 2024–25 విద్యాసంవత్సరం కేవలం ఒక ఉపాధ్యాయుడితో నడపబడుతుందన్నారు. ప్రభుత్వ మదర్సాల్లో పర్మినెంట్ టీచర్లను నియమించే వరకు ఖాళీగా ఉన్న అన్ని పోస్టులలో వీలైనంత త్వరగా విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, తిరుపతిరెడ్డిలు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌కు సంబంధించి వచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా, ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని డీఈవోను కోరినట్లు తెలిపారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కరీంనగర్: జూలై నెలలో జరిగే ఐద్వా రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి అన్నారు. మంగళవారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు కరీంనగర్‌లో నిర్వహించడం శుభపరిణామమని, రాష్ట్ర కమిటీ కరీంనగర్ జిల్లాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు పెరుగుతున్నాయని, ప్రభుత్వాలు కొత్తగా కఠిన చట్టాలను అమలు చేయడంలో విఫలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్వరూప, దేవేంద్ర, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిగా బండి నియామకంపై సంబరాలు



సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు వంగల పవన్ ఆధ్వర్యంలో టవర్ సర్కిల్, ప్రకాశం గంజ్ వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. సంఘం తరపున కేంద్ర మంత్రి బండికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, నాయకులు సుద్దాల వెంకటేశ్, కొంజర్ల శ్రీకాంత్, అల్లంకి సంతోష్‌రాజు, సురేశ్, కైలాస నవీన్, బీజేపీ సీనియర్ నాయకులు హరికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 59వ డివిజన్ సుష్మ స్వరాజ్ చౌరస్తాలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డి శ్రీనివాస్, పబ్బల్ల ఆంజనేయులు, దయ్యాల కరుణాకర్, దయ్యాల మల్లేశం, ఓల్లెం సంజీవ్‌కుమార్, పరకాల ఆంజనేయులు, దయ్యాల సంజీవ్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తపల్లి: కొన్ని రోజులుగా ఆసిఫ్‌నగర్ జెడ్పీ హైస్కూల్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ రెడ్డవేని మధు టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తపల్లి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో 22 టీంలు పాల్గొనగా ప్రతీ మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా హెల్మెట్ బహూకరించారు. బుధవారం ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్ బావుపేట టీంకు రూ.15వేలు ప్రైజ్‌మనీ, రన్నర్ చింతకుంట టీంకు రూ.8వేలు ప్రైజ్‌మనీతో పాటు కప్‌లను ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ సాబిర్ పాషా, సర్పంచ్ కడారి శాంత శ్రీనివాస్ తదితరులతో కలిసి రెడ్డవేణి మధు బహుమతులు అందజేశారు. వివిధ గ్రామాల క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ అభివృద్ధి, మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు 11కేవీ వెంకటేశ్వర ఫీడర్ పరిధిలోని సాధన స్కూల్, బీజేపీ కార్యాలయం, జ్యోతినగర్, వెంకటేశ్వర ఆలయం ప్రాంతాలతో పాటు ఉదయం 10.45 నుంచి 12.15 వరకు 11 కేవీ వరలక్ష్మీ ఫీడర్ పరిధిలోని రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక భాగం, వరలక్ష్మీనగర్, సీతారాంపూర్‌లో కొంత ప్రాంతం, సాయంత్రం 3.30 నుంచి 5 గంటల వరకు 11 కేవీ డాక్టర్స్ స్ట్రీట్ ఫీడర్ పరిధిలోని రాజా థియేటర్, శ్రీదేవి ఆసుపత్రి, మంచిర్యాల చౌరస్తా, భూమిరెడ్డి ఆసుపత్రి రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

రూరల్ పరిధిలో..

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లి, రెవెన్యూ కాలనీ, ఆర్టీసీకాలనీ, చంద్రపూర్ కాలనీ, కేఆర్ కాలనీ, వడ్లకాలనీ, హ్యాపీ హోమ్స్, ఆరెపల్లి దుబ్బలు, నగునూర్ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపు రాజు తెలిపారు.

సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

- 'మిషన్ భగీరథ' ఇంటింటి సర్వే ప్రారంభం



చెర్లభూత్కూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: మిషన్ భగీరథ పథకం సర్వేకు ఆదిలోనే సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. సిబ్బంది యాప్‌లో వివరాలు నమోదు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరీంనగర్ మండలంలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సోమవారం నుంచి సర్వే ప్రారంభించారు. గ్రామాల్లో సర్వే చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు ఈనెల 7న మండల పరిషత్ సమావేశ మందిరంలో యాప్‌లో వివరాలు నమోదు చేయడంపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 15,150 నివాస గృహాలను సర్వే చేసేందుకు 78 మంది పంచాయతీ సిబ్బందిని నియమించి లాగిన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సర్వేయర్‌కు రోజుకు 25 గృహాలను సర్వే చేసే బాధ్యతను అప్పగించారు. అయితే సాంకేతిక సమస్యలు, యాప్‌లో వివరాల నమోదులో కొన్ని ఆప్షన్లు లేకపోవడం, ఇంటర్నెట్ సిగ్నల్స్ అందక పోవడంతో సర్వే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమ, మంగళవారం రెండు రోజుల్లో 1,000 గృహాలను సిబ్బంది సర్వే పూర్తి చేశారు. సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యజమాని పేరు, కుటుంబసభ్యుల వివరాలు, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు నంబర్లు నమోదు చేశారు. లబ్ధిదారుడితో కలిపి ఇంటి ఫొటో, నల్లా ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మంగళవారం బొమ్మకల్, గోపాల్‌పూర్‌లో సర్వే తీరును ఎంపీడీవో సంజీవరావు పరిశీలించారు. అదే విధంగా చెర్లభూత్కూర్, చామనపల్లి, నగునూరు, దుబ్బపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను మాస్టర్ ట్రైనర్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈనెల 20వరకు సర్వే పూర్తి చేయాలని, వివరాల నమోదులో ఏమైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే మాస్టర్ ట్రైనర్లు, డీపీఎంను సంప్రదించాలని సిబ్బందికి సూచించారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరేణుక ఎల్లమ్మ పట్నాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. బైండ్ల పూజారుల దప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా ఎల్లమ్మ గుడి వద్దకు తరలివెళ్లారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. – కరీంనగర్‌రూరల్

ప్రజా పాలన అందిస్తాం

రాజధాని అమరావతే.. ఆర్థిక రాజధానిగా విశాఖ ● ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పాలన సాగిస్తామని, ప్రతి అడుగు ప్రజల కోసమే వేస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. ప్రజా వేదికలా కూల్చివేతలు, మూడు రాజధానుల పేరుతో ఆటలు తమ ప్రభుత్వంలో ఉండవని స్పష్టం చేశారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో మంగళవారం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. ఇందులో ఎన్డీయే శాసనసభాపక్ష నాయకుడిగా చంద్రబాబు ఎన్నికయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పాజిటివ్ ప్రభుత్వం ఉంటుందని, అశాంతికి తావుండదని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము ఓడింది కేవలం 11 సీట్లలో మాత్రమేనని, 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్లను కూటమి సాధించిందని తెలిపారు. తనను జైల్లో పెట్టినప్పుడు పవన్ కల్యాణ్ ఇచ్చిన మద్దతును ఎప్పుడూ మరిచిపోనన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని గతంలో చెప్పారని, జైల్లో తనను కలిసిన అనంతరం పొత్తు ప్రకటించారని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని, మళ్లీ ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రం పూర్తిగా శిథిలమైందని, దెబ్బతినని వర్గమంటూ లేదన్నారు. పాలన ఎలా ఉండకూడదో, గత పాలన ఒక కేస్ స్టడీ అని చెప్పారు. కక్ష తీర్చుకోవాలని ముందుకెళితే సమస్యలు వస్తాయని, అలాగని తప్పు చేసిన వారిని క్షమించి పూర్తిగా వదిలేస్తే మళ్లీ అదే బాట పడతారన్నారు. చట్ట పరంగా శిక్షించడంతో పాటు విధ్వంసం, కక్ష రాజకీయాలు చేయకుండా సరైన దారిన పెట్టాలన్నారు. తనకు అసెంబ్లీలో అవమానం జరిగిందని, దాన్ని భరించలేక మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశానని గుర్తు చేశారు. శాసనసభను గౌరవ సభగా మార్చి ప్రజా సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చుకుందామన్నారు.

కక్షపూరిత రాజకీయాలు ఉండవు

రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో తెలీదని, ఎక్కడ నుండి తెచ్చారో తెలీదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని చంద్రబాబు అన్నారు. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయిందని, వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉందన్నారు. పదేళ్ల తర్వాత కూడా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కక్ష పూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజయాలు పాటిద్దామని చెప్పారు. పోలవరం డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయిందని, మళ్లీ కేంద్రం సహకారంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని తెలిపారు.


ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న చంద్రబాబు. చిత్రంలో పురందేశ్వరి, పవన్

రాజధానిగా అమరావతి.. ఆర్థిక రాజధానిగా విశాఖ

ఏపీకి రాజధానిగా అమరావతి, ఆర్థిక రాజధానిగా విశాఖ ఉంటుందని బాబు స్పష్టం చేశారు. న్యాయ రాజధాని కర్నూలు అంటూ మోసం చేశారని, రాయలసీమలో వన్ సైడ్‌గా ఎన్నికలు జరిగాయని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా మామూలు మనిషేనని, తాను సీఎంగా ఉన్నా, పవన్ కళ్యాణ్ ఏ పదవిలో ఉన్నా సామాన్యుల్లా ప్రజల్లో ఒకరిగానే ఉంటామని తెలిపారు. హోదా సేవ కోసం తప్ప పెత్తనం కోసం కాదన్నారు. తెలుగు జాతి ప్రపంచంలో నంబర్ వన్‌గా ఉండాలనేది తన కల అని అన్నారు.

హామీలన్నీ నెరవేర్చేలా పాలన: పవన్ కల్యాణ్

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఐదు కోట్ల మందికిపైగా ప్రజలు తమపై నమ్మకం పెట్టుకున్నారని, కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదన్నారు. అన్నింటా బలంగా నిలబడతామని చెప్పి అధికారంలోకి వచ్చామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. చంద్రబాబు ఎంతో నలిగిపోయారని, జైల్లో ఆయన్ని చూశానని, మంచి రోజులు వస్తాయని చెప్పానని, వచ్చాయని తెలిపారు. ఆయన అద్భుతమైన పాలన ఇవ్వాలని కోరుకుంటున్నానని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ లక్ష్యంతో పని చేయాలని, మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమమని తెలిపారు.

ఎన్డీయే సభాపక్ష నేతగా చంద్రబాబు

ఈ సమావేశంలో చంద్రబాబును ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తమ పార్టీ శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం పవన్ కళ్యాణ్, చంద్రబాబును ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బలపరిచారు. సమావేశం తర్వాత అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పురందేశ్వరిలు రాజ్‌భవన్‌కు వెళ్లి 164 మంది ఎమ్మెల్యేలు చంద్రబాబును ఎన్డీయే పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తెలిపి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. తమకు మద్దతు ప్రకటించిన 163 మంది ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు సమర్పించారు. దాంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్.. లాంఛనంగా ఆహ్వానించారు.

జనసేన శాసనసభా పక్ష నేతగా పవన్ కల్యాణ్

జనసేనశాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కల్యాణ్ ఎన్నికయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన ఆ పార్టీ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. జనసేన తరఫున గెలుపొందిన 21మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమావేశంలో తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కల్యాణ్ పేరును ప్రతిపాదించగా, మిగిలిన ఎమ్మెల్యేలు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

నేడు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- హాజరుకానున్న ప్రధాని మోదీ, షా
- అతిథులుగా రజనీకాంత్, చిరంజీవి

సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా రెండుసార్లు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆయన మూడోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కారు. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేసేందుకు గన్నవరం ఐటీ పార్కు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం దాదాపు ఖరారైంది. మరికొందరు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుకు సంబంధించిన అంశంపైనా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

హాజరుకానున్న ప్రధాని, ప్రముఖులు

ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారు. అమిత్‌షా, నడ్డా ఇప్పటికే విజయవాడ చేరుకున్నారు. సినీ ప్రముఖులను తన ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు అతిథులుగా ఆహ్వానించగా చిరంజీవి కుటుంబంతో సహా ఇప్పటికే విజయవాడ వచ్చారు.


వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ ముఖ్య నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, కొట్టు సత్యనారాయణ, నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, కేకే రాజు, జక్కంపూడి రాజా, రాపాక వరప్రసాద్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

ఊరూరా విధ్వంసాలు, వేధింపులు

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యం
- చంద్రబాబు, లోకేశ్‌ల అండతో రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ నేతలు, కార్యకర్తల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. వారం రోజులుగా జరిగిన వందలాది ఘటనల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టిస్తున్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ.. వైఎస్సార్ విగ్రహాలను కూలదోస్తున్నారు. పోలింగ్ ముగిసినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు మొదలైనప్పటికీ.. ఫలితాల వెల్లడి తర్వాత పరిస్థితి శ్రుతిమించిపోయింది. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను దారి కాచి దాడులు చేస్తున్నారు. గ్రామాల్లో ఇళ్లలోకి దూరి కొడుతున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అనుమానంతో సామాన్యులను సైతం కక్ష సాధింపుతో వేధిస్తున్నారు. 'ఇదేం అన్యాయం.. కాపాడండయ్యా..' అంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీస్తున్నా.. ఆ ఖాకీలు మాత్రం వృత్తి ధర్మాన్ని మరచి చోద్యం చూస్తున్నారు. తాజాగా అనంతపురంలో హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను చంపుతామని బెదిరించారు. ఊరు వదిలి వెళ్లాలని సాక్షాత్తు పోలీసు అధికారులే ఉచిత సలహా ఇస్తుండటం నివ్వెరపరుస్తోంది. తెనాలిలో వైఎస్సార్‌సీపీ నేత కాళిదాసు సత్యంపై, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరులో ఆర్‌ఎంపీ వైద్యుడు శివయ్యపై హత్యాయత్నం చేశారు. పరిస్థితి చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా.. అనే అనుమానం కలుగుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తల అరాచకం.. దౌర్జన్యం.. కనుసైగ చేసి దాడులను ప్రోత్సహిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్‌ల తీరుపై రాష్ట్రపతికి నివేదించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ ఎంపీల బృందం మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకుంది. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరింది. రాష్ట్రంలో విధ్వంసకాండ గురించి బుధవారం జాతీయ మీడియాకు కూడా వివరించనుంది. మరోవైపు ఇదే విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జగన్ ఓటమిని జీర్ణించుకోలేక.. కుటుంబ సమేతంగా ఆత్మహత్యాయత్నం

- వీడియో సందేశంతో గుర్తించిన పోలీసులు, కుటుంబ సభ్యులు
- అందరూ ఓట్లు వేశామని చెబుతున్నా ఓటమికి కారణం ఏమిటని ప్రశ్న
- ఈవీఎంలతో మోసం చేశారని ఆరోపణ
- బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ జగనే సీఎం అని ధీమా


మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేస్తున్న రాజు, నాగలక్ష్మి దంపతులు

కొవ్వూరు: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడాన్ని ఆ వీరాభిమాని జీర్ణించుకోలేకపోయాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా గోదావరి నదిపై ఉన్న గామన్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఏమిటంటే.. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన తాళ్లూరి రాజు, తన భార్య నాగలక్ష్మి, కుమార్తె హర్షిత, కుమారుడు మోక్షిత్‌తో కలిసి మంగళవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. కొవ్వూరు–కాతేరు మధ్య గోదావరిపై ఉన్న గామన్ బ్రిడ్జి పైకి వేకువజామునే చేరుకున్నాడు. తాను, తన కుటుంబమంతా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నామని మిత్రులకు వీడియో సందేశం పెట్టాడు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రాజు కుటుంబ సభ్యులు, కొవ్వూరు పట్టణ పోలీసులు ఈ సమాచారం తెలుసుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్రిడ్జిపై రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న రాజుకు, ఆయన కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి బయటకు తీసుకువచ్చారు.

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఉంటారు..

అనంతరం.. రాజు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ఒక్కరిని అడిగినా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామంటున్నారని, కానీ, జగన్ ఎలా ఓటమి పాలయ్యారో తెలీడంలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. తన కుటుంబ చావుతోనైనా ఎన్నికల్లో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేస్తారని ఆశిస్తున్నానన్నాడు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఉంటారని, బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని రాజు చెప్పాడు. తన ఆవేదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకువెళ్తే రీపోలింగ్‌కు ఆదేశిస్తారన్న ఉద్దేశంతో వీడియో ద్వారా తన సందేశాన్ని తెలిపి కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానన్నాడు. అందరికీ మంచి చేసిన జగన్ ఘోరంగా ఓటమి పాలవుతారని కలలో కూడా ఊహించలేదని కన్నీటితో చెప్పాడు. బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తే ఎన్నికలపై విచారణకు అవకాశం ఉండదని.. అందుకనే తెల్లవారుజామున 5.30 గంటలకు భార్యాపిల్లల్ని తీసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు బ్రిడ్జిపైకి వచ్చానని చెప్పాడు. రాజుకు, ఆయన భార్యకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కేసులున్నా ప్రమోషన్లా?

- క్రిమినల్ కేసుల్లో కొందరు టీచర్లు
- 'మెడికల్' బిల్లుల కేసుల్లో పలువురు పంతుళ్లు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్లకు బదిలీలతో పక్కకు
- ఆ కేసులు దాచిపెట్టడంపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ టీచర్ల పదోన్నతుల ప్రక్రియలో విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. క్రిమినల్ కేసులున్న వారూ పదోన్నతుల జాబితాలో ఉండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రంగారెడ్డి జిల్లా మినహా అన్ని జిల్లాల్లో సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ ఆయా జిల్లాల పరిధిలో సీనియారిటీ జాబితా సిద్ధమైంది. కొందరు టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బందిపై అప్పట్లో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో కొన్ని కేసులు ఇప్పటికీ కోర్టుల్లో విచారణలో ఉన్నాయి. వాటిని బయట పడనీయకుండా కొత్త జిల్లాల్లో పని చేస్తున్న చోట తమ పదోన్నతులకు లైన్ క్లియర్ చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై తోటి ఉపాధ్యాయులే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మెడికల్ దొంగ బిల్లులపై కేసులు

ఉమ్మడి ఆదిలాబాద్‌లో 2013లో 92మంది టీచర్లు, హెచ్‌ఎం, బోధనేతర సిబ్బంది ప్రభుత్వం ఇచ్చే మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను దుర్వినియోగం చేశారు. తప్పుడు బిల్లులతో రూ.20వేల నుంచి రూ.1.90లక్షల వరకు బిల్లులు క్లెయిమ్ చేశారు. వాస్తవానికి ఎలాంటి చికిత్స తీసుకోకుండానే నకిలీ బిల్లులతో తప్పుదోవ పట్టించి డబ్బులు కాజేశారు. రూ.లక్షల్లో ప్రభుత్వ ఖజానాకు నష్టం చేశారు. దీనిపై ఐపీసీ 403, 409, 120(బీ) కింద బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఆ టీచర్లతోపాటు అప్పటి ప్రధానోపాధ్యాయులపైనా శాఖ పరమైన విచారణ జరిగింది. ఆ బిల్లులను క్షుణ్ణంగా తనిఖీలు చేయకుండా పాస్ చేసినందుకు గాను హెచ్‌ఎం, డ్రాయింగ్ అధికారులపైనా విచారణ జరిగింది. ఇప్పటికీ కొందరు టీచర్లపై ఆ కేసులు నడుస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన టీచర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ నాటి ఉమ్మడి జిల్లా డీఈవో మండలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌వోలకు లేఖలు రాయడంతో కేసు విచారణ జరిగింది. ఆ సమయంలో ఒక్కో టీచర్ మూడు ఇంక్రిమెంట్లు కట్ చేశారు. తాజాగా పదోన్నతుల క్రమంలో క్రిమినల్ కేసు విచారణ ఎదుర్కొంటున్న వారి సర్వీస్ రికార్డును కొత్త జిల్లాల వారీగా నమోదు చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాల్లో ఆయా మండలాల్లో నమోదైన కేసులను పక్కకు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే అనుమానాలు వస్తున్నాయి. సీనియార్టీలో వెనకబడకుండా మేనేజ్ చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.


రీయింబర్స్‌మెంట్ అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అప్పటి డీఈవో ఉత్తర్వు

ఆ కేసుల్లో లేరా?

క్రిమినల్ కేసుల్లో బాధ్యులుగా ఉండి కూడా ఆ కేసుల్లో లేనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధి ఆదిలాబాద్, నార్నూర్, నేరడిగొండ, బోథ్, ఆసిఫాబాద్, సిర్పూర్ యూ, జైనూర్, వాంకిడి, రెబ్బెన, సిర్పూర్ టీ, కాగజ్‌నగర్, కడెం, తాండూరు, బెల్లంపల్లి, చెన్నూరు, ముధోల్, లక్ష్మణచాంద, జైనథ్ మండలాల పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. తప్పుడు బిల్లులు చేసిన డబ్బుల రికవరీతోపాటు శాఖ పరమైన చర్యలు తీసుకున్నారు. కొందరిపై ఇంకా విచారణ నడుస్తోంది. 317జీవోతో బదిలీలు జరిగాయి. కేసులు ఓ జిల్లాలో ఉంటే మరో చోట విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంకొందరు ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో సర్వీస్ సీనియార్టీలో క్రిమినల్ కేసులున్న వారికి కూడా పదోన్నతులకు అవకాశం ఉందని టీచర్లు వాపోతున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి తాండూరు మండలంలో కేసు ఎదుర్కొంటున్న ఓ టీచర్ ప్రస్తుతం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మెరిట్ జాబితాలో ఉన్నారు. ఇలా కొందరు టీచర్లు తమ తప్పును కప్పిపుచ్చుకుంటూ పదోన్నతుల కోసం పాకులాడుతున్నారు. ఈ విషయమైపై మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్యను వివరణ కోరగా క్రిమినల్ కేసులు ఉంటే సర్వీస్ బుక్‌లో రిమార్క్‌గా నమోదు చేస్తామని అన్నారు. క్రిమినల్ కేసులు కొనసాగితే ప్రమోషన్లలో వారికి అవకాశం ఉండదని తెలిపారు.

అందని 'గుర్తింపు' సర్టిఫికెట్

- శ్రద్ధ చూపని సింగరేణి యాజమాన్యం
- స్ట్రక్చరల్ సమావేశాల కోసం ఎదురుచూపు

గోదావరిఖని(రామగుండం): పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసింది. అయితే, ఐదు నెలలుగా సింగరేణిలో గెలిచిన సంఘాలకు ఇంకా గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు అందజేయలేదు. దీంతో పెండింగ్ సమస్యలపై యాజమాన్యంతో కార్మిక నేతలు చర్చించే అవకాశం లేకుండా పోయింది. గుర్తింపు పత్రాలు అందజేయడంలో స్పష్టత లేక చిక్కుముడి వీడడంలేదు. చివరకు యాజమాన్యమే గుర్తింపు పత్రం అందించాలని కార్మిక శాఖ తేల్చింది. ఈలోగా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈఅంశంలో మరింత జాప్యం జరిగింది.

డిసెంబరులో ఎన్నికలు..

గతేడాది డిసెంబర్‌లో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయి. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా, ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందాయి. ఈ సంఘాలకు అధికారిక పత్రాలు అందజేయడంలో జాప్యం కావడంతో ఐదు నెలలుగా నిర్వహించాల్సిన స్ట్రక్చరల్ సమావేశాలకు దిక్కులేకుండాపోయింది. చివరకు సింగరేణిలోని అన్ని ఏరియాల్లో ప్రతినెలా నిర్వహించే ప్రెస్‌మీట్లను కూడా యాజమాన్యం నిలిపివేసి కొత్త విధానానికి తెరతీసింది. సంస్థవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 40వేల మంది ఉద్యోగులకు సంబంధించి అనేక అంశాలపై ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంది. దీనిపై యాజమాన్యం పూర్తిస్థాయిలో స్పందించడం లేదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సమస్యల పరిష్కారం ఎప్పుడు?

- కార్పొరేట్, ఏరియా స్థాయిలో నిర్వహించాల్సిన స్ట్రక్చరల్ సమావేశాలు నిలిచిపోయాయి.
- గుర్తింపు కార్మిక సంఘంతో కార్పొరేట్‌స్థాయి, ప్రాతినిధ్య సంఘంతో ఏరియా స్థాయి సమస్యలపై చర్చించి ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది.
- 35 నుంచి 40 ఏళ్లకు డిపెండెంట్‌ల వయస్సు పెంపునకు ప్రభుత్వం అంగీకరించింది. కానీ సింగరేణిలో అది ఇప్పటికీ అమలుకు నోచుకోవడంలేదు.
- విజిలెన్స్ విభాగంలో చాలాకాలంగా డిపెండెంట్ల ఉద్యోగాల ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయి.
- చిన్నచిన్న కారణాలతో కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో పేరుకుపోయిన ఫైళ్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- ఏటా ఉద్యోగులకు ఇవ్వాల్సిన యాక్టింగ్ పదోన్నతులు నిలిచిపోయాయి.
- మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సమావేశాలు కూడా ముందుకు సాగడం లేదు.


సింగరేణి కార్మికులు

అంగీకరించినా అందలేదు



గతంలో ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు, ఉద్యోగాల ప్రక్రియ కొనసాగేది. ప్రస్తుతం అన్నీ నిలిపివేసిన సింగరేణి యాజమాన్యం.. అందరినీ ఇబ్బందులకు గురిచేస్తోంది. రెగ్యులర్ పదోన్నతులు, మెడికల్ ఇన్వాలిడేషన్ నిలిపివేసింది. గుర్తింపు పత్రం కోసం యాజమాన్యం, ఆర్‌ఎల్‌సీ మధ్య కొన్ని రోజులు జాప్యం జరిగినా చివరకు యాజమాన్యం గుర్తింపు పత్రం ఇచ్చేందుకు అంగీకరించింది. ఇప్పటివరకు చేతికి అందలేదు.

– వాసిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

సమస్యలు పరిష్కరిస్తున్నాం



సింగరేణి యాజమాన్యంతో సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రధానంగా డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచే అంశం ఓ కొలిక్కివచ్చింది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. త్వరలో మిగతా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. అలాగే సంస్థలో నిలిచిన సమస్యలపై యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతున్నాం.

– జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్

గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్ సార్‌మేడీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు ఉచిత నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ వైద్య సదుపాయం మెరుగుపరిచేలా ప్రతీ గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సమావేశంలో ఏపీవో పీవీటీజీ కుడిమెత మనోహర్, ఈఈటీడబ్ల్యూ రాథోడ్ భీంరావు, జీసీసీ డీఎం రామానందం, ఐటీడీఏ యూనిట్ అధికారులు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా మేడీలు మెస్రం దుర్గు, మోతీరాం, భీంరావు, సార్‌మేడీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

అమ్మవారికి భారీ ఆదాయం

బాసర : శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపును మంగళవారం అధికారులు చేపట్టారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్, కార్యనిర్వాహణాధికారి. విజయరామారావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 77 రోజుల హుండీ ఆదాయం వివరాలను అధికారులు వెల్లడించారు. రూ.1,08,25,828 నగదు, 120 గ్రాముల మిశ్రమ బంగారం, 7కిలోల 250 గ్రాముల మిశ్రమ వెండి, 56 విదేశీ కరెన్సీ నోట్లు, వచ్చాయని తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన వైదిక, పరిపాలన సిబ్బంది, శ్రీరాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు, కామారెడ్డి జిల్లా సేవా భక్తులు, స్థానిక సరస్వతి అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.


నగదు లెక్కిస్తున్న సేవా సమితి మహిళలు

ఇదేం దా'రుణం'?

- సిరిసిల్లలో అప్పిచ్చిన వ్యక్తి ఘాతుకం
- ప్రజాప్రతినిధి భర్తతో కలిసి దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో వివరాల వెల్లడి

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: అప్పిచ్చిన వ్యక్తి పైసా చికానికి సామాన్యుడు బలయ్యాడు. కొద్దిరోజులు గడువిస్తే అప్పు చెల్లిస్తానని బతిమిలాడినా వినకుండా మానవత్వం మరిచి ప్రవర్తించాడో ప్రబుద్ధుడు. అతనికి తోడుగా మాజీ ప్రజాప్రతినిధి భర్తతోపాటు మరో నలుగురు తోడై జరిపిన దాడి సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడు మంగళవారం న్యాయం కోరుతూ సిరిసిల్ల ఠాణాలో ఫిర్యాదు చేసి ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన గూడెల్లి రాజ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. తొమ్మిది నెలల క్రితం పట్టణానికి చెందిన మాదాసు నరేశ్ వద్ద రూ.8లక్షలు అప్పుచేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాడు. ఎన్నికలు రావడం, ఇతరత్ర కారణాలతో రియల్ భూమ్ పడిపోవడంతో తోటి భాగస్వాములు కొద్దిరోజులు ఓపిక పట్టి ధర వచ్చాక భూములు అమ్ముకుందామని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో రాజ్‌కుమార్‌ను చాలా రోజులుగా నరేశ్ డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని ఒత్తిడి చేస్తుండగా వాయిదా కావాలని కోరుతూ వస్తున్నాడు. కాగా సోమవారం రాజ్‌కుమార్‌ను నరేశ్ తోపాటు మాజీ ప్రజాప్రతినిధి భర్త శ్రీనివాస్ మాట్లాడుదామని ఇంట్లో నుంచి పట్టణ శివారులోని ఓ గోదాంకు తీసుకెళ్లారు. అక్కడ నరేశ్, శ్రీనివాస్‌తోపాటు మరో నలుగురు రాజ్‌కుమార్‌ను తాళ్లతో కట్టేసి దాడి చేశారు. ఒంటినిండ గాయాలైన బాధితుడు రాజ్‌కుమార్ మంగళవారం సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం కోరుతూ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. నరేశ్, శ్రీనివాస్‌తోపాటు కొందరు గూండాలతో తనకు ప్రాణభయం ఉందన్నారు. తనకేమైనా జరిగితే సదరు వ్యక్తులే బాధ్యులన్నారు. తన గాయాలకు చికిత్స పొందాలంటే దవాఖానాకు పోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల పోలీసులు వెంటనే స్పందించి తనపై దాడికి పాల్పడిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసు నమోదు

బాధితుడు రాజ్‌కుమార్ ఫిర్యాదుతో మాదాసు నరేశ్, భీమారం శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపారు.


ఒంటిపై గాయాలు చూపుతున్న రాజ్‌కుమార్

సంప్రదాయానికి ప్రతీకగానే కాదు...
దక్షిణాసియా అంతటా సొగసైన వైభవంగా
ఐకానిక్ సిక్స్ యార్డ్‌గా పేరొందింది చీరకట్టు.
ఈ ఎవర్‌గ్రీన్ చీర కట్టును సాహసోపేతమైన
క్రీడల ప్రపంచంలోనూ వాడచ్చని నిరూపిస్తోంది అఫ్సానా బేగం.
జపాన్‌లోని చిబా విశ్వవిద్యాలయంలో డాక్టోరల్ విద్యార్థి అఫ్సానా
దక్షిణాసియాలోని సాంస్కృతిక వారసత్వాన్ని సగర్వంగా ప్రదర్శిస్తోంది.
చీరకట్టుతో సైక్లింగ్, స్కై డైవింగ్, సర్ఫింగ్, గ్లైడింగ్..
వంటి క్రీడల్లో పాల్గొంటోంది.

చీర... శక్తికి చిహ్నం







చీర కట్టుతో అఫ్సానా బేగం సాహస క్రీడలు

‘క్రీడలకు నిర్దిష్ట యూనిఫాం అవసరమనే సంప్రదాయాన్ని చీరకట్టుతో సవాల్ చేస్తున్నాను. తరతరాలుగా చీర మన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది. దక్షిణాసియా అంతటా ఉత్సవ వైభవంతో వెలిగిపోతుంటుంది. అయినప్పటికీ, స్నోబోర్డింగ్, స్కైడైవింగ్ వంటి సాహసోపేతమైన క్రీడల కోసం ఈ ఐకానిక్ సిక్స్- యార్డ్ ఫాబ్రిక్ ఎంపిక చేయదగిన వస్త్రం కాదనే అపోహ ఉంది. దీనిని ఎలా ఉపయోగించవచ్చో చూపాలనుకున్నాను. మన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తూనే, సాహసోపేతమైన క్రీడల ప్రపంచంలో చీర బలం, బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించాలనుకున్నాను.



చరిత్రలో బలమైన శక్తి

నాకు సైకిల్ తొక్కడం వంటి యాక్టివిటీస్ అంటే చాలా ఇష్టం. మా యూనివర్శిటీలో చీరకట్టుతో సైక్లింగ్ చేస్తుంటాను. అయితే, రైడింగ్ టైమ్‌లో చీరలు అంత అనుకూలమైనవి కావని నా స్నేహితులు అందులోని అసౌకర్యాన్ని ఫీలవుతుండేవారు. పైగా ఏవేవో కామెంట్స్ చేస్తుండేవారు. ఈ దృక్పథాన్ని మార్చాలనే ఆలోచన రోజు రోజుకూ పెరుగుతూ వచ్చింది. ‘చీర’ మన రోజువారీ కార్యకలాపాలలో ఒక చైతన్యాన్ని తీసుకువస్తుంది. దక్షిణాసియాలో ముఖ్యమైన సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాల సమయాల్లో చరిత్రలో మహిళలు ఈ వస్త్రాన్ని ఎలా ధరించారో నాకు తెలుసు. చీర ఎప్పుడూ నాకు శక్తికి చిహ్నంగా ఉంది. ఈ విషయాన్ని నా 30వ పుట్టినరోజు సందర్భంగా అసౌకర్యాన్ని సౌకర్యంగా, అత్యంత శక్తిమంతంగా ఎలా చూపించవచ్చో క్రీడల్లో ఆధునిక వస్త్రధారణ విధానాలను ఎలా సవాల్ చేయచ్చో నిరూపించాలనుకున్నాను. చీరలో స్కై డైవింగ్ చేసి ఆ శక్తిని చూపాను. దీంతో మా యూనివర్శిటీ విద్యార్థులందరికీ ఈ నా సవాల్ వెనక ఉన్న అంతరార్థం అర్థం అయ్యింది.

మార్పు కోసమే సవాల్

నేను పుట్టి పెరిగింది బంగ్లాదేశ్‌లో. అక్కడ సంప్రదాయ దుస్తులకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. నేను జపాన్‌లోనూ నా సంప్రదాయ దుస్తుల్లోనే కాలేజీకి వెళ్లడం, రోజువారి కార్యకలాపాల్లో పాల్గొనడం చేసేదాన్ని అయితే, ఇక్కడి వారిలో చీర పైన సరైన అవగాహన లేదు. దాంతో నా చుట్టూ ఉన్న వారి నుంచే కొన్ని కామెంట్స్ ఎదుర్కొనేదాన్ని. చీరకట్టు వల్ల కలిగే శక్తి, ప్రయోజనాల గురించి చాలా చెప్పాల్సి వచ్చేది. వాదించాల్సి వచ్చేది. ఇక్కడ మార్పు తీసుకురావాలనుకున్నాను.

ముందుగా ప్రజా రవాణాలో చీరకట్టుకు గౌరవం పెరగడానికి కృషి చేశాను. అదే ఇప్పుడు సాహసోపేతమైన క్రీడలలో పాల్గొనేలా చేసింది. ఢాకా యూనివర్శిటీ విద్యార్థిగా అండర్ గ్రాడ్యుయేట్ చదువుతున్న రోజుల్లో చీరతోనే నా ప్రయాణం మొదలైంది. ప్రెజెంటేషన్‌ల కోసం సంప్రదాయ దుస్తులను ధరించమని నా స్నేహితులను ప్రోత్సహించేదాన్ని. అసౌకర్యం అంటూ అయిష్టత చూపేవారు కూడా అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే ఎలాంటి కుట్టు లేకుండా తన అసమానమైన శక్తిని మనలోకి చేర్చే గుణం చీరకు ఉంది.

భద్రతా సమస్యలను సవాల్ చేస్తూ!

సాహసోపేతమైన క్రీడలలో భద్రత చాలా ముఖ్యమైనది. కోచ్‌లు కూడా తమ ప్రోటోకాల్స్ దృష్ట్యా వారు సూచించిన దుస్తులనే ధరించాలంటారు. కానీ, భద్రతా సమస్యలను పరిష్కరించడానికే నేను చీరకట్టుతో సవాల్ చేస్తున్నాను అనే విషయం పట్ల అవగాహన కలిగించి, మరీ ఈ డ్రెస్‌ను ధరించాను. నా అభిరుచి కూడా ఇలాగే కొనసాగుతుంది. స్కైడైవింగ్ సమయంలో చీరకట్టుపై నుంచి బెల్ట్‌తో సెట్ చేసుకున్నాను. పెటికోట్‌కు బదులుగా జీన్స్ ధరించాను. స్నోబోర్డింగ్‌లో నా కదలికకు చీర అంతరాయం కలిగించకుండా, వెచ్చగా ఉండటానికి వేడిచేసిన గేర్ ధరించాను. ఈ జాగ్రత్తల మార్పుతో భద్రతకు భరోసానిస్తూ సాంస్కృతిక ప్రామాణికతను కాపాడుకోవడానికి అనుమతి లభించింది.

ప్రయత్నాలకు ప్రతిస్పందన

చీరతో సాహసోపేతమైన క్రీడా ప్రయత్నాలకు మంచి ప్రతిస్పందన, ప్రశంసలు లభించింది. నా ప్రయత్నం ప్రపంచ వ్యాప్తంగా మంచి ఉత్సుకత రేకెత్తించింది. చాలా మంది ఆశ్చర్యపోయారు. తెల్లటి మంచులో ప్రకాశవంతమైన రంగుల చీరను చూసి ఎంతో మంది అభినందించారు. ఒకసారి, కిమోనోస్‌లో స్నోబోర్డింగ్ చేస్తున్నప్పుడు జపనీస్ జంటను ఎదురుపడింది. వారు ఎన్ని ప్రశ్నలు అడిగారో! ‘సాంస్కృతిక వస్త్రధారణ ఏదైనా అభిరుచిలో భాగమ’ని వారితో నా అనుభవాలను పంచుకున్నాను.

భవిష్యత్తు కోసం

వాటర్ స్కీయింగ్ లేదా చీరలో సర్ఫింగ్ వంటి మెరైన్ స్పోర్ట్స్ గురించి ఆలోచిస్తున్నాను. సాంస్కృతిక వారసత్వాన్ని అత్యాధునిక క్రీడలతో మిళితం చేసి కొనసాగించే అవకాశాలు చాలా ఉన్నాయి. ఆధునిక, అసాధారణమైన మార్గాల్లో సంప్రదాయాలను పరిచయం చేయడానికి, ఎంతోమందిలో స్ఫూర్తి నింపడమే నా లక్ష్యం. దీని వల్ల ఈ సాంస్కృతిక వైభవం ప్రపంచ వస్త్రాలలోనే సుసంపన్నం అవుతుంది. ఇతరులను శక్తివంతం చేయడానికి నా సాహసాన్ని అంకితం చేస్తున్నాను. మహిళలు తమ సాంస్కృతిక దుస్తులను ధరిస్తూనే అసాధారణ క్రీడల్లో పాల్గొనవచ్చు. ఎవరికైనా వారి సొంత ఎంపిక చాలా ముఖ్యం. వారి కంఫర్ట్ జోన్ నుండి బయటపడి కొత్తదాన్ని ప్రయత్నించేలా నా ఈ ప్రయత్నం ఉపయోగపడితే అది వారి వ్యక్తిగత వృద్ధికి దారితీస్తుందని నమ్ముతాను.

సంప్రదాయం మనల్ని బంధించదు. కొత్త మార్గాల్లో ప్రయత్నించేందుకు కొత్త శక్తిని ఇస్తుంది’’ అంటుంది అఫ్సానా.

బ్యూటిప్స్

స్కిన్‌కేర్ ప్యాక్‌లు

- కోడిగుడ్డు సొనలో రెండు టీ స్పూన్ల పన్నీరు, ఒక టీ స్పూన్ తేనె కలిపి ప్యాక్ వేసి ఆరిన తర్వాత వేడినీటితో శుభ్రం చేయాలి. ఇది జనరల్ ప్యాక్. చర్మానికి పోషణను, నునుపుదనాన్ని ఇస్తుంది. ఈ ప్యాక్‌ను వారానికి ఒకసారి వేస్తే చాలు.
- ముడతలు ఉంటే... కోడిగుడ్డులోని తెల్ల సొనను మాత్రమే తీసుకుని చిలికి అందులో మూడు టీ స్పూన్ల ఓట్ పౌడర్, ఒక స్పూను తేనె కలిపి అప్లయ్ చేసి ఆరిన తర్వాత కడిగేయాలి.
- 50 గ్రాముల సోయాబీన్స్‌ను రాత్రంతా నానబెట్టి, ఉదయం గ్రైండ్ చేసి, అందులో ఒక టేబుల్ స్పూన్ పచ్చిపాలను, ఒక టీ స్పూన్ ఆల్మండ్ ఆయిల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లయ్ చేసి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. సోయాబీన్స్‌కు బదులుగా మసూర్ దాల్ వాడవచ్చు.



- ఒక టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు, అర టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ ఆలివ్ ఆయిల్ కలిపి ప్యాక్ వేసి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇది మైల్డ్ బ్లీచ్‌గా పని చేస్తుంది. ముఖానికి నునుపుదనాన్నిస్తుంది. క్రమం తప్పకుండా వారానికి కనీసం రెండుసార్ల చొప్పున వేస్తుంటే అవాంఛిత రోమాలు రాలిపోతాయి.

కిచెన్ టిప్స్

- ఉడికించి దించిన తర్వాత కోడిగుడ్లను ఐదు నిమిషాల సేపు చన్నీటిలో ఉంచితే పెంకు సులభంగా వస్తుంది.
- గుడ్లు ఎక్కువ రోజులు నిలవ ఉండాలంటే... ఒక పాత్రలో గుడ్లను ఉంచి అవి మునిగే వరకు చన్నీటిని పోసి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- ఉడికించిన గుడ్లను ముక్కలు చేయాలంటే... కోసేముందు చాకును వేడి నీటిలో ముంచాలి. అప్పుడు గుడ్డు పలుకులుగా ఊడిపోకుండా కరెక్ట్‌గా కట్ అవుతుంది.



యూత్ ప్లస్

సోషల్ మీడియాతో యువతరాన్ని విడదీసి
చూడలేని కాలం ఇది. ‘డిజిటల్ నెటిజన్స్’గా పేరున్న
యువతరానికి సోషల్ మీడియాకు సంబంధించి ఎలాంటి
ఆసక్తులు ఉన్నాయి? కంటెంట్ క్రియేషన్‌ను ఇష్టపడుతున్నారా?
‘వ్యూయర్’గా ఉండడానికి ఇష్టపడుతున్నారా?
బలం తెచ్చుకుంటున్నారా? బలహీనపడుతున్నారా?

వెలుగు నీడల దారుల్లో....



సోషల్ మీడియా అనేది యువత దైనందిన జీవితంలో విడదీయరాని భాగం అయింది. ‘మా పిల్లలు సోషల్ మీడియాకు ఎడిక్ట్ అవుతున్నారు’ అంటున్న తల్లిదండ్రుల సంఖ్య తక్కువేమీ లేదు.

‘సోషల్ మీడియాలో ఎంత టైమ్ గడుపుతున్నారు?’ అనేది ఒక కోణం అయితే అసలు అక్కడ ఏం చేస్తున్నారు? అనేది మరో కోణం. ఈ అంశంపై కొన్ని డిజిటల్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్స్ సర్వే నిర్వహించాయి.

తమ సొంత కంటెంట్‌ను పోస్ట్ చేయడం కంటే యువతలో ఎక్కువమంది ఇతరుల పోస్టులను చదవడం, కామెంట్ చేయడంపై ఆసక్తి చూపిస్తున్నారు. 21 శాతం మాత్రమే కంటెంట్ క్రియేటర్‌లుగా ఉండడానికి ఇష్టపడుతున్నారు. 79 శాతం మంది ‘వ్యూయర్స్’గా ఉండడానికి ఇష్టపడుతున్నారు. కంటెంట్‌ను పోస్టు చేస్తున్న వారిలో రోజూ పోస్ట్ చేస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉంటోంది.

పర్సనల్ గ్రోత్, కెరీర్ ఎంపిక... మొదలైన వాటి విషయంలో సోషల్ మీడియాలోని కంటెంట్ ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటున్నారు కొందరు. రకరకాల డొమైన్స్‌లో కొత్తగా వస్తున్న ట్రెండ్స్ గురించి తెలుసుకోవడానికి ఇష్టపడుతున్నారు. సోషల్ మీడియాకు సంబంధించి మిగిలిన దేశాలతో పోల్చితే మన దేశంలో యువ ‘స్పోర్ట్స్ సూపర్ ఫ్యాన్స్’ ఎక్కువ. ఈ సూపర్ ఫ్యాన్స్ క్రికెట్‌కు మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచంలోని ఎన్నో ఆటల గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్నారు.

‘సోషల్ మీడియాను యూత్ ఎలా ఉపయోగించుకుంటుంది?’ అనేదాన్ని పక్కన పెడితే... సోషల్ మీడియా ఎడిక్షన్ విషయంలో ‘ఎవరో చెప్పేవరకు ఎందుకు... మన గురించి మనం తెలుసుకుందాం’ అనే ధోరణి యువతలో పెరుగుతుండడం శుభసూచకం.

‘సోషల్ మీడియాలో ఎంత ఎక్కువ సేపు ఉంటే అంత అప్‌డేట్ అవుతాం’ అనే భ్రమకు దూరంగా జరుగుతున్నారు.

‘ప్రతి అంశానికి మంచి, చెడులు ఉంటాయి. మనం ఎలా ఉపయోగించుకుంటున్నాం అనేదాని పైనే మంచి, చెడు ఆధారపడి ఉంటాయి’ అంటుంది ఎంబీఏ స్టూడెంట్ తాన్వీ అగర్వాల్.

ముంబైకి చెందిన తాన్వీ ఒకప్పుడు సోషల్ మీడియానే ప్రపంచంగా ఉండేది. తాను సోషల్ మీడియాకు ఎడిక్ట్ అవుతున్న విషయం గ్రహించాక ‘ఒకరోజులో ఇంత సమయం మాత్రమే’ అని టైమ్ సెట్ చేసుకుంది.

‘సోషల్ మీడియాకు ఎడిక్ట్ కావడం వల్ల నా చదువు దెబ్బతింది. చదివే సమయంలో సోషల్ మీడియాలో చదివిన పోస్టులు, చూసిన వీడియోలు గుర్తుకు వస్తుంటాయి. ఆలోచనలు అటు వైపు మళ్లుతుంటాయి. ఏకాగ్రత దెబ్బతింటుంది’ అంటుంది తాన్వీ అగర్వాల్.

సోషల్ మీడియాను ఎంతసేపు, ఎలా వాడుకోవాలి అనేది ఒక కోణం అయితే ‘నైతికత’ అనేది మరో కోణం.

లక్నోకు చెందిన వైశాలి ఒకప్పుడు మీమ్స్‌ను తెగ ఎంజాయ్ చేసేది. అయితే ‘బ్యాడ్ టేస్ట్ ఇన్ మీమ్స్’ అనే పోస్ట్ చదివిన తరువాత ఆమెలో మార్పు వచ్చింది.

ఇప్పుడు ఆమె రిలేటబుల్ కంటెంట్, గుడ్ మీమ్స్‌ను మాత్రమే ఇష్టపడుతుంది.

‘మీమ్స్ ద్వారా క్రూరత్వాన్ని ప్రదర్శించవద్దు. మీమ్స్ అనేవి హాయిగా నవ్వుకునేలా ఉండాలి’ అంటుంది వైశాలి.

బ్రాండ్ల ఎంపికకు సంబంధించి సోషల్ మీడియాపై ఎక్కువ ఆధారపడుతుంది యువతరం. కాస్తో కూస్తో వచ్చిన మార్పు ఏమిటంటే ఇప్పుడు బ్రాండ్‌ల నుంచి జవాబుదారీతనాన్ని ఆశిస్తున్నారు. ఫలానా బ్రాండ్ పర్యావరణం హితం అంటే ఆ బ్రాండ్ వైపు మొగ్గుచూపుతున్నారు.

స్థూలంగా చెప్పాలంటే... ‘సోషల్ మీడియాతో బలం తెచ్చుకుంటున్నామా? బలహీనపడుతున్నామా?’ అనేది పూర్తిగా మన అవగాహన, ఆలోచన ధోరణి మీదే ఆధారపడుతుంది. ఉదాహరణకు... ఫోర్బ్స్ హెల్త్ అండ్ వన్‌పోల్ సర్వే ప్రకారం సోషల్ మీడియాలో 53 శాతం మంది తమ నవ్వును ఇతరులతో పోల్చి చూసుకుంటున్నారు.

‘అయ్యో! అలా అందంగా నవ్వలేక పోతున్నానే’ అని అవతలి వ్యక్తితో పోల్చుకొని బాధ పడుతున్న వారే ఎక్కువ.

పలువరుస అందంగా కనిపించడానికి సోషల్ మీడియాలోని తమ ఫోటోలను ఎడిట్ చేస్తున్నవారు, పలువరుస బాగోలేదని ఫొటోను హైడ్ చేస్తున్నవారూ ఉన్నారు.

‘నవ్వు విషయంలో నా ఆత్మవిశ్వాసాన్ని సోషల్ మీడియా దెబ్బతిస్తోంది’ అంటున్నారు 45 శాతం మంది.

సోషల్ మీడియా అనే ప్రపంచంలో ...చిన్న నవ్వు విషయంలోనూ ఆత్మవిశ్వాసం లోపించిన వారు ఉన్నారు. ప్రయోజనకరమైన కంటెంట్‌తో తిరుగులేని ఆత్మవిశ్వాసంతో తమను తాము నిరూపించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నవారు ఉన్నారు. ఏ దారిలో వెళుతున్నామనేది పూర్తిగా మన ఆలోచనలపై ఆధారపడి ఉంటుంది. మార్పు గురించి చెప్పుకోవాల్సి వస్తే... ‘నేను ఏ దారిలో వెళుతున్నాను. ఇది సరియైనదేనా?’ అనే స్వీయ విశ్లేషణ ధోరణి యువతరంలో పెరుగుతోంది.

నేడు అనీ ఫ్రాంక్ జయంతి


నీ గొంతు ఇప్పుడూ అవసరమే

‘నేను నా చుట్టూ ఉన్న వాళ్లనే కాదు...
ఎప్పుడూ ఎరగని వాళ్లను కూడా సంతోషంగా
ఉంచదలుచుకున్నాను’
అని రాసుకుంది అనీ ఫ్రాంక్.
యూదుల మీద హిట్లర్ దమనకాండ సాగిస్తున్నప్పుడు
14 ఏళ్ల యూదు బాలిక అనీ ఫ్రాంక్ రాసిన
జగద్విఖ్యాత డైరీనే ‘అనీ ఫ్రాంక్ డైరీ’.
ఇవాళ పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దాడి
ఉక్రెయిన్ మీద రష్యా దాడి
ఇవన్నీ పిల్లల్ని పౌరుల్ని దారుణంగా చంపుతున్నప్పుడు
‘మానవత్వం కోసం అనీ చేసిన ప్రార్థన’
గుర్తు చేసుకోక తప్పదు.



అనీ ఫ్రాంక్

అనీ ఫ్రాంక్ పుట్టింది జూన్ 12, 1929లో. ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వలస వచ్చి ఆమ్‌స్టర్‌డామ్‌లో స్థిరపడ్డ యూదు కుటుంబం వారిది. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకైన పిల్ల అనీ ఫ్రాంక్. ఆమె పదమూడవ జన్మదినాన- అంటే జూన్ 12, 1942న తండ్రి ఆమెకు ఒక డైరీని కానుకగా ఇచ్చాడు. పుట్టిన రోజుకు ముందు ఆమ్‌స్టర్‌డామ్‌లో తండ్రితో షాపింగ్‌కి వెళ్లిన అనీకి బౌండ్ చేసిన నోట్‌బుక్ కనిపించింది. ‘అది నాకు అది కావాలి నాన్నా’ అని తండ్రిని అడిగితే బర్త్ డే గిఫ్ట్‌గా కొనిచ్చాడు. ఆ నోట్ బుక్‌ని ఎంతో ఇష్టపడ్డ అనీ దానిని డైరీగా భావించి రోజూ రాయడం మొదలుపెట్టింది.



రహస్య జీవితం

రెండో ప్రపంచ యుద్ధం మొదలైన మూడేళ్లకు హిట్లర్ సేన నెదర్లాండ్స్‌ను హస్తగతం చేసుకుంది. ఆమ్‌స్టర్‌డామ్‌లో ఉన్న యూదులను అరెస్ట్ చేస్తున్నారు. అది తెలిసిన వెంటనే- జూలై 5, 1942 రాత్రి అనీ తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని అదే ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఒక దినుసుల కర్మాగారంలో రహస్య గదుల్లోకి చేరారు. దాని యజమాని యూదుల సానుభూతి పరుడు. కొంతమంది మిత్రులు రహస్యంగా అందించే ఆహారాన్ని వాడుకుంటూ అనీ ఫ్రాంక్ కుటుంబం నాజీ పోలీసులకు పట్టుబడే వరకు అంటే ఆగస్టు 4, 1944 వరకు- రెండేళ్ల 35 రోజులు రహస్య గదుల్లోనే గడిపింది. ఆ మొత్తం రోజులూ అనీ ఫ్రాంక్ డైరీ రాసింది. పట్టుబడ్డాక అనీ ఫ్రాంక్‌ను నవంబర్ 1, 1944న కాన్సన్‌ట్రేషన్ క్యాంపుకు తరలించారు. తీవ్రమైన ఆకలితో, చలికి వణుకుతూ కాన్సన్‌ట్రేషన్ క్యాంపులో 1945 ఫిబ్రవరి- మార్చిల మధ్యన విష జ్వరంతో మరణించింది అనీ ఫ్రాంక్.

ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్

అనీ రాసిన డైరీ తొలిసారి 1946లో మార్కెట్‌లో విడుదలై సంచలనం రేపింది. డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్’ పేరుతో ప్రతి దేశంలో ప్రతి భాషలో అనువాదం అయ్యింది. తాను డైరీ రాస్తున్న కాలంలో నాజీలు యూదులను దారుణంగా హతమారుస్తున్నా, రహస్య స్థలంలో తాము తిండికీ బట్టకూ అల్లాడుతున్నా అనీ ఎవరినీ ద్వేషించలేదు. అడుగడుగునా మనిషి మీద నమ్మకం ఉంచింది. ‘ఇంత చేస్తున్నా మనిషి మంచివాడనే నేను నమ్ముతాను’ అని రాసుకుంది. ‘నేను బాగా చదువుకోవాలి. జర్నలిస్టును కావడం నా లక్ష్యం. ఒకవేళ నాకు వార్తాపత్రికలకు రాసే ప్రావీణ్యం లేకున్నా నా కోసం నేను రాసుకుంటాను. చాలామంది ఆడవాళ్లలా శ్రమకు ఏమాత్రం గుర్తింపు లేని ఇంటి పని చేయలేను. భర్తకు, పిల్లలకు జీవితాన్ని అంకితం చేయడం కన్నా ఇంకా ఎక్కువగా నాకు నా జీవితం కావాలి. సమాజానికి నేనేదైనా చేయాలి. మనుషుల సంతోషానికి నేనొక కారణం కావాలి. చనిపోయాక కూడా నేను జీవించే ఉండాలి’ అని రాసుకుంది అనీ.

ద్వేషం వద్దనేదే ఆనా సందేశం

మనిషికి సాటి మనిషి మీద ద్వేషం ఎంతదూరమైనా తీసుకెళుతుందని రెండో ప్రపంచ యుద్ధం నిరూపించింది. హిట్లర్ విద్వేష ప్రభావానికి లోనైన నాజీలు 1941–1945 మధ్య 60 లక్షల మంది యూదులను నిర్మూలించారు. గ్యాస్ చాంబర్స్‌లో వేసి చంపారు. ఏ యూదులైతే నాజీల వల్ల కష్టాలు పడ్డారో అదే యూదులు నేడు పాలస్తీనా బాలల శోకానికి కారణం కావడం విషాదం. అక్కడ వేలాది మంది చిన్నారులు మరణించారు, తల్లిదండ్రులను కోల్పోయారు. ఆ పిల్లలు ఎందరు అనీ ఫ్రాంక్‌లా భవిష్యత్తులో తమ డైరీలను ప్రపంచానికి చాటుతారో!

ఈ ప్రపంచాన్ని పిల్లలకు యోగ్యమైనదిగా పెద్దలు అనుక్షణం తీర్చిదిద్దుతూ ఉండాలి. పిల్లలు ఇష్టపడేది ప్రేమనే. అంటే ప్రపంచాన్ని ప్రేమతో నింపాలి. ఇక్కడ ద్వేషానికి చోటు లేదని నిరూపించాలి. అది జరిగేంత వరకూ మబ్బుల చాటున దాగి ఆనా తన సందేశం వినిపిస్తూనే ఉంటుంది.



యూకీ-ఒలివెట్టి జోడీ సంచలనం

స్టుట్‌గార్ట్‌లో జరుగుతున్న బాస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 6–4, 6–2తో రెండో సీడ్ నీల్ స్కప్‌స్కీ (బ్రిటన్)–మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీని బోల్తా కొట్టించింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం ఐదు ఏస్‌లు సంధించి, మూడు బ్రేక్ పాయింట్లు సాధించింది.

క్రీడా మంత్రిగా మన్‌సుఖ్ బాధ్యతల స్వీకరణ

కేంద్ర ప్రభుత్వంలో కొత్త క్రీడల మంత్రిగా నియమితులైన మన్‌సుఖ్ మాండవియా మంగళవారం న్యూఢిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రపంచంలో భారత్‌ను మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని వ్యాఖ్యానించారు. 52 ఏళ్ల మన్‌సుఖ్ గుజరాత్‌లోని పోర్‌బందర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. గత ప్రభుత్వంలో క్రీడా శాఖ మంత్రిగా ఉన్న అనురాగ్ ఠాకూర్ ఈసారి ఎన్నికల్లో నెగ్గినా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.





బయటకు వెళ్లిన బంతిని వెనక్కి పంపిన ఖతర్ ప్లేయర్

భారత్ ఆశలు ఆవిరి

ఖతర్ చేతిలో పరాజయం • మూడో రౌండ్‌కు చేరలేకపోయిన టీమిండియా

దోహా: ఫుట్‌బాల్ ప్రపంచకప్–2026 ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భారత జట్టు మూడో రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 1–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. మూడో రౌండ్‌కు చేరాలంటే భారత జట్టు ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సింది. కానీ భారత జట్టు విజయాన్ని అందుకోలేకపోయింది. మరోవైపు అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కువైట్ జట్టు 1–0తో గెలిచింది. దాంతో గ్రూప్ 'ఎ' నుంచి 16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఖతర్... 7 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన కువైట్ మూడో రౌండ్‌కు అర్హత సాధించాయి. 5 పాయింట్లతో భారత్, అఫ్గానిస్తాన్ సంయుక్తంగా మూడో స్థానంలో నిలువగా... మెరుగైన గోల్స్ సగటుతో భారత్‌కు మూడో స్థానం, అఫ్గానిస్తాన్‌కు నాలుగో స్థానం లభించాయి.

రిఫరీ చెత్త నిర్ణయం...

ఖతర్‌తో మ్యాచ్‌లో భారత జట్టుకు 37వ నిమిషంలో లాలియన్‌జువాల్ చాంగ్టె గోల్‌తో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 73 నిమిషాల వరకు భారత్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంది. ఈ దశలో రిఫరీ చెత్త నిర్ణయం కారణంగా ఖతర్ జట్టు ఖాతాలో గోల్ చేరి స్కోరు సమమైంది. 73వ నిమిషంలో యూసుఫ్ ఐమన్ కొట్టిన హెడర్‌ను భారత గోల్‌కీపర్, కెప్టెన్ గుర్‌ప్రీత్ సింగ్ నిలువరించాడు. ఆ తర్వాత బంతి గోల్ లైన్ దాటి బయటకు వెళ్లింది. కానీ అక్కడే ఉన్న ఖతర్ ఆటగాడు హాష్మీ అల్ హుస్సేన్ బంతిని వెనక్కి పంపించగా, యూసుఫ్ ఆ బంతిని లక్ష్యానికి చేర్చాడు. రిఫరీ దీనిని గోల్‌గా ప్రకటించాడు. దాంతో భారత ఆటగాళ్లు నివ్వెరపోయి రివ్యూ చేయాలని రిఫరీని కోరినా ఆయన అంగీకరించకుండా గోల్ సరైనదేనని ప్రకటించాడు. టీవీ రీప్లేలో బంతి గోల్ లైన్ దాటి బయటకు వెళ్లిందని స్పష్టంగా కనిపించినా భారత ఆటగాళ్ల మొరను రిఫరీ ఖాతరు చేయలేదు. ఈ సంఘటనతో భారత బృందం ఏకాగ్రత చెదిరింది. 85వ నిమిషంలో అహ్మద్ అల్‌రావి గోల్‌తో ఖతర్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లి చివరి నిమిషం వరకు దీనిని కాపాడుకొని విజయాన్ని అందుకుంది.

పారిస్ ఒలింపిక్స్‌కు ఇషా సింగ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే భారత రైఫిల్, పిస్టల్ షూటింగ్ జట్టును మంగళవారం ప్రకటించారు. రెండు విభాగాల్లో కలిపి మొత్తం 15 మంది షూటర్లు విశ్వ క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో పోటీపడనుంది. గత ఆసియా క్రీడల్లో, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 19 ఏళ్ల ఇషా సింగ్ 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు గెలిచింది. ఇటీవల నిర్వహించిన ట్రయల్స్‌లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా ఈ బృందాన్ని ఎంపిక చేశారు. షూటింగ్ క్రీడాంశంలో అందుబాటులో ఉన్న 24 బెర్త్‌లకుగాను భారత షూటర్లు 21 బెర్త్‌లు గెల్చుకున్నారు. షాట్‌గన్ విభాగంలో పాల్గొనే భారత జట్టును జూన్ 18న ఇటలీలో ప్రపంచకప్ ముగిశాక ప్రకటిస్తారు.

'హ్యాట్రిక్'పై భారత్ గురి

అమెరికాతో నేడు రోహిత్ బృందం 'ఢీ'

- రెండు విజయాలతో జోరు మీదున్న ఆతిథ్య జట్టు
- పటిష్టమైన బలగంతో టీమిండియా
- రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



న్యూయార్క్: 'హ్యాట్రిక్' విజయంపై గురి పెట్టిన భారత్ టీంతో పాటే టి20 ప్రపంచకప్‌లో 'సూపర్–8' దశకు దర్జాగా చేరుకోవాలనుకుంటుంది. గ్రూప్ 'ఎ'లో బుధవారం జరిగే మ్యాచ్‌లో టీమిండియా... ఆతిథ్య అమెరికాతో తలపడుతుంది. ఈ గ్రూప్‌లో ఇరు జట్లు కూడా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి అజేయంగా ఉన్నాయి. రోహిత్ బృందం వరుస విజయాలు సాధించడంలో పెద్ద విశేషమైతే లేదు కానీ... అమెరికాలాంటి కూన ఓ మాజీ చాంపియన్ పాకిస్తాన్‌ను అదికూడా... 'సూపర్ ఓవర్' దాకా లాక్కొచ్చి మరీ ఓడించడమే పెద్ద సంచలనం. ఎప్పుడైనాగానీ సూపర్ ఓవర్ అనేది మేటి జట్టుకే ఎక్కువ సానుకూలంగా ఉంటుంది. అలాగని భారత్‌పై కూడా మరో సంచలనం కొనసాగిస్తుందని చెప్పలేం. కానీ ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిచినా వారికి 'హ్యాట్రిక్' విజయంతో పాటు 'సూపర్–8' బెర్త్ కూడా దక్కుతుంది.

సూపర్ ఫామ్‌లో...

బంగ్లాదేశ్‌తో మొదలుపెట్టిన ప్రాక్టీస్ మొదలు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ దాకా భారత్ విజయవంతమైంది. ఐర్లాండ్‌తో జరిగిన తొలి లీగ్‌లో ప్రత్యర్థి తక్కువ లక్ష్యం నిర్దేశించడంతో కెప్టెన్ రోహిత్, రిషభ్ పంత్‌ల జోరుతో సులువుగానే ఛేదించారు. అయితే తొలి రెండు మ్యాచ్‌ల్లో 'కింగ్' కోహ్లి, టి20 స్పెషలిస్టు సూర్యకుమార్ యాదవ్ ఏమాత్రం మెరిపించలేకపోయారు. గత రెండు మ్యాచ్‌లకు బాకీ పడిన పరుగుల వానను బహుశా ఈ మ్యాచ్‌లో వడ్డీతో సహా తీర్చేస్తారేమోనని అమెరికాలోని భారత అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్‌లతో కూడిన పేస్ త్రయానికి, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌ల స్పిన్ ద్వయానికి అమెరికా ఎదురునిలవడం అంత సులువు కాదు.

సర్వశక్తులతో...

ఆడుతోంది తొలి వరల్డ్‌కప్పే అయినా అమెరికా ఆట మాత్రం అద్భుతం. కెనడా, పాక్‌లపై సాధించిన విజయాలు ఏమాత్రం గాలివాటం కాదు. మొదట కెనడాపై 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి మరీ గెలిచింది. ఆండ్రీస్ గౌస్, ఆరోన్ జోన్స్ భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. మళ్లీ పాక్‌తో రెండో మ్యాచ్‌లో కెప్టెన్ మోనంక్ పటేల్ అర్ధసెంచరీతో ఆకట్టుకుంటే గౌస్, జోన్స్ 'టై' అయ్యేదాకా పటిష్టమైన పాక్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నారు. ఇటు బౌలింగ్‌లోనూ కెంజిగే, సౌరభ్ నేత్రవాల్కర్, అలీఖాన్, జస్‌దీప్‌లు ఫామ్‌లో ఉండటంతో భారత్‌పై పైచేయి సాధించలేకపోయినా... ఆల్‌రౌండ్ వనరులతో గట్టి పోటీ ఇవ్వాలనే పట్టుదలతో అమెరికా బృందం ఉంది.

పిచ్, వాతావరణం

న్యూయార్క్ పిచ్‌లో ఏ మార్పు లేదు. తక్కువ స్కోర్లే తప్ప మెరుపులకు అంతగా అవకాశమైతే ఉండదు. చేజింగ్ కష్టం కావడంతో టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌కే మొగ్గు చూపడం ఖాయం. వర్షంతో పూర్తిగా ముప్పయితే లేకపోయినా... అంతరాయం తప్పదు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), కోహ్లి, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్. **అమెరికా:** మోనంక్ పటేల్ (కెప్టెన్), స్టీవెన్ టేలర్, ఆండ్రీస్ గౌస్, ఆరోన్ జోన్స్, నితీశ్ కుమార్, కోరె అండర్సన్, హర్మీత్ సింగ్, జస్‌దీప్ సింగ్, కెంజిగె, సౌరభ్, అలీఖాన్.



10 అమెరికాలో భారత జట్టు ఆడిన మొత్తం టి20 మ్యాచ్‌లు. ఇందులో ఎనిమిది మ్యాచ్‌లు ఫ్లోరిడా రాష్ట్రంలోని లాడర్‌హిల్ పట్టణంలో వెస్టిండీస్‌తో జరిగాయి. ఆ ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదింటిలో భారత్ గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. మరో మ్యాచ్ రద్దయింది. ప్రస్తుత ప్రపంచకప్‌లో న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్‌తో, పాకిస్తాన్‌తో భారత్ ఒక్కో మ్యాచ్ విజయం సాధించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X నేపాల్
వేదిక: ఫ్లోరిడా : ఉదయం గం. 5 నుంచి
ఆస్ట్రేలియా X నమీబియా
వేదిక: నార్త్ సౌండ్: ఉదయం గం. 6 నుంచి
భారత్ X అమెరికా
వేదిక: న్యూయార్క్ : రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

గెలిచి నిలిచిన పాక్

రాణించిన రిజ్వాన్, ఆమిర్



రిజ్వాన్

న్యూయార్క్: హమ్మయ్య... పాకిస్తాన్ ఊపిరి పీల్చుకుంది. టి20 ప్రపంచకప్‌లో 'సూపర్–8' దశకు చేరుకునే అవకాశాన్ని సజీవంగా నిలబెట్టుకుంది. గ్రూప్ 'ఎ'లో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 7 వికెట్ల తేడాతో కెనడాపై విజయం సాధించింది. టాస్ నెగ్గిన పాక్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. ఓపెనర్ ఆరోన్ జాన్సన్ (44 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. తర్వాత బ్యాటింగ్ వరుసలో నవ్‌నీత్ (4), పర్గత్ (2), నికోలస్ (1), మొవ్వ శ్రేయస్ (2), రవీందర్‌పాల్ (0) పాక్ బౌలర్లకు దాసోహమయ్యారు. జాన్సన్ 39 బంతుల్లో అర్ధసెంచరీ చేసుకున్నాడు. 14వ ఓవర్లో జట్టు స్కోరు 73 పరుగుల వద్ద ఆరో వికెట్‌గా నిష్క్రమించిన ఆరోన్ ఒక్కడి స్కోరే 52 పరుగులుండటం విశేషం! కెప్టెన్ సాద్ బిన్ జాఫర్ (10), కలీమ్ (13 నాటౌట్) డబుల్ డిజిట్ స్కోరు చేశారు. ప్రత్యర్థి బౌలర్లలో హారిస్ రవూఫ్, మొహమ్మద్ ఆమిర్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్తాన్ 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లలో సయీమ్ అయూబ్ (6) విఫలమవగా.... ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను మొహమ్మద్ రిజ్వాన్ (53 బంతుల్లో 53 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆఖరి దాకా మోశాడు. కెప్టెన్ బాబర్ ఆజమ్ (33 బంతుల్లో 33; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించాడు. ఫఖర్ జమన్ (4)తో జట్టు స్కోరును 100 పరుగులు దాటించాడు. 52 బంతుల్లో రిజ్వాన్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. గెలుపు వాకిట ఫఖర్ నిష్క్రమించగా, ఉస్మాన్ ఖాన్ (2 నాటౌట్)తో కలిసి మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. ప్రస్తుతం ఈ గ్రూప్‌లో భారత్, అమెరికా చెరో 4 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. పాక్ (2), కెనడా (2) మూడు, నాలుగో స్థానంలో ఉన్నాయి.

సినిమా

దీపావళికి కుబేర?



• నాగార్జున

ఈ దీపావళికి థియేటర్స్‌లోకి రానున్నాడట 'కుబేర'. ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోనాలీ నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నాగార్జున–ధనుష్ పాల్గొనగా ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారట. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి రిలీజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందని తెలిసింది.

జ్ఞానం కోసం వెతకండి



• సమంత

'మీకు జ్ఞానం కావాలంటే ఈ ప్రపంచాన్ని వెతకండి' అంటున్నారు సమంత. ఆ మధ్య వరుస సినిమాలతో ఫుల్ స్వింగ్‌లో ఉన్న ఆమె కొంత కాలంగా తరచుగా ఆధ్యాత్మిక చింతనలో కనిపిస్తున్నారు. తెలుగులో 'ఖుషి' (2023) మూవీ తర్వాత ప్రస్తుతం సమంత ఏ సినిమాలోనూ నటించడం లేదు. గతేడాది మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకున్న ఆమె పూర్తిగా ఆరోగ్యంపైనే దృష్టి పెట్టారు. అందులో భాగంగానే ఆధ్యాత్మిక సేవను అనుసరిస్తున్నారు. తరచుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఉన్న ఇషా ఫౌండేషన్‌కి వెళుతుంటారు సమంత. తాజాగా ఇషా ఫౌండేషన్‌లో నిర్వహించిన రిలాక్సింగ్ సెషన్‌లో పాల్గొన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, తన అనుభవాలను పంచుకున్నారు సమంత. ''మనలో చాలామంది మంచి గురువు కోసం వెతుకుతాం. మన జీవితంలో వెలుగులు నింపి మనల్ని సరైన మార్గంలో నడిపించే వ్యక్తిని కనుగొనడానికి మించిన ప్రత్యేకమైనది మరొకటి ఉండదు. ఎందుకంటే వాళ్ల జ్ఞానం మనల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అయితే జ్ఞానం కావాలంటే ప్రపంచం నలుమూలలా వెతకాల్సిందే. దైనందిన జీవితంలో పడి చాలా విషయాల గురించి మనం తెలుసుకోం. కానీ, సరైన జ్ఞానాన్ని కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. అలాగే జ్ఞానం గురించి తెలుసుకుంటే సరిపోదు. మనం నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవితంలో ఉపయోగించుకోవడం చాలా ముఖ్యం'' అంటూ పోస్ట్ చేశారు సమంత. ఇదిలా ఉంటే తన నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని నిర్మించనున్నట్లు ఏప్రిల్‌లో సమంత ప్రకటించిన విషయం తెలిసిందే.



• ధ్యానంలో...

హిట్ జోడీ షురూ

హీరో రవితేజ 75వ సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'ధమాకా' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల ఈ చిత్రం కోసం రెండోసారి జోడీ కట్టారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మంగళవారం ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కి శ్రీలీల క్లాప్ కొట్టగా, భాను దర్శకత్వం వహించారు. ''వినోదంతో కూడిన పూర్తి స్థాయి మాస్ పాత్రలో రవితేజను చూడాలని అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. 'ఆర్‌టీ 75' చిత్రంతో అభిమానుల ఆకాంక్ష నెరవేరుతుంది. 'ధమాకా' విజయంలో కీలక పాత్ర పోషించిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో 'ఆర్‌టీ 75'కి సంగీతాన్ని సమకూరుస్తున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న.



• రవితేజ, శ్రీలీల

నెమలి కనబడటం నాకో పాజిటివ్ సైన్!



• జ్ఞాన శేఖర్

సుధీర్‌బాబు హీరోగా జ్ఞానసాగర్ దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'హరోం హర'. ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో జ్ఞానశేఖర్ మాట్లాడుతూ –''కుప్పం నేపథ్యంలో సాగే పీరియాడికల్ ఫిల్మ్ ఇది. కుప్పంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేసే ఓ మామూలు కుర్రాడు సుబ్రహ్మణ్యం ఎందుకు గన్స్ మేకింగ్‌లో ఇన్‌వాల్వ్ కావాల్సి వచ్చింది? ఆ తర్వాత అతని జీవితం ఏ విధంగా మలుపు తిరిగింది? అన్నదే ఈ సినిమా కథ. ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. మంచి ఫాదర్ ఎమోషన్ కూడా ఉంది. నేను సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తుణ్ణి. అందుకే ఈ సినిమాకు 'హరోం హర' టైటిల్, హీరోకు సుబ్రహ్మణ్యం అని పేరు పెట్టాను. ఈ సినిమా షూటింగ్ జరిగిన ప్రతి లొకేషన్‌లో మాకు నెమలి కనిపించింది. దీన్ని ఓ పాజిటివ్ సైన్‌గా తీసుకున్నాను. సుధీర్‌బాబుగారు అద్భుతంగా నటించారు. కథని నమ్మి, గ్రాండ్‌గా నిర్మించిన నా ఫ్రెండ్ సుమంత్‌కి ధన్యవాదాలు. ఈ సినిమాను ముందు పాన్ ఇండియాగానే అనుకున్నాం. అయితే ఇతర భాషల్లో డైలాగ్స్ సరిగ్గా కుదరలేదనిపించింది. నాకు నాలుగు భాషలు వచ్చు. నేనే కూర్చుని, పర్ఫెక్ట్‌గా చేయించాలంటే సినిమా రిలీజ్‌కు చాలా టైమ్ పడుతుంది. అందుకే పాన్ ఇండియా రిలీజ్ వద్దనుకున్నాం'' అన్నారు.

తెరపైకి కిరణ్ బేడీ జీవితం



• కుశాల్ చావ్లా

భారతదేశపు తొలి మహిళా ఐపీఎస్ ఆఫీసర్ కిరణ్ బేడీ జీవితం వెండితెరపైకి రానుంది. 'బేడీ: ది నేమ్ యు నో.. ది స్టోరీ యూ డోన్ట్' అనే టైటిల్‌తో ఆమె బయోపిక్ తెరకెక్కనుంది. 'వన్ వే, అనదర్ టైమ్' వంటి చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న దర్శక–నిర్మాత, రచయిత కుశాల్ చావ్లా ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. డ్రీమ్ స్లేట్ పిక్చర్స్ పతాకంపై గౌరవ్ చావ్లా ఈ సినిమాను నిర్మించనున్నారని, వచ్చే ఏడాది ఈ సినిమా విడుదలయ్యేలా ప్లాన్ చేస్తున్నారని టాక్. ''కిరణ్ బేడీగారు జీవితంలో ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాత్రమే కాదు... ఆమె జీవితంలోని వ్యక్తిగత, వృత్తిపరమైన అంశాలను కూడా ఈ సినిమాలో చూపించబోతున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఇక 1966లో జాతీయ జూనియర్ టెన్నిస్ చాంపియన్‌గా వార్తల్లో నిలిచారు కిరణ్ బేడీ. ఆ తర్వాత ఐపీఎస్ ఆఫీసర్‌గా ఎన్నో సంస్కరణలు చేశారు. పాండిచ్చేరికి లెఫ్టినెంట్ గవర్నర్‌గా చేశారు. అలాగే రామన్ మెగసెసే అవార్డ్స్‌తో పాటు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు కిరణ్ బేడీ. ఇక వెండితెరపై ఆమె పాత్రను ఎవరు చేస్తారు? అనేది చిత్రబృందం ప్రకటించలేదు.

ఈ టీమ్‌ని చూస్తే ముచ్చటేసింది

– విశ్వక్ సేన్

''ప్రతిభ ఉన్న యువతకు సీ స్పేస్ అనే సంస్థ ద్వారా మంచి వేదిక సృష్టించాడు నవదీప్. నా తోటి నటీనటుల్లో నేను గౌరవించే వాళ్లలో చాందినీ చౌదరి ఒకరు. తను ఎప్పుడూ టెన్షన్ పడుతుంటుంది. 'యేవమ్'తో తనకి ఆ భయం పోయింది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా హాజరైన విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''యేవమ్' లాంటి ఫీమేల్ ఓరియంటెడ్ చిత్రానికి మహిళా సంగీత దర్శకురాలు, మహిళా ఎడిటర్ పని చేయడం హ్యాపీగా ఉంది. ఈ టీమ్‌కి ఈ చిత్రం మంచి బ్రేక్ అవ్వాలి'' అన్నారు. ''యేవమ్' చూశాను. ఇంటర్వెల్, పతాక సన్నివేశాలు మైండ్ బ్లోయింగ్‌గా ఉంటాయి'' అన్నారు మరో అతిథి, డైరెక్టర్ సందీప్ రాజ్. ''ఈ మూవీలో నాది పోలీస్ పాత్ర అనగానే యాక్షన్ ఓరియంటెడ్ అనుకున్నాను. అయితే యాక్షన్ పాటు అన్ని షేడ్స్ నా పాత్రలో ఉన్నాయి'' అన్నారు చాందిని. ''మంచి ఇంటెన్స్‌తో నిజాయితీగా చేసిన సినిమా 'యేవమ్'' అన్నారు నవదీప్. ''ఇదొక ఇంట్రెస్టింగ్ ఎంటర్‌టైనింగ్ థ్రిల్లర్'' అన్నారు ప్రకాశ్ దంతులూరి.




• విశ్వక్ సేన్, చాందిని, నవదీప్



నటుడు అర్జున్ కుమార్తె, నటి ఐశ్వర్య వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. తమిళ నటుడు, దర్శకుడు తంబి రామయ్య కుమారుడు, యువ నటుడు ఉమాపతితో ఐశ్వర్య వివాహం జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల సమక్షంలో చెన్నైలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ఈ వేడుక జరిగింది. ఐశ్వర్య–ఉమాపతిలది ప్రేమ వివాహం. వీరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించడంతో గత ఏడాది అక్టోబర్‌లో నిశ్చితార్థం జరిగింది. కాగా ఈ నెల 14న చెన్నై లీలా ప్యాలెస్‌లో ఐశ్వర్య–ఉమాపతిల వివాహ రిసెప్షన్ జరగనుంది.

అక్టోబరులో అకాడమీ వేడుక



• క్వెంటిన్ టరంటినో



• మెస్కల్



• మోరెనో

లాస్ ఏంజిల్స్‌లో ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న నాలుగో అకాడమీ మ్యూజియమ్ గాలా వేడుకలో దర్శకుడు క్వెంటిన్ టరంటినో, నటుడు పాల్ మెస్కల్, నటి రీటా మోరెనో అవార్డులు అందుకోనున్నారు. వాంటేజ్ అవార్డుకు మెస్కల్, ఐకాన్ అవార్డు కోసం మోరెనో, ల్యూమినరీ అవార్డుకు క్వెంటిన్‌ను ఎంపిక చేశారు. ''తరాలుగా ప్రపంచవ్యాప్త సినిమాకు సేవలందిస్తూ, ఆర్టిస్టులకు, ఫిల్మ్ మేకర్స్‌కు ప్రేరణగా నిలుస్తున్న ఈ ముగ్గురినీ ఈ ఏడాది సత్కరించనున్నాం. అక్టోబరు 19న ఈ వేడుక జరుగుతుంది'' అని అకాడమీ మ్యూజియమ్ గాలా అధ్యక్షురాలు అమీ హోమ్మా పేర్కొన్నారు. కాగా ఈ అకాడమీ మ్యూజియమ్ గాలా అవార్డులను విరాళాల సేకరణ కోసం ఆరంభించారు. 2021లో ఈ మ్యూజియమ్ ఆరంభమైంది. గడచిన మూడేళ్లుగా అవార్డులు ప్రదానం చేస్తున్నారు. ఈ వేడుక నుంచి లభించిన నగదును స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా అందిస్తారు. ఇక లాస్ ఏంజిల్స్‌లో ఉన్న ఈ మ్యూజియమ్‌లో సినిమాల కోసం ప్రముఖ హాలీవుడ్ స్టార్స్ వాడిన ప్రత్యేకమైన దుస్తులు, ఆయుధాలు, ఇతర వస్తువులను సందర్శనకు ఉంచారు.

రాజా వస్తున్నాడు



• నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. ఈ చిత్రంలో సంపద హీరోయిన్. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో చింతపల్లి రామారావు, ఎమ్. సుబ్బారెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ– ''అన్ని కమర్షియల్ హంగులు ఉన్న సినిమా ఇది. సెన్సార్ పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. రావు రమేశ్, నరేష్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: కైలాష్ మీనన్, కెమెరా: దాము నర్రావుల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
33	6
76,457	23,265

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,235	△	30
డోజోన్స్	38,584	▽	285
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,148	▽	81
డాక్స్	18,370	▽	125
షాంఘై	3,028	▽	23
నికాయ్	39,135	△	97

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
71,445	△	269
బంగారం (99.5 స్వచ్ఛత)		
71,159	△	268
వెండి (కిలో)		
87,708	▽	1,220

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.74	85.42
£	బ్రిటన్ పౌండ్	104.05	108.97
€	యూరో	87.48	91.98
¥	జపాన్ ఎన్ (100)	40.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.72	57.56
S$	సింగపూర్ డాలర్	59.43	64.11
SAR	సౌదీ రియాల్	21.39	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	21.87	23.65
¥	చైనా యువాన్	10.40	12.47

సీసీఐఎల్ ఐఎఫ్ఎస్‌సీలో బీవోఐకు 6 శాతం వాటాలు



న్యూఢిల్లీ: గిఫ్ట్ సెజ్‌లో లిస్టయిన సీసీఐఎల్ ఐఎఫ్ఎస్‌సీలో 6.125 శాతం వాటా కొనుగోలు చేసినట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఈడీ (ఇంటర్నేషనల్ ఆపరేషన్స్) సుబ్రత్ కుమార్ తెలిపారు. ఇందుకోసం రూ. 6.125 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రమోట్ చేస్తున్న సీసీఐఎల్ ఐఎఫ్ఎస్‌సీ **సంస్థ**.. గిఫ్ట్ సిటీలో రియల్ టైమ్ కరెన్సీ సెటిల్‌మెం**ట్ సిస్ట**మ్‌ను రూపొందించి, నిర్వహించాల్సి **ఉంటుంది.** ఇది గిఫ్ట్ సిటీకి క్లియరింగ్ హౌస్, సిస్ట**మ్ ఆపరే**టర్‌గా వ్యవహరిస్తుంది.

కాగ్నిజెంట్ చేతికి బెల్కాన్



డీల్ విలువ రూ.10,861 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ రంగంలో ఉన్న యూఎస్ సంస్థ కాగ్నిజెంట్ తాజాగా డిజిటల్ ఇంజనీరింగ్ కంపెనీ బెల్కాన్‌ను కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించింది. డీల్ విలువ రూ.10,861 కోట్లు. బెల్కాన్‌ను ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ ఏఈ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్స్ ప్రమోట్ చేస్తోంది. ఈ డీల్ ద్వారా 190 బిలియన్ డాలర్ల ఇంజనీరింగ్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ (ఈఆర్‌అండ్‌డీ) సర్వీసెస్ రంగంలో విస్తరించాలన్నది కాగ్నిజెంట్ ఆలోచన. అలాగే ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, మెరైన్ రంగాల్లో అడుగుపెట్టాలని భావిస్తోంది. ఈఆర్‌అండ్‌డీ సర్వీసుల మార్కెట్లో సంస్థ స్థానం మరింత బలపడుతుందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవి కుమార్ తెలిపారు. కాగ్నిజెంట్‌కు ఇది రెండవ అతిపెద్ద డీల్‌గా నిలిచింది. 2014లో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ట్రైజెట్టో కొనుగోలుకు 2.7 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఇక బెల్కాన్‌కు అంతర్జాతీయంగా 60 ప్రాంతాల్లో 10,000 పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. బోయింగ్, జనరల్ మోటార్స్, రోల్స్ రాయిస్, యూఎస్ స్పేస్ ఏజెన్సీ అయిన నాసా, యూఎస్ నేవీ వంటి దిగ్గజ సంస్థలకు సేవలు అందిస్తోంది.


నిలకడగా భారత్ వృద్ధి



ప్రపంచ బ్యాంక్ రిపోర్టు

న్యూఢిల్లీ: అధిక బేస్‌తో పోలిస్తే కాస్త నెమ్మదించినప్పటికీ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందే ఎకానమీగా భారత్ కొనసాగుతుందని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే మూడేళ్ల పాటు నిలకడగా 6.7 శాతం వృద్ధి నమోదు చేయగలదని తెలిపింది. పెట్టుబడుల వృద్ధి కాస్త నెమ్మదించినా గతంలో అంచనా వేసిన దానికన్నా పటిష్టంగానే ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు తెలిపింది. 2023-24లో భారత్ వృద్ధి రేటు 8.2 శాతంగా **నమోదైం**ది. మరోవైపు, 2024లో ప్రపంచ వృద్ధి **రేటు** 2.6 శాతంగా ఉండొచ్చని, 2025-26లో స్వల్పంగా 2.6 శాతం స్థాయికి చేరవచ్చని నివేదిక తెలిపింది. కోవిడ్-19కి ముందు దశాబ్దంలో నమోదైన 3.1 శాతం సగటుతో పోలిస్తే ఇది తక్కువే కావడం గమనార్హం. దక్షిణాసియా ప్రాంతంలో వృద్ధి 2023లో నమోదైన 6.6 శాతంతో పోలిస్తే ఈ ఏడాది కొంత తగ్గి 6.2 శాతంగా ఉండొచ్చని అంచనా. ఇటీవలి కాలంలో సాధించిన అధిక వృద్ధి రేటు బేస్‌తో పోలిస్తే భారత్ వృద్ధి కొంత నెమ్మదించే అవకాశాలు ఇందుకు కారణమని నివేదిక వివరించింది.

రైల్ షేర్ల పరుగు- మార్కెట్ ఫ్లాట్



- సెన్సెక్స్ 33 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 6 పాయింట్లు ప్లస్
- 76,457- 23,265 వద్ద ముగింపు

ముంబై: గత వారం సరికొత్త రికార్డులు నెలకొల్పుతూ ర్యాలీ చేసిన దేశీ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 33 పాయింట్లు క్షీణించి 76,457 వద్ద నిలవగా.. 6 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ 23,265 వద్ద స్థిరపడింది. అయితే ఆటుపోట్ల మధ్య కదిలిన మార్కెట్లు మిడ్‌సెషన్‌కల్లా జోరందుకున్నాయి. సెన్సెక్స్ 370 పాయింట్లు ఎగసి 76,861కు చేరగా.. నిఫ్టీ 130 పాయింట్లు బలపడి 23,389ను అధిగమించింది. ఒక దశలో సెన్సెక్స్ 76,297, నిఫ్టీ 23,207 పాయింట్ల దిగువన కనిష్టాలను తాకాయి. ఎన్ఎస్ఈలో మీడియా, ఆయిల్, రియల్టీ 2-1 శాతం మధ్య వృద్ధి చూపగా.. హెల్త్‌కేర్ 0.5 శాతం తగ్గింది. బ్లూచిప్స్‌లో ఓఎన్‌జీసీ 5.7 శాతం జంప్‌చేయగా.. టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, అదానీ పోర్ట్స్, మారుతీ, అల్ట్రాటెక్ 2-1 శాతం మధ్య ఎగశాయి. మరోపక్క కొటక్ బ్యాంక్, దివీస్, ఐటీసీ, రిలయన్స్, డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా 1.3-0.8 శాతం మధ్య డీలాపడ్డాయి.

చిన్న షేర్లు అప్

అశ్వినీ వైష్ణవ్ రైల్వే మంత్రిగా కొనసాగనుండటంతో రైల్వే రంగ కౌంటర్లు స్పీడందుకున్నాయి. ఎన్ఎస్ఈలో రైల్‌టెల్ 9%, ఇర్కాన్ 8%, టెక్స్‌మాకో 7 శాతం, జూపిటర్ వేగన్స్ 6%, ఐఆర్‌సీటీసీ, ఆర్‌వీఎన్ఎల్ 4 శాతం, ఐఆర్ఎఫ్‌సీ 2 శాతం చొప్పున ఎగశాయి. అయితే కెర్నెక్స్ మైక్రో 4.2 శాతం పతనమైంది. కాగా, బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ దాదాపు 1 శాతం బలపడ్డాయి.

కొత్త కనిష్టానికి రూపాయి @ 83.59

దేశీ కరెన్సీ డాలరుతో మారకంలో కొత్త కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 9 పైసలు నీరసించి 83.59 వద్ద ముగిసింది. 83.49 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో 83.59కు జారింది. అక్కడే స్థిరపడింది. ప్రపంచ కరెన్సీలతో మారకంలో డాలరు బలపడటానికితోడు.. చమురు ధరలు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ ప్రభావం చూపింది.

ఇండిగోలో ప్రమోటర్ వాటాల విక్రయం



న్యూఢిల్లీ: ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రమోటర్ ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్.. కంపెనీలో తనకున్న వాటాల్లో 2 శాతాన్ని ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. ఈ వాటా విలువ రూ. 3,367 కోట్లు. బీఎస్ఈలో బల్క్ డీల్ డేటా ప్రకారం ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ 77,19,573 షేర్లను (1.99 శాతం) ఒక్కో షేరుకు సగటున రూ. 4,362.04 రేటుతో విక్రయించింది. దీనితో సంస్థలో ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ వాటా 37.75 శాతం నుంచి 35.76 శాతానికి తగ్గింది. మరోవైపు, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ మారిషస్ 31.23 లక్షల షేర్లను కొనుగోలు చేసింది.

మంగళవారం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు 4 శాతం క్షీణించి రూ. 4,368 వద్ద క్లోజయ్యింది.

నోకియా 3210 రీఎంట్రీ



25 ఏళ్ల తర్వాత తిరిగి మార్కెట్లోకి
విక్రయ ధర రూ.3,999

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నోకియా 3210.. సంచలనం సృష్టించిన ఈ మాస్ మార్కెట్ ఫీచర్ ఫోన్ 25 ఏళ్ల తర్వాత తిరిగి రీఎంట్రీ ఇచ్చింది. 2.4 అంగుళాల టీఎఫ్‌టీ ఎల్‌సీడీ స్క్రీన్ సహా హెచ్ఎండీ గ్లోబల్ సరికొత్త ఫీచర్లతో నోకియా 3210 4జీ మోడల్‌కు రూపకల్పన చేసింది. 9.8 గంటలపాటు కాల్స్ చేసుకోవచ్చు. యూట్యూబ్, యూట్యూబ్ షార్ట్స్, న్యూస్, యూపీఐ, స్నేక్ గేమ్ వంటి హంగులను జోడించింది. మూడు రంగుల్లో తయారైంది. హెచ్ఎండీ, అమెజాన్ పోర్టల్స్‌లో లభిస్తుంది. 1999 మార్చిలో మార్కెట్లోకి వచ్చిన నోకియా 3210 ఫోన్‌ను ప్రపంచవ్యాప్తంగా 16 కోట్ల కుపైచిలుకు మంది కస్టమర్లు కొనుగోలు చేశారు. పాత ఫోన్‌కు 1.5 అంగుళాల స్క్రీన్ ఉండేది.

సెబీ.. ఇన్వెస్టర్ సర్టిఫికేషన్

ఉచిత స్వచ్ఛంద ఆన్‌లైన్ పరీక్షకు సై



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వ్యక్తిగత ఇన్వెస్టర్లకు సర్టిఫికేషన్ పరీక్షను నిర్వహించనుంది. దీంతో ఉచితంగా స్వచ్ఛంద పద్ధతిలో ఇన్వెస్టర్లు ఆన్‌లైన్‌లో పరీక్షను రాయడం ద్వారా సర్టిఫికేషన్‌ను అందుకునేందుకు వీలుంటుంది. తద్వారా రిటైల్ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు సంబంధించి సమగ్ర విజ్ఞానాన్ని పొందవచ్చని ఒక ప్రకటనలో సెబీ పేర్కొంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ (ఎన్ఐఎస్ఎం) సహకారంతో అభివృద్ధి చేసిన సర్టిఫికేషన్‌ను సెబీ జారీ చేయనుంది. వెరసి ఇన్వెస్టర్లు స్వచ్ఛందంగా మార్కెట్లు, పెట్టుబడుల విషయంలో తమ విజ్ఞానాన్ని పరీక్షించుకునేందుకు వీలుంటుందని పేర్కొంది. రిటైల్ ఇన్వెస్టర్లు దేశీ సెక్యూరిటీల మార్కెట్లో ప్రావీణ్యాన్ని పెంచుకునేందుకు పరీక్ష ఉపయోగపడుతుందని తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-6-2024	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	530-00
లిటిల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

టెక్నాలజీ, తయారీపై ప్రభుత్వం ఫోకస్

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం టెక్నాలజీ, తయారీ రంగంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోందని ఎలక్ట్రానిక్స్, ఐటీ తదితర శాఖల మంత్రిగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన అశ్విని వైష్ణవ్ తెలిపారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీతో పాటు టెక్నాలజీ, డిజిటల్ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. జన్‌ధన్, ఆధార్ తదితర ప్రోగ్రామ్‌ల ద్వారా గత పదేళ్లుగా సామాన్యులకు డిజిటల్ ఇండియా కార్యక్రమం సాధికారత కల్పించిందని మంత్రి చెప్పారు. టెక్నాలజీతో ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చేందుకు, కొత్త తరం సాంకేతికతతో యువతకు ఆశావహమైన భవిష్యత్తును అందించేందుకు తాను కృషి చేస్తానని వివరించారు. ''డిజిటల్ టెక్నాలజీల ద్వారా ప్రజల జీవితాల్లో పరివర్తన తెచ్చే దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం కొనసాగుతుంది. సెమీకండక్టర్లు, టెలికం టెక్నాలజీ, తయారీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారత్ అగ్రగామిగా ముందుంటుంది'' అని వైష్ణవ్ చెప్పారు.

ప్యాసింజర్ వెహికిల్స్ విక్రయాల్లో వృద్ధి



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా మే నెలలో తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరిన ప్యాసింజర్ వెహికిల్స్ సంఖ్య 3,47,492 యూనిట్లుగా ఉంది. 2023 మే నెలతో పోలిస్తే ఇది 4 శాతం అధికం. టూవీలర్లు 10 శాతం పెరిగి 16,20,084, త్రిచక్ర వాహనాలు 15 శాతం ఎగసి 55,763 యూనిట్లకు చేరుకున్నాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) తెలిపింది.

హ్యుందాయ్ మోటార్ డిజిటల్ ఫ్లోట్స్



హైదరాబాద్: స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ హ్యుందాయ్ మోటార్ తమ గ్రామీణ ప్రాంతాల అవుట్‌లెట్స్‌లో కొత్తగా డిజిటల్ ఫ్లోట్స్‌ను ప్రారంభించింది. కొనుగోలుదారులు తమ ఇంటి దగ్గరే, తమ వీలును బట్టి హ్యుందాయ్ కార్లలో ప్రయాణ అనుభూతిని తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడనుంది. ఇందుకోసం నేరుగా కొనుగోలుదారుల ఇంటి వద్దకే 'గ్రాండ్ ఐటీ నియోస్' హ్యాచ్‌బ్యాక్, 'ఎక్స్‌టర్, వెన్యూ' ఎస్‌యూవీలను సంస్థ చేరుస్తుంది. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు ఈ ఫ్లోట్స్ ఉపయోగపడనున్నాయి. 4 డిజిటల్ ఫ్లోట్స్‌ను ఏర్పాటు చేసినట్లు, వీటి ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 75 పైచిలుకు గ్రామాల్లో కస్టమర్లను చేరుకోవాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ తెలిపింది. ఈ వాహనాలను ప్రమోట్ చేసేందుకు రెండు రాష్ట్రాల్లో పర్యటించే డిజిటల్ వ్యాన్లను హ్యుందాయ్ మోటార్ ఇండియా ఆర్ఎస్‌హెచ్ జి. రామ్‌కుమార్, ఆర్‌పీసీహెచ్ స్వప్నిల్ చౌదరి, ఆర్ఎస్‌వో మేనేజర్లు రోహిత్, హరితేజ్, మార్కెటింగ్ మేనేజర్ రాజేశ్ సాహూ తదితరులు ఆవిష్కరించారు.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

బీఎస్ఎఫ్‌లో 1,526 ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్, వారెంట్ ఆఫీసర్, హవల్దార్(క్లర్క్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అస్సాం రైఫిల్ ఎగ్జామినేషన్-2024 ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్నారు. అర్హులైన పురుష/మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1,526.

పోస్టుల వివరాలు

» హెడ్ కానిస్టేబుల్(హెచ్‌సీ)(మినిస్టీరియల్/కంబాటెంట్ మినిస్టీరియల్),హవల్దార్(క్లర్క్)-1283
» అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్(ఏఎస్సై)-(స్టెనోగ్రాఫర్/కంబాటెంట్ స్టెనోగ్రాఫర్), వారెంట్ ఆఫీసర్(పర్సనల్ అసిస్టెంట్)-243.
» **అర్హత:** పోస్టును అనుసరించి 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. టైపింగ్,స్టెనోగ్రఫీ సర్టిఫికేట్, నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.07.2024
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

ఐబీపీఎస్-ఆర్ఆర్‌బీల్లో 9,995 గ్రూప్-ఏ, గ్రూప్-బీ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. రీజనల్ రూరల్ బ్యాంక్(ఆర్ఆర్‌బీ)ల్లో కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్-గీఐఐఐ(సీఆర్‌పీ) ద్వారా గ్రూప్ ఎ-ఆఫీసర్(స్కేల్-1, 2, 3), గ్రూప్ బి-ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **గ్రామీణ బ్యాంక్‌లు:** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విదర్భ కొంకణ్ గ్రామీణ బ్యాంక్ తదితరాలు.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 9,995.
» **పోస్టుల వివరాలు:** ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్)-5,585, ఆఫీసర్ స్కేల్ 1-3499, ఆఫీసర్ స్కేల్ 2(అగ్రికల్చర్ ఆఫీసర్)-70, ఆఫీసర్ స్కేల్ 2(లా)-30, ఆఫీసర్ స్కేల్ 2(సీఏ)-60, ఆఫీసర్ స్కేల్ 2(ఐటీ)-94, ఆఫీసర్ స్కేల్ 2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్)-496, ఆఫీసర్ స్కేల్ 2(మార్కెటింగ్ ఆఫీసర్)-11, ఆఫీసర్ స్కేల్ 2(ట్రెజరీ మేనేజర్)-21, ఆఫీసర్ స్కేల్ 3-129.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.06.2024 నాటికి ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్) 18 నుంచి 30 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-2(మేనేజర్) 21 నుంచి 32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-3(సీనియర్ మేనేజర్) 21 నుంచి 40 ఏళ్లు, ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 07.06.2024 నుంచి 27.06.2024 వరకు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు తేదీలు:** 07.06.2024 నుంచి 27.06.2024 వరకు.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష కాల్ లెటర్ డౌన్‌లోడ్:** జూలై/ఆగస్ట్ 2024.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేది:** ఆగస్ట్, 2024.
» **ఆన్‌లైన్ మెయిన్స్/సింగిల్ పరీక్ష తేది:** సెప్టెంబర్/అక్టోబర్ 2024.
» **ఇంటర్వ్యూ తేదీలు(ఆఫీసర్స్ స్కేల్ 1, 2, 3):** నవంబర్, 2024.
» **ప్రొవిజనల్ అలాట్‌మెంట్:** జనవరి, 2025.
» **వెబ్‌సైట్:** https://www.ibps.in

ఎస్‌బీఐలో 150 ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సెంట్రల్ రిక్రూట్‌మెంట్-ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్..రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
» **పోస్టుల వివరాలు:** ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)-మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-స్కేల్2-150.
» **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 31.12.2023 నాటికి 23 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. » **పే స్కేల్:** నెలకు రూ.48,170 నుంచి రూ. 69,810 లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.06.2024
» **వెబ్‌సైట్:** https://sbi.co.in

విద్యా రుణం.. భవితకు వరం!

నచ్చిన కోర్సులో, మెచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో చేరి.. బంగారు భవితకు బాటలు వేసుకోవాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశించే వారెందరో! కానీ.. భారీ ఫీజుల కారణంగా కోరుకున్న కోర్సులో చేరలేకపోతున్నారు. ఎంతో ప్రతిభ ఉన్నా.. రూ.లక్షల్లో ఫీజులు కట్టలేక అడ్మిషన్ వదులుకుంటున్నారు. ఇలాంటి వారికి అండగా నిలుస్తున్నాయి బ్యాంకుల ఎడ్యుకేషన్ లోన్స్! 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో.. విద్యారుణాలపై ప్రత్యేక కథనం..

» ఉన్నత విద్యకు ఊతంగా విద్యా రుణాలు
» ప్రతిభావంతులకు సులభంగానే బ్యాంకు రుణం
» రీ పేమెంట్ విధానంలోనూ పలు వెసులుబాట్లు
» విద్యాలక్ష్మి పోర్టల్‌తో సింగిల్ విండో దరఖాస్తు



హయ్యర్ ఎడ్యుకేషన్

ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో ప్రముఖ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో చేరాలంటే.. ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.లక్షన్నరకుపైగా ఫీజు ఉంది. జాతీయ స్థాయిలో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీల్లో సెమిస్టర్‌కు రూ.లక్ష వరకు; ఎన్ఐటీల్లో సెమిస్టర్‌కు రూ.65 వేల నుంచి రూ.70 వేలు వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. మేనేజ్‌మెంట్ విద్యకు సంబంధించి దేశంలోని ప్రముఖ బీస్కూల్స్ ఐఐఎంల్లో ఎంబీఏ ప్రోగ్రామ్‌కు రూ.20 లక్షలకు పైగానే ఫీజు ఉంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులకు కూడా పేరున్న కాలేజీలో రూ.50 వేల వరకు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. ఇక విదేశీ విద్యకు సగటున ఏడాదికి రూ.50 లక్షల వరకు వ్యయం అవుతోంది. ఇలా లక్షల్లో ఉన్న ఫీజులు చెల్లించలేక ఇబ్బందిపడుతున్న విద్యార్థులకు బ్యాంకులు చేయూతనందిస్తున్నాయి. విద్యా రుణాలు మంజూరు చేస్తూ వారి ఉన్నత విద్యకు సహకరిస్తున్నాయి.

అర్హతలు

ఎంట్రన్స్ టెస్టులో ఉత్తీర్ణత సాధించి కన్వీనర్ కోటాలో సీటు పొందిన విద్యార్థులకే విద్యా రుణ దరఖాస్తుకు బ్యాంకులు అర్హత కల్పిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ఎంట్రన్స్‌లో మెరిట్ పొందిన వారికే విద్యా రుణ మంజూరులో ప్రాధాన్యం ఇస్తున్నాయి. పలు ప్రైవేట్ బ్యాంకులు మాత్రం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశం పొందిన వారికి కూడా విద్యా రుణ దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఆయా బ్యాంకులు తమ అంతర్గత విధి విధానాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తున్నాయి.

గుర్తింపు తప్పనిసరి

విద్యా రుణాలను మంజూరుకు బ్యాంకులు నిర్దిష్ట నిబంధనలను అనుసరిస్తున్నాయి. ఏఐసీటీఈ, యూజీసీ, విద్యాశాఖ గుర్తింపు ఉన్న కళాశాలలు, కోర్సులనే విద్యా రుణ మంజూరులో పరిగణనలోకి తీసుకుంటున్నాయి. గుర్తింపున్న ఇన్‌స్టిట్యూట్‌లలో, కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకే విద్యా రుణం కోసం దరఖాస్తుకు అర్హత కల్పిస్తున్నాయి.

విదేశీ విద్యకు సైతం

విదేశీ విద్య అభ్యర్థులు కూడా విద్యారుణాలు పొందే అవకాశం ఉంది. దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.పది లక్షల వరకూ రణం లభిస్తోంది. అదేవిధంగా విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్ లభించిన వారికి గరిష్ఠంగా రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నారు.

మూడు శ్లాబ్‌లు

- ఎడ్యుకేషన్ లోన్స్ మంజూరుకు బ్యాంకులు మూడు శ్లాబ్‌ల విధానాన్ని అమలు చేస్తున్నాయి.
- శ్లాబ్-1లో.. రూ.4 లక్షల రుణ మొత్తంగా నిర్ధయించారు. ఈ శ్లాబ్‌లో రుణ మంజూరుకు విద్యార్థులు ఎలాంటి హామీ ఇవ్వక్కర్లేదు.
- శ్లాబ్-2లో.. రూ.4 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు రుణ మొత్తాన్ని కేటాయిస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల హామీ, థర్డ్ పార్టీ గ్యారెంటీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.
- శ్లాబ్-3లో.. రూ.7.5 లక్షలకు పైగా రుణ మొత్తం ఉంటోంది. దీనికి దరఖాస్తు చేయాలనుకుంటే ఈ మొత్తానికి సరిపడే కొల్లేటరల్ సెక్యూరిటీ (స్థిరాస్తి పత్రాలను) చూపాల్సి ఉంటుంది.

మార్జిన్ మనీ

విద్యార్థులు తాము దరఖాస్తు చేసుకున్న రుణ మొత్తంలో కొంత మొత్తాన్ని మార్జిన్ మనీగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. రూ.4 లక్షల వరకు ఎలాంటి మార్జిన్ మనీ అవసరం లేదు. కాని రూ.4 లక్షలు దాటితే మాత్రం స్వదేశంలో చదివే విద్యార్థులు అయిదు శాతం, విదేశీ విద్య విద్యార్థులు 15 శాతం మార్జిన్ మనీని సమకూర్చుకోవాలి.

రుణం.. ఈ వ్యయాలకే

కోర్సు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఎగ్జామినేషన్/లైబ్రరీ/లేబొరేటరీ ఫీజు, విదేశీ విద్య ప్రయాణ ఖర్చులు, పుస్తకాలు, యూనిఫామ్, ఇతర అకడమిక్ సంబంధిత పరికరాల కొనుగోలుకు అయ్యే ఖర్చు, కంప్యూటర్ కొనుగోలు వ్యయం, స్టడీ టూర్స్, ప్రాజెక్ట్ వర్క్స్, ఇన్‌స్టిట్యూట్‌లు వసూలు చేసే కాషన్ డిపాజిట్, బిల్డింగ్ ఫండ్, రిఫండబుల్ డిపాజిట్‌లకు సంబంధించిన వ్యయాలకు విద్యా రుణాలు మంజూరు చేస్తున్నారు.

టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌కు మినహాయింపు

ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ నిబంధనల ప్రకారం-గరిష్ఠ రుణ మొత్తం మంజూరులో నిర్దిష్ట నిబంధనలు ఉన్నప్పటికీ.. విద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందితే గరిష్ఠ రుణ మొత్తాన్ని పెంచే విచక్షణాధికారం బ్యాంకులకు కల్పించింది. ఉదాహరణకు ఐఐఎంలు, ఐఐటీల వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో రూ.పది లక్షల కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన వారికి గరిష్ఠ రుణం విషయంలో సడలింపు ఇచ్చే అవకాశం ఉంది.

నిరంతర సమీక్ష

విద్యా రుణం మంజూరు చేసిన బ్యాంకులు.. వాటిని విడతల వారీగా ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌కు నేరుగా చెల్లిస్తాయి. తొలి దశలో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లించి ఉంటే.. సంబంధిత రశీదుల ఆధారంగా తొలిదశ ఫీజును విద్యార్థికి అందిస్తాయి. ఆ తర్వాత నుంచి ఇన్‌స్టిట్యూట్‌కు నేరుగా పంపుతాయి. అంతకుముందు సంవత్సరంలో సదరు విద్యార్థి అకడెమిక్‌గా చూపిన ప్రతిభ గురించి సమీక్ష చేస్తున్నాయి. దీని ఆధారంగా మిగతా రుణం చెల్లింపుపై నిర్ణయం తీసుకుంటున్నాయి.

రీ పేమెంట్ హాలిడే

ఎడ్యుకేషన్ లోన్ తిరిగి చెల్లించే విషయంలో బ్యాంకులు రీ పేమెంట్ హాలిడే పేరుతో వెసులుబాటు కల్పిస్తున్నాయి. కోర్సు పూర్తి చేసుకున్న సంవత్సరం తర్వాత లేదా ఉద్యోగం లభించినప్పటి నుంచి వాయిదాల పద్ధతిలో రుణం తిరిగి చెల్లించే అవకాశం ఉంది. ఇలా గరిష్ఠంగా 15 ఏళ్ల వ్యవధిలో ఈఎంఐ విధానంలో రుణం చెల్లించొచ్చు. మహిళా విద్యార్థులకు వడ్డీ రేట్లలో 0.5 శాతం నుంచి ఒక శాతం వరకు రాయితీ ఇస్తున్నాయి.

పూర్తి అవగాహన

ఎడ్యుకేషన్ లోన్స్ ద్వారా ఉన్నత విద్యను అభ్యసించాలని కోరుకునే విద్యార్థులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా ఆయా బ్యాంకుల నిబంధనలు, వడ్డీ రేట్లపై స్పష్టత ఏర్పరచుకోవాలి. దీంతో పాటు రీపేమెంట్ విధానం గురించి తెలుసుకోవాలి. అదేవిధంగా తమకు ప్రవేశం ఖరారు చేసిన ఇన్‌స్టిట్యూట్‌కు ఏఐసీటీఈ, యూజీసీ తదితర నియంత్రణ సంస్థల గుర్తింపు గురించి వాకబుచేయాలి.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు

- ప్రవేశ ధ్రువీకరణ పత్రం, అకడమిక్ అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు; తల్లిదండ్రుల ఆదాయ ధ్రువీకరణ; తల్లిదండ్రుల ఆదాయ స్థితిగతుల వివరాలు; బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్స్; నివాస ధ్రువీకరణ; థర్డ్‌పార్టీ ఆదాయ ధ్రువీకరణ; కోర్సు వ్యయానికి సంబంధించి ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి అధీకృత లెటర్స్.
- వివరాలకు వెబ్‌సైట్: www.iba.org.in

విద్యా లక్ష్మి పోర్టల్

ఎడ్యుకేషన్ లోన్స్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సౌలభ్యం కోసం కేంద్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తోంది. విద్యార్థులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. విద్యా లక్ష్మి పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో లాగిన్ అయి.. కామన్ ఎడ్యుకేషనల్ లోన్ అప్లికేషన్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను.. ప్రాథమ్యంగా పేర్కొన్న బ్యాంకులకు పంపిస్తారు. ఆ తర్వాత దశలో సదరు బ్యాంకులు దరఖాస్తును పరిశీలించి సంతృప్తి చెందితే.. ఏ బ్రాంచ్‌లో సంప్రదించాలి, ఏ ఏ పత్రాలు తీసుకెళ్లాలి అనే వివరాలను విద్యార్థులకు పంపుతాయి. విద్యాలక్ష్మి పోర్టల్ విద్యా రుణాల విషయంలో విద్యార్థులకు, బ్యాంకులకు అనుసంధానకర్తగా ఉంటోంది.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.vidyalakshmi.co.in

క్యాష్ 'హంట్'



బస్టాండ్, స్ట్రీట్ డస్ట్‌బిన్, పార్కు ఇలా అక్కడక్కడా డబ్బులు పెడుతున్న వ్యక్తులు

ఆ డబ్బుల కోసం ఎగబడుతున్న ఫాలోవర్స్.. ఇదంతా వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో పోస్టులు..

లక్షల్లో వ్యూస్ కోసమే..

సిటీలో సరికొత్త ట్రెజర్ హంటింగ్

→ జనాలతో సందడిగా ఉండే ప్రాంతం అది..ఒక వ్యక్తి తొందరతొందరగా వచ్చి ఫుట్‌పాత్‌పై ఉన్న చెత్తకుండీకి అంటించి ఉన్న కవర్ తీసుకొని అందులోని 500 రూపాయల నోట్ జేబులో పెట్టుకొని వెళ్లిపోయాడు.

→ మనుషులే లేని మరో నిర్మానుష్య ప్రాంతంలోని పాడుబడిన పాతబస్టాండ్‌లోకి వేగంగా వెళ్లి ఇనుప చువ్వలో దాచిన వెయ్యి రూపాయలు తీసుకొని వెళ్లాడు మరొకతను.



సాక్షి, హైదరాబాద్: నగరంలోని ట్యాంక్‌బండ్, సచివాలయం, అసెంబ్లీ, క్రికెట్ స్టేడియం వంటి పరిసర ప్రాంతాలతోపాటు బస్టాండ్‌లు, పార్కులు, ఫ్లైఓవర్లు ఇలా ఎక్కడ పడితే అక్కడ డబ్బులు దొరుకుతున్నాయి. నగరంలో న్యూ ట్రెండ్‌గా మారింది ఈ తరహా ట్రెజర్.. కాదుకాదు క్యాష్ హంటింగ్. నగరంలోనే కాదు..నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్లలో సైతం మనీ హంటింగ్ కొనసాగించడం విశేషం. కొందరు వ్యక్తులు ఇలా డబ్బులను వివిధ ప్రాంతాల్లో పెట్టి అంతా వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. వీటి కోసం ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వేదికగా ప్రత్యేకంగా సైట్లు, సోషల్ పేజ్‌లు తయారు చేసుకున్నారు. ఇందులోని ఫాలోవర్స్ వీడియో పోస్ట్ చేసిన నిమిషాల్లో అక్కడకు చేరుకొని డబ్బులు సొంతం చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఇప్పుడిది కొత్త ట్రెండ్. మరికొందరు యాక్సెసరీస్ ప్యాక్ చేసి పెట్టి వారి స్టోర్ లేదా బ్రాండ్‌లను ప్రమోట్ చేసుకుంటున్నారు. ఈ తరహా సోషల్ మీడియా అకౌంట్లకు పెద్దఎత్తున ఫాలోవర్స్ ఉండటం విశేషం.

వ్యూస్, లైక్స్ కోసమేనా??

సోషల్‌మీడియా వేదికగా అత్యధిక ఫాలోవర్స్‌ను ఆకర్షించడం, వ్యూస్, లైక్స్ సంఖ్య పెంచుకోవడానికి ఈ తరహా ట్రెజర్ హంటింగ్ నిర్వహిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఎక్కువ ఫాలోవర్స్ ఉంటే సోషల్‌మీడియాలో ఫేమ్‌తో పాటు యాడ్స్ రూపంలో ఆర్థిక వెసులుబాటు కూడా లభిస్తుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడెప్పుడు హంట్ వీడియో పెడతారా అని ఫాలోవర్స్ చేతిలో ఫోన్ పట్టుకొని కూర్చుంటున్నారు. ఇలా ఎవరు ముందు వచ్చి ఈ డబ్బులు తీసుకున్నారనేది కూడా వీడియో తీసి అదే సోషల్ సైట్లలో పెడుతుంటే వాటికి కూడా లక్షల్లో వ్యూస్ వస్తున్నాయి.

108లో ఆస్పత్రికి తీసుకెళ్తే.. మద్యం కోసం వైన్ షాపునకు వెళ్లాడు

బోధన్‌లో ఓ రోగి నిర్వాకం

బోధన్ టౌన్ (బోధన్): అత్యవసర వైద్య సేవలకు వినియోగించాల్సిన 108 అంబులెన్స్‌ను ఓ ప్రబుద్ధుడు మద్యం కొనుగోలు కోసం దుర్వినియోగం చేసిన ఘటన బోధన్‌లో చోటు చేసుకుంది. ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ గ్రామానికి చెందిన శంకర్ మంగళవారం రాత్రి తన ఆరోగ్యం బాగా లేదని 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఫోన్ కాల్ రిసీవ్ చేసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకొని బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది శంకర్ పేరు నమోదు చేసుకొని కొద్ది సేపట్లో డాక్టర్ వస్తారు.. కూర్చోమని చెప్పారు. అయితే ఈలోగా శంకర్ ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లి కొద్ది దూరంలో ఉన్న మద్యం దుకాణానికి చేరుకొని మద్యం కొనుగోలు చేస్తుండగా గమనించిన 108 సిబ్బంది శంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాచార కమిషనర్ల భర్తీకి మళ్లీ నోటిఫికేషన్

- ఈ నెల 29 వరకు దరఖాస్తులకు గడువు
- గతంలో వచ్చిన దరఖాస్తులపై నిర్ణయం తీసుకోని సర్కారు
- అప్పుడు దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌తోపాటు రాష్ట్ర సమాచార కమిషనర్ పదవులకు అర్హులైనవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రకటన జారీ చేసింది. అర్హతలు కలిగినవారు సరైన పత్రాలు, ఆధారాలతో ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తు నమూనాతో పాటు ఇతర వివరాల కోసం https://telangana.gov.in లేదా https://tsic.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తులను 'రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, హైదరాబాద్– 500022'.. చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్‌లో చీఫ్ కమిషనర్‌తోపాటు 10 మందికి మించకుండా రాష్ట్ర సమాచార కమిషనర్లను నియమించడానికి చట్టం అవకాశం కల్పిస్తోంది. సీఎం నేతృత్వంలో శాసనసభ విపక్ష నేత, సీఎం ఎంపిక చేసిన ఓ రాష్ట్రమంత్రి సభ్యులుగా సెలక్షన్ కమిటీ ఉంటుంది. ఈ కమిటీ దరఖాస్తులను వడబోసి ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్లను ఎంపిక చేస్తుంది. రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో వీరి నియామకాన్ని ప్రకటిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. ప్రధాన సమాచార కమిషనర్ బుద్దా మురళి పదవీకాలం 2022 సెప్టెంబర్ 24న, మరో ఐదుగురు సమాచార కమిషనర్ల పదవీకాలం గత ఫిబ్రవరి 24న పూర్తయ్యింది. ప్రస్తుత రాష్ట్ర సమాచార కమిషన్ పూర్తిగా ఖాళీ అయ్యింది. 2023 జూలై 4న గత బీఆర్ఎస్ సర్కారు సమాచార కమిషనర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, అప్పట్లో వచ్చిన దరఖాస్తులను ఇంకా పెండింగ్‌లో ఉంచారు. అప్పట్లో దరఖాస్తు చేసు కున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.